ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

రాజమహేంద్రవరం

: fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

4-9-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 216 పేజీలు: 8+4 వెల: 6.50


ట్రంప్‌కు మళ్లీ షాక్! జన్మతః పౌరసత్వం కొత్త ఆదేశాలూ నిలిపివేసిన కోర్టు 5లో

సుంకాలపై రాయితీ ఇస్తేనే అమెరికాతో వాణిజ్య ఒప్పందం



## భారత్, బెల్జియం వాణిజ్యం ఐదేళ్లలో రెట్టింపు

ఢిల్లీలో ప్రధాని మోడీతో బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ భేటీ

భాగస్వామ్యం బలోపేతానికి అధినేతల అంగీకారం

రక్షణ, వాణిజ్యంలో ద్వైపాక్షిక ఒప్పందాలు 5లో



## రష్యా ఉక్రెయిన్ యుద్ధం మధ్యవర్తిత్వానికి భారత్ సిద్ధం

కీవ్ వేదికగా కేంద్ర మంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు

**కీవ్, సెప్టెంబరు 3:** రష్యా- ఉక్రెయిన్ మధ్య గత నాలుగున్నరేళ్లుగా యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఇరు దేశాలూ పరస్పరం దాడులు చేసుకుంటూనే ఉన్నాయి. అయితే భారత విదేశాంగ మంత్రి జై శంకర్ ప్రస్తుతం ఉక్రెయిన్‌లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. ఉక్రెయిన్ రాజధాని కీవ్ నగరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రష్యా - ఉక్రెయిన్ యుద్ధంపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరు దేశాల మధ్య శాంతిని నెలకొల్పేందుకు భారత్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని.. మధ్యవర్తిత్వంతో సహా ఇతర సహాయానికి కూడా భారత్ రెడీ అని తెలిపారు. ఉక్రెయిన్-రష్యా మధ్య శాంతికుదరడమే ప్రాధాన్యం అనితెలిపారు. ఇరు దేశాల మధ్య చర్చలు, మధ్యవ >>2

## స్థానిక పోరుకు రెడీ!

● అక్టోబరు నెలాఖరులోపు పూర్తికి చర్యలు ● రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర కార్యాచరణ ● డీలిమిటేషన్ ప్రక్రియపై పిటిషన్లు కొట్టేసిన హైకోర్టు ● మంత్రులు, పార్టీ నేతలతో సిఎం డిన్నర్ భేటీ ● ఎన్నికల వ్యూహం, సమన్వయంపై సుదీర్ఘ చర్చలు ● అటు మంత్రులతో లోకేష్ అల్పాహార విందు సమావేశం ● ఎన్నికలు వాయిదా పడే ప్రసక్తే లేదని స్పష్టీకరణ



**విజయవాడ, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర కసరత్తు చేస్తోంది. తొలుత మున్సిపాలిటీలు, తర్వాత ఎంపిటిసి, జడ్‌పిసి, ఆతర్వాత సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని కూటమి ప్రభుత్వం యోచిస్తోంది. ఈ దిశగా కార్యా చరణకు శ్రీకారం చుట్టింది. అటు పురపాలక సంఘా లలో వార్డుల పునర్విభజన చేయవద్దని దాఖలైన మొత్తం 50 పిటిషన్లు హైకోర్టు కొట్టివేసింది. ఎస్ఐఆర్ ప్రక్రియ నడిచే సమయంలో వార్డుల విభజన సరికాదని పిటిషన్లు దాఖలైన విషయం తెలిసిందే. అయితే, తాము వార్డుల వైశాల్యం జోలికి వెళ్ళడం లేదని చట్ట నిబంధనల మేరకు ప్రభుత్వం ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లడంతో ఇరువర్గాలు వాదనలు విని, పిటిషన్లు అన్నింటిని కొట్టివేస్తూ హైకోర్టు తీర్పు వెల్లడించింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా పెరిగిన వార్డుల ప్రకారం జరగనున్న స్థానిక ఎన్నికలు నిర్వహణకు లైన్‌క్లియర్ అయింది.

**స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి: సిఎం చంద్రబాబు డిన్నర్ మీట్**

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్షా సమావేశం నిర్వహించారు. గుంటూరుజిల్లా ఉండవల్లిలోని సిఎం నివాసంలో మంత్రులు, >>2

## క్రెడిట్ మనదే!

ఏ ప్రాజెక్ట్ పూర్తయినా అది కూటమి ప్రభుత్వం చేసిందే

మనం చేస్తున్న మంచిని జెన్ జీ వద్దకు తీసుకువెళ్లాలి

కేబినెట్ సమావేశంలో మంత్రులకు సిఎం దిశానిర్దేశం

31 అజెండా అంశాలకు మంత్రిమండలి ఆమోదం

అమరావతి సంగమం నిర్మాణానికి రూ.759.79 కోట్లు

పొగాకు రైతులకు డిబిటి ద్వారా రూ.94 కోట్ల ఆర్థిక సాయం

అమరావతిలో సిసి రోడ్ల స్థానంలో బిటి రోడ్లకు గ్రీన్‌సిగ్నల్

మత్స్యరంగాన్ని ప్రోత్సహించేలా రిజర్వాయర్ కేజ్ కల్చర్ పాలసీ

2026 ముసాయిదాకు ఓకే

సిఎంకి చప్పట్లతో మంత్రులు స్టాండింగ్ ఓవేషన్ గౌరవం



గురువారం కేబినెట్ హాలులోకి వచ్చే సమయంలో సిఎం కి స్టాండింగ్ ఓవేషన్ ఇస్తున్న మంత్రులు

**విజయవాడ, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** కొత్త జనరేషన్ జెన్ జీ అన్ని విషయాలపై అవగాహనతో ఉందని సిఎం చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేసారు. "జెన్‌జీ వాళ్లు సోషల్ మీడియాలో క్రియాశీలకంగా ఉన్నారు. మనం కూడా అందుకు తగినట్టుగా సిద్ధమవ్వాలి. మనం చేస్తున్న మంచిని జెన్ జీ వద్దకు తీసుకువెళ్లాలి అని సూచించారు. జెన్‌జీ తరహా వేదిక ద్వారా మనం ఎన్ని పనులు చేస్తున్నాం అనేది ప్రజలకు తెలియాలన్నారు. చేసిన సంక్షేమం, అభివృద్ధి ప్రజలకు చెప్పుకోవాలన్నారు. వైసిపి చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని మంత్రులతో చంద్రబాబు అన్నారు. తప్పుడు, ఫేక్ ప్రచారాలు చేయడంలో వైసిపి ముందు ఉంటుందని విమర్శించారు. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువకు నీటి విడుదలపై కూడా >>2

### ఎకరం కూడా ఎండిపోకూడదు

ఎల్ నినో ప్రభావంతో వర్షాలు అంతంత మాత్రమే

రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలి

కేబినెట్ భేటీలో విస్తృత చర్చ: మంత్రి పార్థసారధి 7లో

### వన్య ప్రాణుల మరణాలపై సమగ్ర అధ్యయనం

అటవీ శాఖ సలహాదారు, అదనపు ప్రధాన అటవీ సంరక్షణాధికారి నేతృత్వంలో కమిటీ 3లో

### ప్రైవేటు పాఠశాలల్లో 25% ఉచిత ప్రవేశాలు

అధ్యయనం, మార్గదర్శకాల సవరణకు కమిటీ ఏర్పాటు



గురువారం సచివాలయంలో శ్రీక్షేత్ర లాజిస్టిక్స్ సంస్థ ప్రతినిధులతో భేటీ అయిన మంత్రి బిసి జనార్దనరెడ్డి

## లాజిస్టిక్స్, ఏవియేషన్ రంగాల్లో పెట్టుబడుల వెల్లువ

రూ.300 కోట్లు పెట్టనున్న 'శ్రీక్షేత్ర'

భోగాపురం, కర్నూలు, విజయవాడ విమానాశ్రయాల్లో ఎంఆర్‌ఓ ఏర్పాటుకు మెల్‌స్టార్ ఏవియేషన్ ఆసక్తి

**విజయవాడ, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో లాజిస్టిక్స్, ఏవియేషన్ రంగాల్లో పెట్టుబడులకు ప్రముఖ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి తెలిపారు. సుస్థిర ప్రభుత్వం, సిఎం >>2

## రూ. 100 కోట్లతో వంద పడకలతో యోగా- ప్రకృతి వైద్య పరిశోధన సంస్థ


గుంటూరు శివారులోని నడింపాలెంలో ఏర్పాటు

కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు

రూ.9.94 కోట్లతో త్వరలో పనులు ప్రారంభం

మధుమేహం, రక్తపోటు, ఊబకాయం, శ్వాసకోశ, మానసిక ఒత్తిడి, ఇతర సమస్యలకు యోగా- నేచురోపతి విధానాల్లో చికిత్స

**విజయవాడ, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో కేంద్ర యోగా-ప్రకృతి వైద్య పరిశోధన సంస్థ ఏర్పాటుపై కేంద్రం నుంచి ఉత్తర్వులు అందినట్లు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఆ క్రమంలోనే గుంటూరు నగర సమీపంలోని ప్రత్తిపాడు మండలం నడింపాలెంలో కేంద్ర యోగా-ప్రకృతి వైద్య పరిశోధన సంస్థ ఏర్పాటు పనులు వేగం పుంజుకున్నాయని మంత్రి వివరించారు. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ యోగా అండ్ నేచురోపతి ద్వారా 100 పడకల ఆసుపత్రితో ఈ సంస్థను ఏర్పాటు చేయనున్నారు. సంస్థ ఏర్పాటుపై కేంద్రం నుంచి అధికారిక సమాచారం వచ్చినట్లు రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు. ఈ మేరకు మంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఇందుకు తగ్గట్లు సంస్థ ఏర్పాటుకు అవసరమైన భూమి, రహదారి, డ్రెయినేజీ, స్థల సమతలీకరణ తదితర ప్రాథమిక పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.9.94 కోట్లను మంజూరు చేసినందున తదుపరి పనుల్లో మర్నింత పెరుగుతుందని చెప్పారు. ప్రతిపాదిత స్థలంలో చేపట్టాల్సిన పనులపై రాష్ట్ర, జిల్లా అధికారులు, కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ప్రతినిధులతో ఆగస్టు 4న సంయుక్తంగా పరిశీలించారు.




స్థల అనుకూలత, మౌలిక వసతులను పరిశీలించిన అనంతరం పలు నిర్ణయాలు తీసుకున్నారు. అంగీకరించిన పనులను మూడు నెలల్లో పూర్తి చేసి భూమిని సిసిఆర్‌వైఎన్‌కు అప్పగించేలా చర్యలు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మంజూరైన రూ.9.94 కోట్లలో రూ.6.74 కోట్లు భూసంబంధిత అవసరాలకు, రూ.3.20 కోట్లు స్థల నింపుదల, సమతలీకరణకు కేటాయించారు. ప్రాంగణంలోని కొన్ని ప్రాంతాలు ఎన్‌హెచ్-16 స్థాయి కంటే 2-3 మీటర్ల మేర దిగువన ఉండటంతో అవసరమైన మేరకు నాణ్యమైన మట్టితో నింపి నిర్దేశిత స్థాయికి తీసుకురానున్నారు. సంస్థకు నేరుగా చేరుకునేలా జాతీయ రహదారి-16 నుంచి ఆనుకుని ఉన్న ప్రభుత్వ >>2

## ఎల్‌నినో ఎఫెక్ట్.. 'పవర్' పెరిగింది

275 మిలియన్ యూనిట్లకు పైగా విద్యుత్తు వినియోగం

నిరంతర విద్యుత్ సరఫరాకు ప్లాంట్లను సిద్ధం చేయాలి

ఉత్పత్తికి ఇబ్బంది లేకుండా 15 రోజుల బొగ్గు నిల్వలు తప్పనిసరి

అధికారులకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలు

**విజయవాడ, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో దానికి అనుగుణంగా ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలను పూర్తి స్థాయిలో సన్నద్ధం చేయాలని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో విద్యుత్‌శాఖ అధికారులతో గురువారం నిర్వహించిన సమీక్షలో ప్రస్తుత డిమాండ్, ఉత్పత్తి సామర్థ్యం, ప్లాంట్ల పనితీరు, భవిష్యత్తు అవసరాలపై మంత్రి చర్చించారు. ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరగడం, ఫలితంగా గృహ, వాణిజ్య,వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో విద్యుత్ వినియోగం పెరుగుతున్న విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. గతంలో రోజుకు సగటున 218 మిలియన్ యూనిట్లుగా ఉన్న విద్యుత్ వినియోగం ప్రస్తుతం 275 మిలియన్ యూనిట్లకు పైగా చేరిన నేపథ్యంలో, పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి ప్లాంట్లు సిద్ధంగా ఉంచాలని ఆయన అధికారులకు సూచించారు. ఎల్‌నినో ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో విద్యుత్ డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. >>2



## 'అక్షర ఆంధ్ర' అద్భుత ఫలితాలు


రెండేళ్లలో అక్షరాస్యత 72.6శాతం నుంచి 82.1శాతానికి పెరుగుదల

**విజయవాడ, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ప్రతి పౌరుడికి అక్షర జ్ఞానం అందించాలనే సంకల్పంతో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో చేపట్టిన 'అక్షర ఆంధ్ర' కార్యక్రమం అద్భుత ఫలితాలను సాధిస్తోంది. ప్రతి ఇంటా అక్షరం, ప్రతి చేతిలో జ్ఞానం ప్రతి పౌరుడి జీవితంలో వెలుగు అనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషి ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను సంపూర్ణ అక్షరాస్యత కలిగిన రాష్ట్రంగా నిలబెట్టడమే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర >>2

## ఇంద్రకీలాద్రిపై అక్టోబర్ 11నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



**విజయవాడ, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన కనకదుర్గాదేవి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు ముహూర్తం ఖరారైంది. అక్టోబరు 11 నుంచి 20వ తేదీ వరకు పది రోజుల పాటు ఈ ఆధ్యాత్మిక వేడుకలను నిర్వహించనున్నారు. శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులు ముమ్మర కసరత్తు ప్రారంభించారు. ఉత్సవాల సమయంలో రాష్ట్ర నలు మూలల నుంచి భక్తులు భారీగా ఇంద్రకీలాద్రికి తరలివస్తారు. జగన్మాత >>2




## నేడు నింగిలోకి జిఎస్‌ఎల్వీ ఎఫ్-17

కక్షలోకి చేరనున్న భూ పరిశీలన ఉపగ్రహం ఇఒఎస్ 05

**సూళ్లూరుపేట, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:** సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ శ్రీహరికోట నుంచి శుక్రవారం వేకువ జామున 2 గంటల 55 నిమిషాలకు ఇస్రోకు అత్యంత ప్రతిష్టాకరమైన జిఎస్ఎల్‌వి ఎఫ్-17 ప్రయోగం జరగనున్నది. ఈ ప్రయోగం ద్వారా భారత దేశ ప్రథమ భూ పరిశీలన ఉపగ్రహం ఇఒఎస్05 కక్షలోకి ఇస్రో శాస్త్రవేత్తలు ప్రవేశ పెట్టనున్నారు. ఇందుకు సంబంధించి బుధవారం రాత్రి 11గంటల 25నిమిషాలకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. >>2



## అక్రమాస్తుల కేసులో తిరుమల ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం అరెస్ట్

నెల్లూరు ఎసిబి కోర్టులో హాజరు

రూ.5కోట్లపైగా ఆస్తులున్నట్లు గుర్తింపు

**తిరుపతి,సెప్టెంబరు 3ప్రభాతవార్తప్రతినిధి:** ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలపై దాదాపు 30గంటలపైగా కొనసాగిన అవినీతి నిరోధకశాఖ (ఎసిబి) అధికారుల విచారణతో గురువారం మధ్యాహ్నం తిరుమల శ్రీవారి ఆలయ డిప్యూటీ ఇఒ మెండు లోకనాథంను అరెస్ట్ చేశారు. బుధవారం ఉదయం 6.30గంటల నుండి గురువారం మధ్యాహ్నం 12గంటల వరకు సుదీర్ఘంగా చేపట్టిన ఈ తనిఖీల్లో సుమారు ఐదుకోట్ల రూపాయలు పైగా విలువైన అక్రమ ఆస్తులు కలిగి ఉన్నాడని ఎసిబి అధికారులు తేల్చారు. ఇదేగాక ఒకటిన్నరరోజు కొనసాగిన తనిఖీల్లో ఆయన నివాసంలో రెండు కిలోల బంగారం, 6.5 >>2

## వివేకా హత్య కేసులో ఇడి దూకుడు

● రూ.40 కోట్ల ఆర్థిక లావాదేవీలపై ఆరా ● అప్రూవర్ దస్తగిరిని సుదీర్ఘంగా ప్రశ్నిస్తున్న అధికారులు ● బ్యాంక్ స్టేట్‌మెంట్లతో విచారణకు హాజరు ● హత్యకు ముందు, తర్వాతి లావాదేవీలపై ప్రత్యేక దృష్టి

**పులివెందుల, సెప్టెంబరు 3 ప్రభాత వార్త :** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈకేసులో సిబిఐకి అప్రూవర్‌గా మారిన షేక్ దస్తగిరిని ఇడి అధికారులు సుదీర్ఘంగా విచారిస్తున్నట్లుసమాచారం. ముఖ్యంగా హత్యకు ముందు, అనంతరం చోటుచేసుకున్న ఆర్థిక లావాదేవీలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

**రూ.40 కోట్ల డీల్‌పై ప్రశ్నలు**

వివేకానందరెడ్డి హత్యకు సంబంధించి గతంలో దస్తగిరి సిబిఐకి ఇచ్చిన వాంగ్మూలంలో కీలక విషయాలను వెల్లడించి నట్లు ప్రచారం జరిగింది. హత్యకు సంబంధించిన ఒప్పందంలో భారీ మొత్తంలో డబ్బు చేతులు మారినట్లు, మొత్తం వ్యవహారం సుమారు రూ.40 >>2



## తెలంగాణ కేబినెట్ నుంచి కొండా సురేఖ ఔట్

గవర్నర్‌కు సిఎం రేవంత్‌రెడ్డి సిఫారసు లేఖ

ఆమోదించినట్లు రాజ్‌భవన్ ప్రకటన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు3:** తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. రాష్ట్ర కాంగ్రెస్‌లో కొద్దిరోజులుగా నలుగుతున్న కొండా సురేఖ ఎపిసోడ్‌కు తెరపడింది. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సిఎం రేవంత్‌రెడ్డి గవర్నర్ శివ్ ప్రసాద్ శుక్లాకు లేఖను పంపారు. దీంతో మంత్రి కొండా సురేఖను కేబినెట్ నుంచి తొలగించడం ఖరారైంది. గురువారం రాత్రి కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించే అంశంపై గవర్నర్ తుది నిర్ణయం తీసుకున్నారు. మంత్రివర్గంనుంచికొండా సురేఖను >>2



గురువారం న్యూఢిల్లీలో మ్యాక్స్‌స్మార్ట్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో 400 పడకల కొత్త విస్తరణ భవన ప్రారంభోత్సవానికి వస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఢిల్లీ సిఎం రేఖాగుప్తాకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

# స్థానిక పోరుకు రెడీ!

>> పరిశీలకులు, రీజినల్ కోఆర్డినేటర్లు, సీనియర్ ఎమ్మెల్యేలతో ఆయన డిన్నర్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రులతో ప్రత్యేకంగా చర్చించారు. ఎన్నికల వ్యూహం, సమన్వయంపై సిఎం చంద్రబాబు సుదీర్ఘ చర్చలు జరిపారు. మిత్రపక్షాలతో సమన్వయంపైనా కూలంకషంగా మాట్లాడారు. స్థానిక సంస్థల ఫార్ములాతో పాటు వ్యూహంపై మంత్రులతో సమాలోచనలు చేశారు. అక్టోబర్‌లో ఎన్నికలు కచ్చితంగా ప్రారంభమవుతాయని పార్టీ శ్రేణులను సన్నద్ధం చేయాలని స్పష్టం చేశారు. పరిశీలకులు వెంటనే జిల్లాలకు వెళ్లాలని.. అందరూ సిద్ధం కావాలని సమావేశంలో పాల్గొన్న వారికి సిఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు.

**స్థానిక ఎన్నికలు వాయిదాపడే ప్రసక్తే లేదు: మంత్రి లోకేశ్**

స్థానిక ఎన్నికలు వాయిదాపడే ప్రసక్తే లేదు. ఎట్టిపరిస్థితులో అక్టోబరు లోపు పూర్తి చేస్తామని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేసారు. మంత్రివర్గ సమావేశానికి ముందు టిడిపి మంత్రులతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేశ్ బ్రేక్‌ఫాస్ట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ "అర్హులైన ప్రతిఒక్కరికీ అక్టోబర్ నెల నుంచి దశలవారీగా కొత్త పింఛన్లు ఇద్దాం. వచ్చిన దరఖాస్తులన్నీ పరిష్కరించుకుంటూ కొత్త పింఛన్లు ఇస్తూ వెళ్దాం. స్థానిక ఎన్నికలకు అంతా సిద్ధమై అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలి. అక్టోబర్‌లోగా ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుంది. స్థానిక ఎన్నికలు వాయిదాపడే ప్రసక్తే లేదు. కోర్టు పెండింగ్‌లో ఉన్నవి కూడా ఎన్నికలు జరిగేలా ప్రభుత్వం కృషిచేస్తోంది. త్వరితగతిన పరిష్కరించుకుని అన్నింటిలో ఎన్నికలు జరిగేలా ప్రభుత్వం కృషి. తొలుత పురపాలికలు, తర్వాత ఎంపిటిసి, జడ్పిటిసిలు, ఆతర్వాత పంచాయతీ ఎన్నికలు. ఎన్నికలు వాయిదా పడాలన్న గొడ్డలి పార్టీ కుయుక్తులు పనిచేయవు. స్థానిక ఎన్నికలు వాయిదా పడితే ఫైనాన్స్ కమిషన్ నిధులు ఆగిపోతాయనేది వైఎస్సార్సీపీ కుట్ర. కోర్టు కేసులు పరిష్కరించుకుని అనుకున్న సమయానికి ఎన్నికలు నిర్వహించి తీరుతాం. స్థానిక ఎన్నికలు వాయిదాపడే ప్రసక్తే లేద్నుు అని వివరించారు.

# యోగా- ప్రకృతి వైద్య పరిశోధన సంస్థ

>> భూమి మీదుగా 40 అడుగుల వెడల్పుతో అప్రోచ్ రోడ్డు నిర్మించనున్నారు. ఏర్పాటుకు కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ రూ.100 కోట్ల గ్రాంట్ అందించనుంది. సంస్థకు అవసరమైన భూమిని రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాల్సి ఉండటంతో, ప్రస్తుతం సంస్థ ఏర్పాటు కోసం అవసరమైన ప్రాథమిక పనులను చేపడుతోంది. ఆగస్టు 24న సంయుక్త తనిఖీలో తీసుకున్న నిర్ణయాలకు కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఆగస్టు 25న కేంద్రం రాష్ట్ర ఆయుష్ శాఖ డైరెక్టర్‌కు రాసిన లేఖలో నడింపాలెంలో 100 పడకల ఆసుపత్రితో దిశిత్రి ఏర్పాటుకు భూమిని స్వీకరించి తదుపరి చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొంది. అంగీకరించిన పనులన్నీ మూడు నెలల్లో పూర్తిచేయాలని కోరింది. గుంటూరు నగరానికి సమీపంలో, ఎన్‌హెచ్-16కు ఆనుకుని సంస్థ ఏర్పాటు కానుండటంతో రాకపోకలు సులభతరం కానున్నాయి. అప్రోచ్ రోడ్డు, బస్‌స్టాప్ వంటి సదుపాయాలతో ప్రజలకు అందుబాటు మెరుగుపడనుంది. ప్రాథమిక పనులు పూర్తయిన అనంతరం భూమిని దిదిశిత్రికు అప్పగించే ప్రక్రియ పూర్తి చేయనున్నారు. ఆ తర్వాత సంస్థ నిర్మాణానికి సంబంధించిన తదుపరి చర్యలు ప్రారంభమవుతాయి. నిర్మాణం పూర్తయితే 2028 నాటికి కార్యకలాపాలు ప్రారంభమయ్యే అవకాశం ఉందని ఆయుష్ కమీషనర్ గోపాలకృష్ణ తెలిపారు.00 పడకల ఇన్‌పేషెంట్ ఆస్పత్రి, బహుళ విభాగాల పరిశోధనకేంద్రంగా దీనిని అభివృద్ధి చేయనున్నారు. పురుషులు, మహిళలకు ప్రత్యేక సాధారణ, ప్రత్యేక వార్డులు ఉంటాయి. ఔట్ పేషెంట్ విభాగంలో వైద్య సంప్రదింపులు, ఆరోగ్య పరీక్షలు, జీవనశైలి, ఆహార సలహాలు, ఫాలోఅప్, నివారణాత్మక ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. అవసరాన్ని బట్టి రోగులను ఇన్‌పేషెంట్‌గా చేర్చి చికిత్స అందించడం, ల్యాబ్ పరీక్షలు లేదా అవసరమైన ఇతర వైద్య సంస్థలకు రిఫర్ చేస్తారు. మధుమేహం, రక్తపోటు, ఊబకాయం, మెటబాలిక్ సిండ్రోమ్, కీళ్ల వ్యాధులు, దీర్ఘకాలిక నొప్పులు, జీర్ణ-శ్వాసకోశ సమస్యలు, ఒత్తిడి, ఆందోళన, నిద్ర సమస్యలు, మహిళల ఆరోగ్య సమస్యలు, నాడీ సంబంధిత పునరావాస పరిస్థితులకు చికిత్స అందిస్తారు. పురుషులు, మహిళలకు ప్రత్యేక యోగా హాళ్లలో ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం, యోగా నిద్ర, యోగిక్ క్రియాలు నిర్వహిస్తారు. రోగుల ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక నేచురోపతి డైట్ కిచెన్ ద్వారా చికిత్సా ఆహారం అందిస్తారు. సుమారు 300 మంది సామర్థ్యంతో కాన్ఫరెన్స్ హాల్, వాకింగ్ ట్రాక్‌లు, ఔషధ మొక్కలు, ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం ఏర్పాటు చేయనున్నారు.

**పరిశోధన, ఉపాధికి ప్రాధాన్యం**

హెమటాలజీ, బయోకెమిస్ట్రీ, న్యూరో-సైకోఫిజియాలజీ, మాలిక్యులర్ బయాలజీ ప్రయోగశాలలతో యోగా-నేచురోపతిపై శాస్త్రీయ పరిశోధనలు, క్లినికల్ అధ్యయనాలు చేపడతారు. సుమారు 100-120 మందికి ప్రత్యక్ష ఉపాధి, 15-20 మంది బిఎన్‌వైఎస్ వైద్యులు సహా వివిధ నిపుణులకు అవకాశాలు లభించనున్నాయి. ఆరోగ్య శిబిరాలు, యోగా, ప్రజా అవగాహన కార్యక్రమాలతో ప్రజలకు సమగ్ర యోగా-నేచురోపతి సేవలు అందుబాటులోకి రానున్నాయి.

# ఇడి దూకుడు

>> కోట్లతో ముడిపడి ఉన్నట్లు ఆయన పేర్కొన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఎర్ర గంగిరెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డితో పాటు తనకు సంబంధించిన అంశాలపై ఇడి అధికారులు ప్రశ్నలు సంధిస్తున్నట్లు తెలుస్తోంది.హత్యకు పాల్పడితే తనకు రూ.5 కోట్లు ఇస్తామని చెప్పినట్లు దస్తగిరి గతంలో సిబిఐకి తెలిపినట్లు పేర్కొనబడింది. ఈ వాంగ్మూలంలో ఉన్న అంశాలను ఆధారంగా చేసుకుని ఆర్థిక కోణంలో ఈడీ దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సమాచారం. హత్యకు ముందు, తర్వాత నిందితులు, వారికి సంబంధించిన వ్యక్తుల బ్యాంక్ ఖాతాల్లో జరిగిన లావాదేవీలను ఇడి అధికారులు పరిశీలిస్తు న్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో దస్తగిరి బ్యాంక్ స్టేట్‌మెంట్లతో విచారణకు హాజరైనట్లు సమాచారం. నగదు లావాదేవీల మూలాలు, ఆర్థిక ప్రయోజనాలు, సంబంధిత వ్యక్తుల మధ్య జరిగిన లావాదేవీలపై అధికారులు వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది.

**దస్తగిరి వాంగ్మూలం నమోదు చేసిన అధికారులు..**

విచారణలో భాగంగా దస్తగిరి నుంచి ఇడి అధికారులు వాంగ్మూలాన్ని రికార్డు చేస్తున్నట్లు సమాచారం. గతంలో ఆయన ఇచ్చిన వాంగ్మూలం, ప్రస్తుతం సమర్పించిన బ్యాంక్ వివరాలను సరిపోల్చి పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఆర్థిక లావాదేవీలకు సంబంధించి మరిన్ని ఆధారాలులభిస్తే దర్యాప్తు తదుపరి దశకు చేరుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# పెట్టుబడుల వెల్లువ

>> చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం నెలకొందని మంత్రి పేర్కొన్నారు. అమరావతి సచివాలయం లోని ఆర్ అండ్ బి, ఐ.ఐ శాఖ కార్యాలయంలో గురువారం శ్రీక్షేత్ర లాజిస్టిక్స్ సంస్థ డైరెక్టర్ వివేక్ అగర్వాల్, ప్రతినిధుల బృందం మంత్రిని కలిసి రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై చర్చించింది. రాష్ట్రంలోని వివిధ పోర్టుల్లో సరుకు నిర్వహణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు, రైల్వే లింక్డ్ మల్టీ మోడల్ లాజిస్టిక్స్ హబ్‌లను అభివృద్ధి చేసేందుకు సంస్థ ప్రతినిధులు తమ ఆసక్తిని మంత్రికి వివరించారు.

**రూ.300 కోట్ల పెట్టుబడులకు శ్రీక్షేత్ర లాజిస్టిక్స్ ఆసక్తి:**

సుమారు 30యేళ్ల అనుభవం, రూ.1,500 కోట్ల టర్నోవర్ కలిగిన శ్రీక్షేత్ర లాజిస్టిక్స్ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో సుమారు రూ.300 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిందని మంత్రి బిసి జనార్దన్ రెడ్డి తెలిపారు. రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, గుజరాత్ రాష్ట్రాల్లో లాజిస్టిక్స్ రంగంలో సేవలందిస్తున్న సంస్థ, ఎపిలో పోర్టులు, రైల్వే కనెక్టివిటీ, మల్టీ మోడల్ లాజిస్టిక్స్ హబ్‌ల అభివృద్ధికి అవకాశాలను పరిశీలిస్తోంది. లాజిస్టిక్స్ రవాణా ఖర్చులను తగ్గించడంతో పాటు రాష్ట్రంలో రవాణా, మౌలిక వసతులు, లాజిస్టిక్స్ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ లాజిస్టిక్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ పై సంస్థ ప్రతినిధులు ప్రశంసలు వ్యక్తం చేశారు. పూర్తిస్థాయి ప్రతిపాదనలతో ముందుకు వస్తే ప్రభుత్వం తరపున అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తామని మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి సంస్థ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. మంత్రితో జరిగిన చర్చలు సానుకూలంగా సాగడంపై సంస్థ ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు.

**ఎపిలో ఏవియేషన్ రంగానికి భారీ అవకాశాలు:**

మెల్‌స్టార్ ఏవియేషన్ సంస్థ డైరెక్టర్ తరుణ్ కశ్యప్ మంత్రి బిసి జనార్దన్ రెడ్డిని కలిసి రాష్ట్రంలో ఏవియేషన్ రంగంలో పెట్టుబడుల అవకాశాలపై చర్చించారు. కర్నూలు విమానాశ్రయంలో ఏర్పాటు చేస్తున్న సంస్థలో ఎంఎల్ఎల్ఎ పైలట్ శిక్షణ కేంద్రం పురోగతిని సంస్థ ప్రతినిధులు మంత్రికి వివరించారు. ఈ శిక్షణ కేంద్రానికి విద్యార్థుల నుంచి మంచి స్పందన లభిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో ఏవియేషన్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో విమానాశ్రయాల విస్తరణతో పాటు ఎంఆర్ఓ, ఎఎంఇ, పైలట్ శిక్షణ వంటి అనుబంధ రంగాల్లో భారీ ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని మంత్రి తెలిపారు. ముఖ్యంగా స్థానిక యువతకు నైపుణ్య శిక్షణతో పాటు విమానయాన రంగంలో పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉందన్నారు.

**నూతన ఏవియేషన్ పాలసీపై ప్రశంసలు:**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన ఏవియేషన్ పాలసీ పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉందని మెల్‌స్టార్ ఏవియేషన్ ప్రతినిధులు ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ప్రముఖ ఏవియేషన్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి బిసి జనార్దన్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ఏవియేషన్ రంగానికి పెరుగుతున్న డిమాండ్, అందుబాటులోకి వస్తున్న ఆధునిక విమానాశ్రయాలు, అనుకూలమైన పారిశ్రామిక విధానాలతో గ్లోబల్ స్థాయి పెట్టుబడులు రాష్ట్రానికి ఆకర్షితమవుతున్నాయని పేర్కొన్నారు.

# కొండా సురేఖ ఔట్

>> తొలగించాలని సిఎం రేవంత్‌రెడ్డి చేసిన సిఫారసుకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఆమోదించారు. సిఎం రేవంత్‌రెడ్డి గురువారం రాత్రి లోక్‌భవన్‌కు వెళ్లగా ఆయన ముందే బర్తరఫ్ సిఫారసు లేఖపై సంతకం చేశారు. అనంతరం అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి.అంతకు ముందు కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించేందుకు ఏఐసీసీ క్లియరెన్స్ ఇచ్చింది. దీంతో తక్షణమే కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలంటూ సీఎం రేవంత్ రెడ్డి గవర్నర్‌కు పంపిన లేఖలో స్పష్టం చేశారు. ఆ లేఖకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆమోదం తెలిపితే కొండా సురేఖ మంత్రి పదవి నుంచి బర్తరఫ్ అవుతారు. కొండా సురేఖను మంత్రి పదవికి రాజీనామా చేయాలని కోరినా అందుకు ఆమె నిరాకరించింది. దీంతో బర్తరఫ్ చేయాలని ముఖ్యమంత్రి లేఖ రాశారు. దీంతో పార్టీలో జరిగిన నాటకీయ పరిణామాలకు తెరపడినట్లైంది.

# క్రెడిట్ మనదే!

>> వైసిపి సిగ్గు లేకుండా దుష్ప్రచారం చేస్తుందని మండిపడ్డారు. ఈ ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంత్రి మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అజెండా అంశాలపై తీర్మానాల అనంతరం మాట్లాడారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్ట్ పూర్తయినా అది కూటమి ప్రభుత్వం చేసిందే అని.. ఈ విషయం ప్రజలు కూడా గమనిస్తున్నారని తెలిపారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను కూడా అదుపు చేయాలన్నారు. దీనిపై ఉన్న కేబినెట్ సబ్ కమిటీ ధరలపై జాగ్రత్తగా ఎప్పటికప్పుడు గమనిం చాలని అన్నారు. మంత్రులు పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, అచ్చెన్నాయుడు ధరల పెరుగు దలపై దృష్టిసారించాలని సిఎం చంద్రబాబు కోరారు. ఇక మంత్రి మండలిలో రాష్ట్రంలో నెల కొన్న ఎల్‌నినో ప్రభావంపై సుదీర్ఘంగా చర్చించారు. రైతులు, మత్స్యకారులు, అమరావతి, సాగునీరు, విద్యుత్, పారిశ్రామిక రంగాలకు సంబంధించిన కీలక ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. రైతు లకు ఆర్థిక చేయూతపై కేబినెట్‌లో కీలక ప్రతిపా దనలు జరిగాయి. తోతాపురి మామిడికి మద్దతు ధర కోసం మార్క్‌ఫెడ్‌కు రూ.281 కోట్ల నిధులు సమకూర్చుకునే ప్రతిపాదన, పొగాకు రైతులకు డిబిటి ద్వారా రూ.94 కోట్ల ఆర్థిక సాయం అంశాలు కేబినెట్ ముందుకు వచ్చాయి. వీటితో పాటు మత్స్యరంగాన్ని ప్రోత్సహించేలా రిజర్వాయర్ కేజ్ కల్చర్ పాలసీ2026 ముసాయిదాకు ఆమోదం తెలిపింది. అమరావతి సంగమం నిర్మాణానికి రూ.759 కోట్ల 79 లక్షల పరిపాలనా అనుమతి ప్రతిపాదనపై కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అమరావతిలో సిమెంట్ కాంక్రీట్ రోడ్ల స్థానంలో బిటి రోడ్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనపైనా చర్చ జరిగింది. అమరావతి రైల్వే కనెక్టివిటీ, ఇన్నర్ రింగ్ రోడ్డు పనులపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. శాఖమూరులో స్టేట్ పబ్లిక్ లైబ్రరీ, ఆడిటోరియం, గుడ్ గవర్నెన్స్ సంస్థలతో అమరావతి సంగమం నిర్మాణం చేపట్టనున్నారు. సాగునీరు, వరద పునరుద్ధరణకు సంబంధించి కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 78 పనులకు రూ.6 కోట్ల24 లక్షలకు పైగా పరిపాలనా ఆమోదం, వ్యయానికి అనుమతిపై కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

**కాలువల నిర్వహణ, సాగునీటి హక్కులపై చర్చ:**

వెలిగొండ టన్నెల్2లో టిబిఎం తొలగింపు పనులకు రూ.11కోట్ల 63 లక్షల మంజూరుపైనా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కాలువల నిర్వహణ, సాగునీటి హక్కులకు సంబంధించిన అంశాలపైనా చర్చ జరిగింది. విద్యుత్ రంగంలో ఎపి ట్రాన్స్‌కో మధ్యకాలిక రుణానికి రూ.950 కోట్ల ప్రభుత్వ గ్యారంటీ, సీలేరు కాంప్లెక్స్‌లో ఎపి జెన్‌కోకు ఫైర్ ప్రికాషనరీ ఫీజు మినహాయింపు ప్రతిపాదనలు కేబినెట్ పరిశీలనకు వచ్చాయి.

**కడప జిల్లాలో సోలార్ పవర్ ప్రాజెక్టు :**

ఓక్ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులో 800 మెగావాట్ల కేటాయింపు రద్దు, విండ్ సోలార్ హైబ్రిడ్ ప్రాజెక్టులో సామర్థ్యాల మార్పిడిపైనా కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఎపిపిడిసిఎల్ రుణాలకు సంబంధించి జెన్‌కోకు కార్పొరేట్ గ్యారంటీలు ఇచ్చేందుకు అనుమతిపైనా చర్చించింది. పారిశ్రామిక మౌలిక వసతుల అభివృద్ధి, వివిధ ప్రభుత్వ సంస్థలకు భూ కేటాయింపులు, మార్కాపురంలో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంప్లెక్స్ నిర్మాణం, కడప జిల్లాలో పిఎం -కుసుమ్ కింద సోలార్ పవర్ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలపైనా మంత్రివర్గం చర్చించి నిర్ణయాలు తీసుకుంది. 31 అజెండా అంశాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

**స్థానిక ఎన్నికలకు అంతా సిద్ధమవ్వాలి**

స్థానిక ఎన్నికలకు అంతా సిద్ధమవ్వాలని మంత్రి మండలి సమావేశం ముగిసిన అనంతరం సిఎం చంద్రబాబు మంత్రులకు నిర్దేశించారు. అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థుల్ని గెలిపించాలన్నారు. అక్టోబర్‌లోగా ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని, ఎన్నికలు వాయిదా పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కోర్టు పెండింగ్‌లో ఉన్నవి కూడా త్వరితగతిన పరిష్కరించుకుని అన్నింటిలో ఎన్నికలు జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి అన్నారు. తొలుత పురపాలికలు, తర్వాత ఎంపిటిసి, జడ్పిటిసిలు, ఆ తర్వాత పంచాయతీ ఎన్నికలు జరుగుతాయన్నారు. అన్ని కోర్టు కేసులను త్వరితగతిన పరిష్కరించుకుని అనుకున్న సమయానికి ఎన్నికలు నిర్వహించి తీరుతామని తేల్చిచెప్పారు. విద్యా శాఖను లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థులు పన్నుతున్న కుట్రల పట్ల తనతో పాటు సంబంధిత మంత్రులూ అప్రమత్తంగా ఉండాలని మంత్రి లోకేశ్ మంత్రులకు నిర్దేశించారు. విద్య, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ, సంక్షేమ శాఖలు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ కుట్రల్ని ధీటుగా తిప్పికొట్టాలని సూచించారు. ఇక వెలిగొండతో మార్కాపురం జిల్లాకు కృష్ణా జలాలు, పోలవరం ఎడమ కాల్వ ద్వారా అనకాపల్లికి గోదావరి నీళ్లు తీసుకురావడంపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రులు ధన్యవాదాలు తెలిపారు. కేబినెట్ హాలులోకి వచ్చే సమయంలో ముఖ్యమంత్రికి స్టాండింగ్ ఓవేషన్ గౌరవం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రులు చప్పట్లతో స్వాగతం పలికారు.

# నింగిలోకి జిఎస్ఎల్వి ఎఫ్-17

>> 27 గంటల 30 నిమిషాల కౌంటన్ అనంతరం ఈ ప్రయోగం జరగనున్నది.

జిఎస్ఎల్వి ఎఫ్-17 ప్రయోగాన్ని మూడు దశల్లో పూర్తి చేసే విధంగా డిజైన్ చేశారు. ఇందుకు గాను 19 నిమిషాల సమయం పడుతుంది. 51.70 మీటర్ల పొడవున్న జిఎస్ఎల్వి ఎఫ్-17 రాకెట్ భూమి నుంచి నింగికేగిసే సమయంలో 420.5 టన్నుల బరువుతో ఉంటుంది. నాలుగు ద్రవ ఇంధన స్ట్రాపాన్ బూస్టర్ల సాయంతో మొదటి దశ ప్రారంభమవుతుంది 40 టన్నుల ద్రవ ఇంధనం నింపుతారు. 4 స్ట్రాప్ ఆన్ బూస్టర్లతో కలిపి మొత్తం 160 టన్నుల ద్రవ ఇంధనంతో పాటు కోర్ అలోన్ దశలో 139 టన్నుల ఘన ఇంధనంతో మొదటి దశను 151.2 సెకండ్లలో ఈ రాకెట్ పూర్తి చేసుకుంటుంది. 420.5 టన్నుల బరువును భూమి నుంచి ఈ రాకెట్ తీసుకెళ్లాలి దీన్ని దృష్టిలో ఉంచుకొని మొదటి దశలో నాలుగు స్ట్రాపాన్ బూస్టర్లతో పాటు కోర్ అలోన్ దశతో కలిపి 299 టన్నుల ద్రవ, ఘన ఇంద్రంతో కలిపి మొదటి దశను పూర్తి చేసుకుంటుంది. రాకెట్ పైభాగంలో ఉపగ్రహానికి అమర్చిన హీట్ షీల్డ్ 171.20 సెకండ్లకు మొదటి దశ రెండో దశకు మధ్యలోనే విడిపోతాయి. 40 టన్నుల ద్రవ ఇంధన సహాయంతో రెండో దశ 293.08 సెకండ్‌లకు పూర్తవుతుంది. క్రయోజనిక్ దశలో 15 టన్నుల క్రయోజనిక్ ఇంధనం సాయంతో 1106.60 సెకండ్లలో మూడో దశ పూర్తవుతుంది. జిఎస్ఎల్వి ఎఫ్-17 రాకెట్ ద్వారా 1,117 కిలోల బరువు గల ఇఒఎస్05 ఉపగ్రహాన్ని 19 నిమిషాలకు 28934 కిలోమీటర్ల ఎత్తులోని జియో ట్రాన్స్ఫర్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెడతారు. ప్రయోగానంతరం బెంగళూరులోని హసన్ లోని మాస్టర్ కంట్రోల్ సెంటర్ వారు ఉపగ్రహాన్ని తమ అధీనంలో తీసుకొని పనితీరును పర్యవేక్షించడంతో పాటు ఉపగ్రహాన్ని 36వేల కిలోమీటర్ల ఎత్తులోకి ప్రవేశ పెట్టడంతో ప్రయోగం పూర్తవుతుంది.

## వారం - వర్జ్యం

04-09-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, కృష్ణపక్షం, పుబ్బ కార్తె,
తి.అష్టమి రా.12.13
న. రోహిణి రా.11.03
వ.ము.3.31 - సా.5.01
2) తె.4.17 - తె.5.47
దు : ఉ.8.23 - ఉ.9.13
2) మ.12.31 -మ.1.21
రాహు. ఉ.10.30 - మ.12.00. శుభ లేదు

## వార్తాఫలం

**మేషం** : ప్రముఖుల నుండి ఆహ్వానాలు పొందుతారు. విలువైన వస్తువులు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

**వృషభం** :దూరప్రాంతాల నుండి వచ్చిన వార్త ఆనందం కలిగిస్తుంది.ప్రయణాలలో తొందరపాటు వద్దు.

**మిథునం** :అన్ని విధాలా మౌనంగా వుండటం మంచిది. గృహనిర్మాణ ఆలోచనలు సాగిస్తారు.

**కర్కాటకం** : కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. నూతన విద్యావకాశాలు.

**సింహం** : దూరపు బంధువుల నుండి వచ్చిన సమాచారం, ఆనందం కలుగుతుంది.నూతన కార్యక్రమాలు చేపడతారు.

**కన్య** : ఉద్యోగ యత్నాలు సత్ఫలదకసాగుతాయి. జీవిత భాగస్వామి సలహాతో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

**తుల** : ప్రముఖుల నుండి కీలక సమాచారం అందుతుంది. నిరుద్యోగులకు ఉద్యోగ లాభం వుండవచ్చు.ధనలాభం.

**వృశ్చికం**:నూతన మిత్రులు పరిచయమై సహాయం అందిస్తారు. సంతానం నుండి కీలక సమాచారం.

**ధనుస్సు** : విద్య, ఉద్యోగావకాశాలు వుంటాయి. పనులు సాఫీగా సాగుతాయి. ఆప్తుల నుండి ఆహ్వానాలు అందుతాయి.

**మకరం** : వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు. సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు.ఆహ్వానాలు అందుతాయి.

**కుంభం** : క్రయవిక్రయాలలో స్వల్ప లాభాలు పొందుతారు. కోపతాపాలకు దూరంగా వుండండి.వస్తు, వస్త్ర కొనుగోలు.

**మీనం** : ఆర్థిక ప్రగతి సాధిస్తారు. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. దూరప్రాంతాల శుభవార్తలు వింటారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



గురువారం పాట్నాలో బింద్‌తోలి వద్ద ఉప్పొంగిన గంగ నీరు ఇళ్లలోకి రావడంతో సామానుతో బయటకు వెళ్తున్న మహిళ

# రష్యా ఉక్రెయిన్ యుద్ధం

>> ర్తిత్వం, దౌత్య పరమైన చర్చల ద్వారానే శాంతి నెలకొంటుందని స్పష్టం చేశారు. ఈ మేరకు కీవ్ పర్యటనలో భాగంగా అనేక అంశాలపై ఆయన ఉక్రెయిన్ అధికారులతో చర్చలు జరిపారు. ఈ మేరకు ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రీ సిబిహ్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ రోజుల్లో యుద్ధంతో ఏమీ రాదని, యుద్ధ భూమిలో సమస్యలు పరిష్కారం కావని భారత్ దృఢంగా విశ్వసిస్తోందని జై శంకర్ స్పష్టం చేశారు. ఇరు దేశాల మధ్య ఇలాగే యుద్ధం కొనసాగితే ప్రజల ప్రాణాలు, విధ్వంసం కొనసాగుతూనే ఉంటుందని అన్నారు. ఇక ఇటీవల కిర్గిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరిగిన షాంగై కో ఆపరేషన్ సదస్సు (ఎస్‌సిఒ)లో భారత ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ రష్యా-ఉక్రెయిన్ మధ్య నిరంతరాయంగా జరుగుతున్న యుద్ధానికి ఇక ఫుల్ స్టాప్ పెట్టాలని సందేశం ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా జై శంకర్, ప్రధాని మోడీ మాటలను గుర్తు చేశారు. యుద్ధం వల్ల ప్రాణాలు పోవడం, విధ్వంసం తప్పితే ఏమీ మిగలదని స్పష్టం చేశారు. ఇక భారత్ విషయానికి వస్తే ఈ యుద్ధాన్ని ఆపేందుకు తాము ఎంతకైనా సిద్ధంగానే ఉంటామని, మధ్యవర్తిత్వం చేయడంతోపాటు ఇతర సాయానికి భారత్ రెడీగా ఉంటుందని జై శంకర్ పేర్కొన్నారు. ఇక ఉక్రెయిన్- రష్యా మధ్య దాడుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా వాణిజ్యం దెబ్బతింటుందని తెలిపారు. ఈ మేరకు నౌకలపైన జరిగిన దాడుల్లో భారత్‌కు చెందిన నావికులు మృతి చెందడం దురదృష్టకరం అని పేర్కొన్నారు. కమర్షియల్ షిప్పింగ్ పై ఇలాంటి దాడుల ప్రభావం అధికంగా ఉందని.. దానివల్ల గ్లోబల్ సౌత్ దేశాల్లో చమురు, ఫెర్టిలైజర్లు, ఫుడ్ కొరత ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశాలపై ఉక్రెయిన్ అధికార యంత్రాంగంతో మాట్లాడానని వివరించారు. మరోవైపు రష్యాతో యుద్ధం మొదలైన దగ్గరి నుంచి ఉక్రెయిన్ కు భారత్ మానవతాసాయం అందిస్తూనే ఉందని జై శంకర్ తెలిపారు. ఇప్పటివరకూ ఉక్రెయిన్‌కు 19 కన్‌సైన్మెంట్‌ల మానవతాసాయాన్ని అందించినట్లు పేర్కొన్నారు. ఇక ఉక్రెయిన్- భారత్ మధ్య అనేక రంగాల్లో వాణిజ్య సంబంధాలు మరింత బలపడ్డాయని తెలిపారు. ఇరు దేశాల మధ్య ఫార్మా, వ్యవసాయం, ఎరువులు, మెషినరీ, కెమికల్, కన్జ్యూమర్ గూడ్స్ తదితర రంగాల్లో సంబంధాలు ఉన్నాయని వివరించారు. ఇక విదేశీ పర్యటనలో భాగంగా నేటి నుంచి 5 వరకు ఉక్రెయిన్, పోలాండ్‌లో జై శంకర్ పర్యటించనున్నారు.

# డిప్యూటీ ఇఒ లోకనాథం అరెస్ట్

>> కిలోల వెండి, 12.50 లక్షల రూపాయలు నగదును స్వాధీనం చేసుకున్నారు. తిరుపతిలోని పెద్దకాపు లేఅవు ట్‌లో లోకనాథం భార్య పేరుతో కొనుగోలు చేసిన ఇంటితోబాటు తిరుపతి గొల్లవాని గుంటలో రెండు ఇంటి స్థలాలు, ఒక భవనం, వడమాలపేటమండలంలోని పాదిరేడు అరణ్యం గ్రామంలో టిటిడి కేటాయించిన ఒక ఇంటి స్థలం, శ్రీనివాసాపురం నివాస ప్రాంతంలో కుమారుడి పేరుతో కొనుగోలు చేసిన స్థలం, ఆయన బంధువుల పేర్లతో ఉన్న నాలుగు ఫిక్స్‌డ్ డిపాజిట్లను ఎసిబి అధికారులు గుర్తించారు. ఆయన పేరుతో బ్యాంకు లాకర్‌లో ఎలాంటి వస్తువులు, నగదు లేదని నిర్ధారించారు. అక్రమాస్తుల కేసులో గురువారం మధ్యాహ్నం డిప్యూటీ ఇఒ లోకనాథంను అరెస్ట్ చేసిన ఎసిబి అధికారులు సాయంత్రం నెల్లూరు ఎసిబి కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి రిమాండ్ విధించారు. అయితే గుర్తించిన అక్రమాస్తుల విలువ మార్కెట్ ధరకంటే అధికంగా ఉంటుందని ఎసిబి అధికారవర్గాల సమాచారం. మొత్తం మీద తిరుమల ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించినట్లు గుర్తించామని ఎసిబి డిఎస్పీ మద్ది శ్రీనివాసరావు తెలిపారు.

# ఎల్‌నినో ఎఫెక్ట్.. 'పవర్ష్ పెరిగింది

>> ఈ నేపథ్యంలో ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. అన్ని రంగాల విద్యుత్ అవసరాలను పరిగణనలోకి తీసుకుని సరఫరా ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. అంతరాయాలకు అవకాశం లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగేలా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. డిమాండ్ పెరిగే సమయాల్లో ఎక్కడా సరఫరా సమస్యలు తలెత్తకుండా ఉత్పత్తి, పంపిణీ, సరఫరా వ్యవస్థలను సమన్వయంతో నిర్వహించాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

**భవిష్యత్తు అవసరాలకు పునరుత్పాదక విద్యుత్:**

ప్రస్తుత డిమాండ్‌ను తీర్చడంతో పాటు రాష్ట్ర భవిష్యత్తు విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిని మరింత పెంచేలా చర్యలు తీసుకోవాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులకు సూచించారు. సౌర, ఇతర పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారా విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా పీఎం సూర్యఘర్ పథకాన్ని మరింత ఎక్కువ మంది వినియోగించుకునేలా చూడాలన్నారు. ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితుల ప్రభావంతో డిమాండ్‌లో ఆకస్మిక పెరుగుదల వచ్చినా విద్యుత్ వ్యవస్థపై ఒత్తిడి పడకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని చెప్పారు. ఉత్పత్తి, కేంద్రాల సామర్థం, బొగ్గు నిల్వలు, సరఫరా వ్యవస్థలను నిరంతరం పర్యవేక్షిస్తూ రాష్ట్ర ప్రజలకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో జెన్ కో ఎండి ఎస్.నాగలక్ష్మి ్మ, ట్రాన్స్ కో జెఎండి సూర్యసాయి ప్రవీణ్ చంద్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 11నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

>> ఆశీస్సులు పొందేందుకు వచ్చే భక్తకోటికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ అధ్యక్షతన దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం పాలకమండలి ప్రత్యేకంగా సమావేశమైంది. ఈ సందర్భంగా దసరా ఉత్సవాలకు సంబంధించిన ప్రచార సామగ్రిని లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ ఏడాది శరన్నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారు పది రోజుల పాటు పది విభిన్న అలంకారాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. రోజుకో రూపంలో అలంకృతురాలయ్యే జగన్మాతను దర్శించుకుని భక్తులు తరించనున్నారు. ఉత్సవాల్లో అమ్మవారి అలంకారాల వివరాలను ఆలయ స్థానాచార్యులు విష్ణుభొట్ల శివప్రసాదశర్మ వెల్లడించారు. అక్టోబరు 11 తొలిరోజు శ్రీ బాలా త్రిపురసుందరీ దేవి, 12న శ్రీ గాయత్రీ దేవి, 13న శ్రీ అన్నపూర్ణా దేవి, 14న శ్రీ మహాచండీ దేవి, 15న శ్రీ లలితా త్రిపురసుందరీ దేవి, 16న (మూలానక్షత్రం రోజున శ్రీ సరస్వతీ దేవిగా దర్శనమివ్వనున్నారు. అక్టోబరు 17న శ్రీ మహాలక్ష్మి ్మ దేవి, 18న శ్రీ దుర్గాదేవి, 19న శ్రీ మహిషాసురమర్ధిని దేవి, 20న చివరిరోజు శ్రీ రాజరాజేశ్వరి దేవిగా కనకదుర్గమ్మ దర్శనమివ్వనున్నారు.

**కృష్ణమ్మ ఒడిలో తెప్పోత్సవం:**

దసరా ఉత్సవాల ముగింపు రోజున తెప్పోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. అక్టోబరు 20వ తేదీ సాయంత్రం కృష్ణమ్మ ఒడిలో అమ్మవారికి హంసవాహన తెప్పోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పాలకమండలి ప్రకటించింది. కృష్ణా నదిలో విహరించే హంస వాహనంపై దుర్గమ్మను దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలిరానున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేస్తామని అధికారులు పేర్కొన్నారు.

# 'అక్షర ఆంధ్ర్ష కు అద్భుత ఫలితాలు

>> రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఒక రాష్ట్ర అభివృద్ధికి భవనాలు, మౌలిక వసతులు మాత్రమే కొలమానం కాదని, సామాన్య పౌరుడి చేతిలో ఉన్న అక్షరమే నిజమైన అభివృద్ధికి కొలమానమని అన్నారు. గత రెండేళ్లలో రాష్ట్ర అక్షరాస్యత రేటు 72.6 శాతం నుంచి 82.1 శాతానికి పెరగడం, జాతీయ సగటు 80.9 శాతాన్ని అధిగమించడం రాష్ట్ర విద్యా రంగంలో సాధించిన గణనీయమైన పురోగతికి నిదర్శనమని పేర్కొన్నారు. 'అక్షర ఆంధ్ర్ష కార్యక్రమం ద్వారా 11 ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసి, కేవలం రెండేళ్లలోనే 25 లక్షల మందికి అక్షర జ్ఞానం అందించడం అభినందనీయమన్నారు. విద్యా రంగంలో ప్రచారానికి కాకుండా క్షేత్రస్థాయిలో ఫలితాలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యారంగంలో విస్తృతంగా వినియోగిస్తూ ఎఐ ద్వారా ఉపాధ్యాయులకు కృత్రిమ మేధపై శిక్షణ అందించడం అభినందనీయమన్నారు. ఆటిజం ఉన్న పిల్లల కోసం రాష్ట్రవ్యాప్తంగా 125 ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా సమ్మిళిత విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారని మంత్రి తెలిపారు. 2027 మార్చి నాటికి మరో 25 లక్షల మందిని, సెప్టెంబర్ 2027 నాటికి మరో 27 లక్షల మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం ద్వారా మొత్తం 52 లక్షల మందికి అక్షర జ్ఞానం అందించాలనే లక్ష్యం ఎంతో గొప్పదని అన్నారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఇలా సమాజంలోని అన్ని వర్గాలను భాగస్వాములను చేస్తూ సాగుతున్న ఈ 'అక్షర ఆంధ్ర- అక్షర యజ్ఞ్ం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# వన్యప్రాణుల మరణాలపై సమగ్ర అధ్యయనం

**● అటవీ శాఖ సలహాదారు, అదనపు ప్రధాన అటవీ సంరక్షణాధికారి నేతృత్వంలోని కమిటీ**

**● జంతువుల ఆవాసాల నిర్వహణ, రక్షణ చర్యలపై నివేదిక కోరిన డి.సిఎం పవన్ కల్యాణ్**



**విజయవాడ, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో వన్యప్రాణుల సంరక్షణను మరింత బలోపేతం చేసే దిశగా సరికొత్త ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఇటీవల చోటు చేసుకున్న వన్యప్రాణుల మరణాల ఘటనలపై సమగ్ర అధ్యయనం నిర్వహించాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. పులుల మరణాలపై అధ్యయనానికి అటవీశాఖ సలహాదారు, అదనపు ప్రధాన అటవీ సంరక్షణాధికారి నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీకి ఆ బాధ్యతలను అప్పగించారు. వన్యప్రాణుల ఆవాసాల నిర్వహణ, రక్షణ చర్యలు, మానవ- వన్యప్రాణి ఘర్షణల నివారణ, క్షేత్రస్థాయిలో అమలవుతున్న సంరక్షణ కార్యక్రమాల ప్రభావాన్ని సమగ్రంగా పరిశీలించి నివేదిక సమర్పించాలని సూచించారు. వన్యప్రాణుల సంరక్షణకు ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన చర్యలు అమలు అవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత హనుమాన్ వంటి కార్యక్రమాల ద్వారా ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి, ప్రత్యేక పరిస్థితుల్లోనూ జంతువుల సంరక్షణ చర్యలు చేపడుతోంది. ప్రస్తుతం అమలులో ఉన్న కార్యక్రమాలు, వాటి ఫలితాలను శాస్త్రీయంగా విశ్లేషించి, అవసరం ఉన్న చోట మరింత పకడ్బందీగా చర్యలు అమలు చేయాలన్న ఉద్దేశంతో డి.సిఎం పవన్ కల్యాణ్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర అటవీశాఖ సలహాదారు మల్లిఖార్జునరావు, అదనపు ప్రధాన అటవీ సంరక్షణాధికారి రాహుల్ పాండే నేతృత్వంలోని ప్రత్యేక కమిటీ రాష్ట్రవ్యాప్తంగా వన్యప్రాణుల సంచారం ఉన్న ప్రాంతాలను సందర్శించి, వాటి మరణాలకు దారితీస్తున్న అంశాలు, ఆవాసాల్లో పరిస్థితులు, సంచార మార్గాల్లో అమలు చేస్తున్న భద్రతా ఏర్పాట్లు, వేట నిరోధక చర్యలు, పర్యవేక్షణ వ్యవస్థలు, అటవీ అగ్నిప్రమాదాల నియంత్రణ, నీటి వనరుల లభ్యత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తుంది. దీంతో పాటు పులులు, చిరుతలు, ఏనుగులు, ఇతర వన్య ప్రాణుల సంరక్షణకు అమలవుతున్న కార్యక్రమాలను సమీక్షించి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సవాళ్లను గుర్తించి, నివారణ చర్యలపై సూచనలు చేయనుంది. వన్యప్రాణుల ఆవాసాల అభివృద్ధి, సహజ ఆహార వనరుల పెంపు, సంచార మార్గాల సంరక్షణ, స్థానిక ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలపై ప్రత్యేక నివేదిక రూపొందించి డి.సిఎం పవన్ కల్యాణ్‌కి అందజేస్తుంది. దీంతో పాటు మానవ-వన్యప్రాణి ఘర్షణలను తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలు, విద్యుత్ లైన్లు, రహదారులు, రైల్వే మార్గాలు, ఇతర మౌలిక సదుపాయాల వల్ల ఏర్పడే ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా కమిటీ కీలక సిఫార్సులు చేయనుంది. రాష్ట్రంలోని వన్యప్రాణులు, వాటి ఆవాసాలు, సంచార మార్గాల పరిరక్షణ, మరణాల నివారణ, మానవ-వన్యప్రాణి ఘర్షణల నిరోధం ద్వారా ఆంధ్రప్రదేశ్ తాలూకు జీవవైవిధ్య వారసత్వాన్ని భావితరాలకు అందించే లక్ష్యంతో కార్యాచరణ ఉండాలని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

# ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం ఉచిత ప్రవేశాలు

**● అధ్యయనం, మార్గదర్శకాల సవరణకు కమిటీ ఏర్పాటు ● కమిటీ చైర్‌పర్సన్‌గా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ● 16మంది సభ్యుల నియామకం, ఉత్తర్వులు జారీ**

**విజయవాడ, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యాహక్కు చట్టం 2009 సెక్షన్ 12(1)(సి) ప్రకారం ఎపిలోని ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో నిరుపేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు 25శాతం ఉచిత ప్రవేశాలు కల్పించేందుకు ఉన్న మార్గదర్శకాలను సవరించే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత ప్రవేశాల మార్గదర్శకాల సవరణకు రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తూ కూటమి ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.
సుప్రీంకోర్టు ఈ ఏడాది జనవరి 13న ఇచ్చిన తీర్పు ప్రకారం జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ జారీ చేసిన ఆదేశాలకు అనుగుణంగా ప్రస్తుత నిబంధనలను సవరించి, పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఛైర్‌పర్సన్‌గా 16 మంది సభ్యులతో కూడిన రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీకి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ సమీమ్ అన్సారియా ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. సమగ్ర శిక్షా స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మెంబర్ కన్వీనర్‌గా ఉంటారు.
విద్యాశాఖలోని వివిధ విభాగాల డైరెక్టర్లు, ఎన్టీఆర్ జిల్లా డిఇఒ, బాపట్ల ఎంఇఒలతో పాటు న్యాయ సలహాదారులు, ఎన్జీఓ ప్రతినిధి, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ప్రతినిధి, చట్టం కింద ప్రవేశాలు పొందిన ఇద్దరు విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కమిటీలో సభ్యులుగా ఉండనున్నారు. ఆర్టీఇ చట్టం, ఎపి ఆర్టీఇ నిబంధనలు, సుప్రీంకోర్టు తీర్పు, ఎన్‌సిపిసిఆర్ నిబంధనలను సమగ్రంగా అధ్యయనం చేయడం ఈ కమిటీ బాధ్యత. ఆన్‌లైన్ ద్వారా పారదర్శకంగా అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టడం, సీట్ల వివరాలు వెల్లడించడం, ఫీజుల రీయింబర్స్‌మెంట్ తదితర అంశాలపై నూతన విధానాలను సిఫార్సు చేయనున్నారు. అదేవిధంగా చట్టం అమలులో ఎదురవుతున్న ఆచరణాత్మక, చట్టపరమైన సమస్యలను గుర్తించి పరిష్కారాలు చూపడం, ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత ప్రవేశాలు పొందిన పిల్లల పట్ల ఎలాంటి వివక్ష లేకుండా ఉండేలా పటిష్ట చర్యలు సిఫార్సు చేయడం ఈ కమిటీ బాధ్యతలుగా జిఒలో పొందుపరిచారు.

## ఐపిఎస్ అధికారులు విశాల్ గున్ని, కాంతిరాణా టాటాలపై సస్పెన్షన్ ఎత్తివేత

**విజయవాడ, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** సీనియర్ ఐపిఎస్ అధికారులు విశాల్ గున్ని (2010 బ్యాచ్), కాంతి రాణా టాటా (2004 బ్యాచ్)లపై ఉన్న సస్పెన్షన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేసింది. వారిని తక్షణమే విధుల్లోకి తీసుకుంటూ గురువారం సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అఖిల భారత సర్వీసుల క్రమశిక్షణ, అప్పీల్ నిబంధనల ప్రకారం విశాల్ గున్ని, కాంతి రాణా టాటాలను ప్రభుత్వం గతంలో సస్పెండ్ చేసింది. అనంతరం వారి సస్పెన్షన్‌ను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పొడిగిస్తూ వచ్చింది. తాజాగా వీరిద్దరి సస్పెన్షన్ సెప్టెంబర్ 4 వరకు అమల్లో ఉంది. ఇద్దరు అధికారుల సస్పెన్షన్ ఎత్తివేతకు సంబంధించి డిజిపి (హెచ్‌ఓపిఎఫ్) ఇచ్చిన నివేదికలను ప్రభుత్వం పరిశీలించింది. కాంతి రాణా టాటా ఆగస్టు 24న సమర్పించిన వినతిపత్రాన్ని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. అన్ని అంశాలను పరిశీలించిన అనంతరం సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని నిర్ణయించింది. దీంతో విశాల్ గున్ని, కాంతి రాణా టాటాలను తక్షణమే విధుల్లోకి పునరుద్ధరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, వారిపై కొనసాగుతున్న క్రమశిక్షణ, క్రిమినల్ కేసులపై ఈ నిర్ణయం ఎలాంటి ప్రభావం చూపదని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ పేరుతో ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇద్దరు అధికారులకు ఉత్తర్వుల ప్రతులను అందజేసి, వారి నుంచి రసీదు తీసుకోవాలని డిజిపికి ప్రభుత్వం ఆదేశించింది.

## ఐఎఎస్ అధికారి ప్రసన్న వెంకటేశ్ రిలీవ్

**విజయవాడ, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** సీనియర్ ఐఏఎస్ అధికారి ప్రసన్న వెంకటేశ్‌ను ఎపి ప్రభుత్వం విధుల నుంచి రిలీవ్ చేసింది. ఇటీవల ఆయన జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టిఎ) డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శిగా బాధ్యతలు చూస్తున్న ఆయన, త్వరలోనే కేంద్ర సర్వీసుల్లో చేరనున్నారు.

## 79 మందికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు

**విజయవాడ, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాను ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. విద్యా రంగంలో విశేష సేవలు అందించిన 79 మంది ఉపాధ్యాయులను ఈ అవార్డులకు ఎంపిక చేసింది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వీరికి ఈ పురస్కారాలను ప్రభుత్వం అందజేయనుంది. విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేసిన పలువురికి ఈ జాబితాలో చోటు దక్కింది. ఈ నెల 5వ తేదిన ఉపాధ్యాయ దినోత్సవం రోజున ఈ అవార్డులను అందించే అవకాశం ఉంది. పురస్కారాలకు ఎంపికైన ఉపాధ్యాయులను మంత్రి లోకేష్ అభినందించారు.

## ప్రైవేటు ఆస్పత్రులకు రూ.233 కోట్ల చెల్లింపులు

**విజయవాడ, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ అనుబంధ ప్రైవేటు ఆస్పత్రులకు ప్రభుత్వం రూ.233 కోట్లు చెల్లించింది. ఈహెచ్ఎస్ కింద మరో రూ.23 కోట్లు ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. ఈ ఏడాది నెట్‌వర్క్ ఆస్పత్రులకు మొత్తం రూ.1,657 కోట్లు చెల్లించినట్లు మంత్రి సత్యకుమార్ తెలిపారు. బిల్లుల చెల్లింపులపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందన్నారు. ఎప్పటికి అప్పుడు ప్రైవేటు ఆస్పత్రులకు వైద్యసేవల నిమిత్తం బిల్లులు చెల్లించే దిశలో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## లిక్కర్ స్కామ్‌లో అప్రూవర్‌గా మారతా: సత్యప్రసాద్

### ఎసిబి కోర్టులో పిటిషన్‌పై విచారణ 9కు వాయిదా

**విజయవాడ, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో సంచలనం రేపిన మద్యం కేసు విచారణను ఎసిబి కోర్టు ఈనెల 9కు వాయిదా వేసింది. ఈ కేసులో ఏ3 నిందితుడిగా ఉన్న సత్యప్రసాద్ తాను అప్రూవర్‌గా మారుతానని పిటిషన్ వేశారు. ఆయన గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఎపిఎస్‌బిసిఎల్ స్పెషల్ ఆఫీసర్‌గా పనిచేశారు. కేసు విచారణ విషయంలో తాను సహకరిస్తానని స్పష్టం చేసారు. ఈ పిటిషన్‌పై కోర్టు తదుపరి విచారణ చేపట్టనుంది.

## ఈశ్వర్ కిరణ్ కస్టడీకి కోర్టు అనుమతి

**విజయవాడ, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో ఏ9 నిందితుడు ఈశ్వర్ కిరణ్‌ను కస్టడీకి తీసుకునేందుకు ఎసిబి కోర్టు అనుమతించింది. ఈ నెల 7, 8, 9 తేదీల్లో విచారించేందుకు ఎసిబికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాజ్ కెసిరెడ్డితో కలిసి మద్యం స్కామ్ లావాదేవీల్లో ఈశ్వర్ కిరణ్ కీలకంగా వ్యవహరించారు. ప్రస్తుతం ఆయన గుంటూరు జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

# అందరి సహకారంతో సంక్షేమం, అభివృద్ధి

**● వెలిగొండ, పోలవరం ఎల్‌ఎంసి ప్రకటనల్లో మంత్రి రామానాయుడు ఫొటో లేకపోవటాన్ని తప్పపట్టిన సిఎం చంద్రబాబు ● మంత్రుల విషయంలో ప్రోటోకాల్ పాటించి తీరాల్సిందేనని విస్పష్ట ఆదేశాలు**

**విజయవాడ, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** అందరి సహకారంతోనే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రభుత్వం అమలు పకడ్బందీగా అమలు చేస్తున్నదని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. మంత్రి నిమ్మల రామానాయుడు వంటి వారు సామాన్యవ్యక్తులు మాదిరిగా తమ బాధ్యతను నిర్వహించుకుంటూ పోతున్నా రన్నారు. మంత్రులంతా తమ పరిధిలో పనిచేసు కుని వెళ్తున్నారన్నారు. ఆయా సందర్భాలో వారికి గౌరవం ఇచ్చి తీరాల్సి ఒదేనన్నారు. సచివాలయంలో మంత్రివర్గ సమావేశంలో ఆయన మాట్లా డుతూ. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు, ప్రారం భోత్సవ ప్రకటనల్లో ప్రొటోకాల్ ఉల్లంఘనలు చోటుచేసుకోవడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి సంబంధించిన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో సంబంధిత శాఖ మంత్రుల ఫొటోలు లేకపోవడం తీవ్రమైన పొరపాటని, ఇది ఏమాత్రం సరికాదని స్పష్టం చేశారు. ముఖ్యంగా వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ ప్రకటనల్లో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఫొటోను ముద్రించక పోవడాన్ని ఆయన తీవ్రంగా తప్పు బట్టారు. భవిష్యత్తులో ఇలాంటి తప్పులు పునరా వృతం కాకుండా కఠిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇదే సమయంలో, అత్యంత సంక్లిష్టమైన వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ పనులను సమర్థవంతంగా పూర్తి చేసిన జలవనరుల శాఖ, ఆర్థిక శాఖ అధికారుల సమన్వయాన్ని సిఎం అభినందించారు. మంత్రి నిమ్మల రామానాయుడు నిత్యం ప్రాజెక్టుల వద్దే ఉంటూ, ఎంతో నిరాడంబరతతో పనిచేస్తూ ఫలితాలు సాధిస్తున్నారని చంద్రబాబు కొనియాడారు. ఎపిలో ఎల్‌నినో పరిస్థితులను వివరిస్తూ కేంద్రానికి లేఖ రాయనున్నట్లు సిఎం చంద్రబాబు తెలిపారు. ప్రతినెలా క్షేత్రస్థాయి పరిస్థితులు కేంద్రానికి నివేదిద్దామన్నారు.


**కెనరా బ్యాంక్ Canara Bank** భారత ప్రభుత్వ రంగ సంస్థ A Government of India Undertaking

**ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్ (13591), విశాఖపట్నం**
మెలొడీ సినిమా థియేటర్ ఎదురుగా, సూర్యాభాగ్, విశాఖపట్నం-530020.
ఫోన్: 8332956773, 7095199455, ఇ-మెయిల్: cb13591@canarabank.com

**స్థిరాస్తుల అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన**

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) & 9(1) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన.

కెనరా బ్యాంక్ ఎ.ఆర్.ఎం బ్రాంచ్ విశాఖపట్నం వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) చెల్లించవలసిన బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ అధీకృత అధికారిచే లాంఛనంగా స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టిన/ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను తేది 24.09.2026 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు మరియు హామీదారులకు తెలియజేయడమైనది. బ్యాంకు వారి పరిజ్ఞానం మేరకు తాకట్టు రుణభారాలు లేని స్థిరాస్తుల వివరములు.

**ఇ-వేలం తేది & సమయం: 24.09.2026, మ॥ 01.00 గం.ల నుండి మ॥ 02.00 గం.ల వరకు** (అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

**ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేది: 24.09.2026, మధ్యాహ్నం 1:50 గం॥ల లోపు**

| వ. నెం. | ఋణగ్రహీత / హామీదారులు (అన్ని ఖాతాలు ఎ.ఆర్.ఎం బ్రాంచ్ విశాఖపట్నంకు బదిలీ చేయడమైనవి) | తనఖాలో ఉన్న ఆస్తి వివరములు | రిజర్వు ధర (రూ.) | ఇ.ఎం.డి (రిజర్వు ధరలో 10%) |
|---|---|---|---|---|
| 1 | 1) శ్రీ పీతల శ్రీనివాస్, తల్లి: పీతల కమలాదేవి, 2) శ్రీమతి పీతల కమలాదేవి, భర్త: పి. సత్య నారాయణ (లేటు), హామీదారులు : 1) శ్రీమతి పితల అరుణ, తల్లి : పీతల కమలాదేవి, 2) శ్రీ పెరుమాళ్ల శ్రీనివాసరావు, తండ్రి : పి. సుందరరావు. తేది 31.07.2026 నాటికి బకాయి మొత్తం: రూ. 27.67 లక్షలు + తదుపరి వడ్డీ + ఇతర ఛార్జీలు (ఏవైనా ఉంటే). | 1) తూర్పు గోదావరి జిల్లా, కాకినాడ మండలం, కాకినాడ సబ్-రిజిస్ట్రీ, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్, వార్డ్ నెం. 3, రామారావుపేట, పాముపారి వీధి, డి.నెం. 10-2-5 నందు 74.86 చ॥గ॥ లేదా 62.59 చ॥మీ॥ స్థలంలోని టైల్డ్ హౌస్ దక్షిణం పోర్షన్. హద్దులు డీడ్ ప్రకారం. పైన పేర్కొన్న విస్తీర్ణం 74.86 చ॥గ॥లు లేదా 62.59 చ॥మీ॥ల స్థలం మరియు టైల్డ్ ఇంటి పోర్షన్ అన్ని ఈజిమెంటరీ హక్కులతో కలదు. 2) తూర్పు గోదావరి జిల్లా, కాకినాడ మండలం, కాకినాడ సబ్-రిజిస్ట్రీ, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్, వార్డ్ నెం. 3, రామారావుపేట, పాముపారి వీధి, టి.యస్.నెం. 762పి, డి.నెం. 10-2-5 గల 50.19 చ॥గ॥ లేదా 41.06 చ॥మీ॥ స్థలంతో అందులోని టైల్డ్ హౌస్. హద్దులు డీడ్ ప్రకారం. 3) తూర్పుగోదావరి జిల్లా, కాకినాడ మండలం, కాకినాడ సబ్-రిజిస్ట్రీ, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్, వార్డ్ నెం. 3, రామారావుపేట, పాముపారి వీధి, డి.నెం. 10-2-4లో 46.36 చ॥గ॥ లేదా 38.76 చ॥మీ॥ విస్తీర్ణం ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న టైల్డ్ హౌస్. హద్దులు డీడ్ ప్రకారం. | రూ 49,74,000/- | రూ. 4,97,400/- |
| | | 4) తూర్పుగోదావరి జిల్లా, కాకినాడ మండలం, కాకినాడ సబ్-రిజిస్ట్రీ, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్, కాకినాడ సిటీ, గాంధీనగర్, గొల్లపేట ఏరియా, పాత వార్డు నెం. 1, ప్రస్తుత వార్డు నెం. 2, బ్లాక్ నెం. 9, యల్.పి. నెం. 48/88, డి.నెం. 9-11-55/1, 9-11-55/2, టి.యస్.నెం. 721/1 నందు 93.07 చ॥గ॥ లేదా 77.81 చ॥మీ॥ల విస్తీర్ణంలో ఆర్.సి.సి. రూఫ్ దాబా ఇల్లు. హద్దులు డీడ్ ప్రకారం | రూ 23,86,000/- | రూ. 2,38,600/- |

**ఆస్తి తనిఖీ తేది & సమయం : 17.09.2026, ఉ॥ 10.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు**
అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనలకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్ ఎ.ఆర్.ఎం బ్రాంచ్, విశాఖపట్నం అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్ : 83329 56773, 70951 99455

రిజర్వు ధరలో 10% సొమ్మును ధరావత్తుగా ఆర్.టి.జి.ఎస్/నెఫ్ట్/ఫండ్ ట్రాన్స్‌ఫర్ ద్వారా https://baanknet.com లోని E-వాలెట్‌కు బిడ్డర్ లాగిన్ అయి తేది.24.09.2026, మ॥ 1:50 గం.ల లోపుగా చెల్లించవలెను.
* బ్యాంకుకు తెలిసిన/తెలియని బకాయిలు/టాక్స్‌లు ఏవైనా ఉన్నచో అవి వేలం కొనుగోలుదారే భరించాలి మరియు తుది బిడ్ మొత్తంతోపాటు అవి కూడా చెల్లించవలసి ఉంటుంది. బిడ్డర్లు తమ ఆఫర్‌లను, ఆస్తి రిజర్వు ధర 25 లక్షల వరకు ఉన్నవాటికి రూ. 10,000/- గుణింపులో హెచ్చించవలెను. రిజర్వు ధర 25 లక్షల నుండి 50 లక్షల వరకు ఉన్నవాటికి రూ. 25,000/- గుణింపులో హెచ్చించవలెను. రిజర్వు ధర 50 లక్షల నుండి 100 లక్షల వరకు ఉన్నట్లయితే రూ. 50,000/- గుణింపులో హెచ్చించవలెను. రిజర్వు ధర 100 లక్షల నుండి 500 లక్షల వరకు ఉన్నట్లయితే రూ. 1,00,000/- గుణింపులో హెచ్చించవలెను మరియు రిజర్వు ధర 500 లక్షల ఎక్కువ ఉన్నట్లుయితే రూ. 5,00,000/- గుణింపులో హెచ్చించవలెను. 'ఆన్‌లైన్' వేలం ముగిసేలోపు అత్యధిక బిడ్ (రిజర్వు ధర కన్నా ఎక్కువ) సమర్పించిన బిడ్డర్ విజయవంతమైన బిడ్డర్‌గా ప్రకటించబడతారు.
ఇ-వేలం విధానం, నియమ నిబంధనల కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్(baanknet), వెబ్‌పోర్టల్ https://baanknet.com.
హెల్ప్‌డెస్క్: 7046612345/6354910172/8291220220/9892219848 / 8160205051, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com

తేది: 28.08.2026, ప్రదేశం : విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్



**బంగారం వేలం నోటీసు**
బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ ("BFL");
రిజిస్టర్డ్ కార్యాలయం: ముంబయి - పూణె రోడ్డు, అకుర్ది, పూణె 411035

BAJAJ FINANCE

ఋణగ్రహీత(లు) మరియు సాధారణ ప్రజానీకానికి ఇందు మూలంగా తెలియచేయునది ఏమనగా ఈ కింద పేర్కొనబడిన ఋణగ్రహీతలకు పలుమార్లు నోటీసులు పునరావృతం చేసినప్పటికీ తిరిగి చెల్లింపు చేయడం లో విఫలమయ్యారు లేదా కావలసిన లాభం కేటాయించడం లో విఫలమయ్యారు, ఈ పేర్కొనబడిన కారణం వలన, లోన్ చెల్లింపు కోసం సెక్యూరిటీగా ఋణగ్రహీత(లు) అందచేసే గోల్డ్ ఈ కింది నియమాలకు లోబడి "యథాతథంగా" వేలం వేయబడుతుంది: 1. పబ్లిక్ నోటీసు యొక్క పూర్తి వివరాలు యాక్సెస్ చేయడానికి కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. (గోల్డ్ వివరాలు & స్థూల బరువు), 2. All about our Terms and Conditions - Bajaj Finance Limited పై పూర్తి బిడ్డర్ నియమాలు ఉపలబ్ధం ఉన్నాయి 3. వేలం వేసే రోజు లేదా అంతకంటే ముందుగా ఆన్‌లైన్ ద్వారా బిడ్డర్స్ ₹ 25,000/- ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (EMD) తప్పనిసరిగా డిపాజిట్ చేయాలి; 4. వేలం వేసే వేదిక వద్ద ఉదయం 10 గంటలకి చెల్లుబాటయ్యే గుర్తింపు & చిరునామా తో తప్పనిసరిగా వ్యక్తిగతంగా హాజరు కావాలి. వేలం తేదీ లో ఏదైనా మార్పు గురించి వేలం కేంద్రం లో ప్రదర్శించబడుతుంది. బిడ్ సమర్పణ పైన పేర్కొన్న నియమాలను అంగీకరించినట్లుగా పరిగణించబడుతుంది. ఏవైనా సందేహాల కోసం, wecare@bajajfinserv.in ను సంప్రదించండి.

(09-10-26) అద్దంకి - ఆర్‌టీసీ బస్ స్టాండ్; PQH3SGL87747954, 88203490, 88637660, 88663586, 89479901, 89766455, 89741123, 89746433, 90041590, 40020219, 90428481. అమలాపురం - మెయిన్ రోడ్; PGC2SGL88198669, 88667633, 88702478, 90504039. అనకాపల్లి - భార్గవి ప్లాజా; PBV8SGL87692519, 87760513, 88005123, 87951498, 88446312, 38861590, 38824759, 90287208. అనంతపుర్ - కళ్యాణ్‌దుర్గ్ రోడ్; PIV9SGL18034344, 25437948, 25655674, 27215376, 87927274, 88190491, 88197131, 88194010, 88184616, 88200598, 88460875, 88702456, 90011565. అనంతపుర్ - సుభాష్ రోడ్; PGA7SGL37317037, 87994497, 87972515, 38621058, 38872209, 88696293, 88628020, 38991533, 88856356, 88901383, 89336393, 89269213, 89313391, 89309905, 89742315, 89911064, 89980811, 90232177, 90220251, 90176117, 90450995. బద్వేల్ - ఫోర్ రోడ్ సర్కిల్; PJU6SGL12490693, 27174969, 27343847, 88202300, 88913649, 39811036, 90471287, 90416646. బాపట్ల - జీ బీ సీ రోడ్; PLN3SGL86628293, 37668460, 87397061, 87771830, 87992901, 88051506, 88000805, 88286067, 88194709, 88490743, 88712505, 88685924, 88679061, 88666352, 88680290, 89303562, 89342418, 89364906, 89213205, 89505716, 89499040, 39609308, 89765675, 89797535, 89697665, 89785037, 89983638, 90035078, 90083666, 90084324, 90102340, 90097703, 89926210, 90043852, 90072655, 90040262, 89911239, 89919749, 90213332, 90459857, 90429561, 90473583, 90451769. భీమవరం - ప్రకాష్ చౌక్; PEG7SGL36261610, 87345129, 87336421, 87329608, 88029575, 89496455, 89690981, 89731587, 90219902. బొబ్బిలి - పెద్ద బజార్ మెయిన్ రోడ్; PKI4SGL35307885, 35323699, 35329282, 35686562, 37044886, 86561369, 86642406, 38022358, 89715819, 89703722, 89943959, 90056779, 90182423, 90206321, 90195396, 90205708. చిలకలూరిపేట - ఎన్‌ఆర్‌టి సెంటర్; PJU5SGL16497144, 24026028, 24295817, 35686125, 37318491, 87354312, 88483828, 88648817, 38963198, 39333748, 89332094, 89218872, 89485862, 89762770, 90004020, 90226737, 90212423, 90452935, 90445707, 90476338, 90540894. చీరాల - సంత బజార్; PEJ9SGL17543666, 26778709, 35347906, 35694524, 87700293, 88049861, 38640458, [illegible]

బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్

వార్త

ధైర్యంతో అన్ని సమస్యల్ని పరిష్కరించుకోవచ్చు. కనుక ఎట్టి పరిస్థితుల్లోనూ ధైర్యాన్ని కోల్పోరాదు.


- రోజర్

# మాటలతో ధరలు తగ్గవు!

'పదాల కన్నా గొప్పది వాక్‌శక్తి, వాక్‌శక్తి కన్నా గొప్పది మనసు, మనసు కన్నా గొప్పది సంకల్పం' మన పాలకుల్లో ఆ సంకల్ప లోపం కారణంగానే ప్రజలకు ఇక్కట్ల మీద ఇక్కట్లు వచ్చిపడుతున్నాయేమోననిపిస్తున్నది. ఇతర సమస్యల మాట ఎలా ఉన్నా రోజురోజుకు పెరిగిపోతూ ప్రజాజీవితం నరకప్రాయంగా మారుస్తున్న నిత్యావసర వస్తువుల ధరలు అదుపులోనికి తెచ్చేందుకు ఆలోచన కానీ, ప్రయత్నం కానీ త్రికరణశుద్ధిగా జరగడం లేదు. మాటలు మాత్రం కోటలు దాటుతున్నాయి. చేతలు మాత్రం గడప దాటలేదన్నట్లుగా ఉంది. ధరల నియంత్రణకు, సమీక్షా, సమావేశాలకు కొరత లేదు. కమిటీల మీద కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. పెరుగుతున్న ధరలపై ఉక్కుపాదం మోపుతాం, అవసరమైతే ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తాం అంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. కానీ ఇవేమీ పట్టించుకునే పరిస్థితుల్లో దళారులు లేరు. ప్రస్తుత పాలకులే కాదు, ఏ పార్టీ అధికారంలో ఉన్నా ధరలు పెరగడం, వాటిని నియంత్రిస్తామని పెద్దపెద్ద మాటలు చెప్పడం, అక్రమ నిల్వలు చేసే వారిపై చర్యలు తీసుకొని కటకటాల వెనక్కి పంపుతామని బెదరించడం రివాజుగా మారిపోయింది. ఈ విషయంలో ఎప్పుడూ చర్యలు తీసుకోలేదని చెప్పడం లేదు. రకరకాల చట్టాలు తెచ్చారు. బ్లాక్ మార్కెటీర్లను జైళ్లకు పంపారు. ప్రభుత్వమన్నా, అందులో పనిచేసే అధికారులన్నా దళారులు గడగడలాడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. కానీ అవి రానురాను తగ్గిపోతున్నాయి. అధికారులను వారివారి విధులను స్వేచ్ఛగా చేయనివ్వడం లేదేమోననిపిస్తున్నది. అన్నింటిలోనూ మితిమీరిన రాజకీయ జోక్యం, తమ సిఫార్సులకు, రాజకీయ ఒత్తిడిలకులొంగని సమర్థులైన అధికారులను బదలీవేటుతో శంకరగిరి మాన్యాలు పట్టించడం ఏనాటి నుంచో ఆరంభమైంది. అందుకే అప్పటి భయభక్తులు ఇప్పుడు లేవు. అధికారుల్లో కూడా అంకితభావం తగ్గిపోయిందని చెప్పొచ్చు. బిల్లు, బెల్లు అనే తీరులోనే వ్యవహరించేవారు ఎక్కువైపోతున్నారు. దీనికితోడు రాజకీయాల్లో కీలకపాత్ర వహిస్తున్న కొందరు పెద్దలు మరి కొందరు అక్రమ వ్యాపారస్తులతో మమేకమైపోతున్నారు. కొన్ని ప్రాంతాల్లో అయితే నాయకులే కుటుంబ సభ్యుల పేరుతోనో, లేక స్వయంగా వ్యాపారాలు చేసే వారు కూడా ఉన్నారు. ఇదేమీ కొత్త విషయం కాదు. ఇప్పటికిప్పుడు ప్రారంభమైంది కూడా కాదు. కానీ ఈ సంప్రదాయం రానురాను పెరిగిపోతుండడం ఆందోళన కలిగించే అంశం. రాజకీయమే వ్యాపకంగా జీవనం సాగించేవారి సంఖ్య క్రమేపీ తగ్గిపోతున్నది. డబ్బు సంపాదనే ధ్యేయంగా మారిపోతున్నది. ఎన్నికలు కూడా అలా రూపాంతరం చెందాయి. డబ్బు, మద్యం, పంపిణీ చేయలేనివారు ఎన్నికల వైపు చూసే పరిస్థితులు లేవు. ఇందులో ప్రజల బాధ్యత కూడా కొంతవరకు ఉందని చెప్పక తప్పదు.


కొందరు బడా వ్యాపారులు, మరికొందరు రాజకీయ నాయకులకు అవినాభావ సంబంధాలు ఏర్పడుతున్నాయి. కొందరు అవినీతి అధికారులు వీరితో చేతులు కలుపుతున్నారు. చివరకు ఈ భారమంతా ప్రజలు భరించకతప్పదు. దీంతో ఎన్నికేకలు పెట్టినా, మరెన్ని హెచ్చరికలు చేసినా ఇంకెన్ని కేసులు పెట్టినా తమను ఏమీ చేయలేవనే దీమా అక్రమ వ్యాపారస్తుల్లో పెరిగిపోతున్నది. ధరలు పెరగడానికి ముఖ్యకారణాల్లో ఇదొకటి. ద్రవ్యోల్బణంతోపాటు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాలు కారణం కాగా ప్రస్తుతం సూపర్ ఎల్‌నినో ప్రభావంతో ఈ ఖరీఫ్‌లో సాగు తగ్గిపోవడంతోపాటు మార్కెట్ మాయాజాలం అన్నింటి కంటే ముఖ్యకారణంగా చెప్పొచ్చు. పప్పుదినుసుల ధరలు అందుకోలేనంతగా పెరిగిపోయాయి. ఈసారి పప్పుదినుసుల సాగు కూడా అంతంత మాత్రంగా ఉండడంతో దిగుబడులు గణనీయంగా తగ్గుతాయనే ముందస్తు అంచనాలతో కొందరు దళారులు ఉన్న సరుకును గోదాముల్లో నిల్వ చేసుకున్నారు. పప్పుదినుసులే కాదు పేదలు నిత్యం వాడే కారం, ఉప్పు, నూనె వంటి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. అన్నింటికంటే మించి తెలుగు రాష్ట్రాల్లో గత మూడు, నాలుగేళ్లుగా విపరీతంగా దిగుబడులు వస్తున్నా, బియ్యం ధరలు ఆకాశానికి అంటుకుంటున్నాయి. గతంలో ఎన్నడూలేని విధంగా ఈసారి బియ్యం కిలో డెబ్బైరూపాయల వరకు అమ్ముతున్నారు. ఈ యేడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడడం, చీడపీడలు పెరగడం, దిగుబడులు మరింత పడిపోయే అవకాశమున్నట్లు నిపుణులే అంగీకరిస్తున్నారు. ఇలాంటి రాబోయే పరిస్థితులను ముందుగానే ఊహించి దీన్ని సొమ్ము చేసుకునేందుకు కొందరు వ్యాపారులు, దళారులు పావులు కదుపుతున్నారు. ఇదంతా పాలకులకు తెలియంది ఏమీ కాదు. కానీ ఆ వైపు అడుగులు పడడం లేదు. మరోకవైపు రైతుకు గిట్టుబాటు ధర రాకపోవడంతో వ్యవసాయరంగం రోజురోజుకు సంక్షోభంలో కూరుకుపోతున్నది. మరోకవైపు మార్కెట్లో చూస్తే వినియోగదారులు కొనలేక నానాయాతన పడుతున్నారు. పండిన పంటలు ఎక్కడ ఉన్నాయి? గోదాములు ఎవరివి? నిబంధనలను అతిక్రమించి దాచిన అక్రమ నిల్వలు ఎన్ని? తదితర వివరాలు, సమాచారం అధికారులకు తెలియకుండాపోయే అవకాశం లేదు. వాటిని బయట పెట్టి వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురాగలిగితే కొంతవరకైనా ధరలు అదుపుచేసే అవకాశాలున్నాయి. ఇక కూరగాయల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కూరగాయల సాగు తెలుగు రాష్ట్రాల్లో గణనీయంగా తగ్గిపోతున్నది. బీదా బిక్కేకాదు సామాన్యులు, మధ్యతరగతి వర్గాలు కూడా రేట్లు అందుకోలేనంతగా పెరిగిపోతున్నాయి. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్రాల పాలకులు అదుపులేకుండా పెరిగిపోతున్న ధరల విషయంలో నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

దురలవాట్లు మొదట్లో సాలెగూళ్ల లాంటివి. తర్వాత అవి ఇనుప గొలుసులై మిమ్మల్ని బంధిస్తాయి.



హెచ్.లాంగ్‌ఫెలో

నైతిక విలువలు విడిచిపెట్టి పూజచేసినా, జపం చేసినా, ధ్యానం చేసినా అది భక్తి కాదు రాక్షసభక్తి.



బెర్నార్డ్ షా

## ప్రజావాక్కు



### ఆస్పత్రుల్లో రక్షణ కరవు

ఒక నవజాత శిశువు ప్రపంచంలోకి అడుగుపెట్టిన క్షణం నుంచి అతడి ప్రాణాలను కాపాడటం వైద్య వ్యవస్థకు అత్యంత పవిత్రమైన బాధ్యత. కానీ అమరావతిలోని నియో నేటల్ ఐసీయూలో అగ్నిప్రమాదంలో ముగ్గురు పసికందులు మృతి చెందిన ఘటన, మైసూరులోని చెలువాంబ ఆసుపత్రిలో గత ఏడాది 1,026 ప్రసవాల్లో 110 మంది నవజాత శిశువులువివిధ ఇన్ఫెక్షన్ల కారణంగా మృతి చెందినట్లు వెలువడిన సమాచారం ప్రత్యేక వైద్య సంరక్షణ అవసరమైన పసిప్రాణాలు ఎంతటి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందో గుర్తుచేస్తున్నాయి. ఈ ఘటనలపై ఎవరి తప్పిదాన్ని ముందుగానే నిర్ణయించడం ఉద్దేశంకాదు. కానీ ఒక్కసారికాదు, పదేపదే ఇలాంటి విషాదాలు చోటుచేసుకుంటున్నప్పుడు వ్యవస్థను ప్రశ్నించడం మాత్రం తప్పనిసరి. నవజాత శిశువుల విభాగాల్లో సాధారణ ఆసుపత్రుల కంటే మరింత కఠినమైన భద్రతా ప్రమాణాలు అవసరం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### పాశ్చాత్య ధోరణులు

భారతదేశ వాతావరణ పరిస్థితులను బట్టి మనది ఉష్ణ మండల దేశంగా పరిగణిస్తారు. మనదేశంలో వివిధ ప్రాంతాలలో విభిన్నమైన వాతావరణ పరిస్థితులు ఉండటం కద్దు. వేసవిలో అయితే అసాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతూ ఉంటాయి. ఈ మధ్యకాలంలో పిల్లలు, యువతీ యువకులు, స్త్రీలు, పురుషులు ఉష్ణతాపం తట్టుకోలేకనో లేక పాశ్చాత్య ధోరణిలో చిన్నదుస్తులు ధరించి మండు వేసవిలో యధేచ్ఛగా సంచరిస్తున్నారు. సాధారణంగా సూర్యకిరణాల వేడిమి 30నుంచి 35 డిగ్రీల సెల్సియస్ అంతకు మించితే సూర్యకిరణాలలో అల్ట్రా వయొలెట్ కిరణాలు ఎక్కువగా ఉంటాయి. ఈ కిరణాలు చర్మానికి నేరుగా సోకితే చర్మ క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉంది.

- కె. వెంకట్, సికింద్రాబద్

### బిఎల్‌ఓలు ఇంటింటికి తిరిగి ఇవ్వాలి

ఓటరు జాబితా ప్రక్షాళనలో భాగంగా ఇటీవల విడుదల అయిన జాబితాలో కొందరి ఓటర్ల పేర్లు, తల్లిదండ్రుల పేర్లు, చిరునామాలు తప్పుగా ఉండడం వలన బిఎల్‌ఓలు ప్రతి ఇంటికి వెళ్ళి నోటీసులు ఇవ్వడంతో పాటు ఓటర్లకు అవగాహన కల్పించాలి. గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. అర్హతగా ఉన్న ఏ ఒక్క ఓటరు అనర్హులుగా మిగలొద్దు.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### అతివేగం అనర్థదాయకం

పెరుగుతున్న వాహనాల సంఖ్య, మితిమీరిన వేగం కారణంగా నేడు రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. ఎందరో ప్రాణాలు కోల్పోవడమే కాకుండా, అనేక కుటుంబాలు వీధిన పడుతున్నాయి. రోడ్లను ప్రమాదరహితంగా మార్చడం అనేది కేవలం ప్రభుత్వం బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి కర్తవ్యం. రహదారి భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించడం వల్ల కలిగే పరిణామాలు అత్యంత భయంకరంగా ఉంటున్నాయి. ప్రమాదాల నివారణకు రహదారుల రూపకల్పనలో శాస్త్రీయ పద్ధతులు పాటించాలి. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, రాత్రివేళల్లో తగినంత వెలుతురు ఉండేలా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి. గుంతలమయమైన రోడ్లను వెంటనే మరమ్మతు చేయడం ద్వారా చాలా ప్రమాదాలను నివారించవచ్చు. అలాగే, అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి ఉల్లంఘనలపై కఠినమైన జరిమానాలు, చట్టపరమైన చర్యలుతీసుకోవాలి. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపట్ల ఎటువంటి మినహాయింపు ఉండదు.

- సి. సాయిరుత్విక్, శ్రీకాకుళం

### కేసులను వెంటనే పరిష్కరించాలి

వినియోగదారుల ఫోరంలో రోజురోజుకి ఇంత జాప్యం జరుగుతున్నా పట్టించుకునేవారు లేరు. ఈకోర్టు కేసులో ఫోరంలో కేసు వేసినచో 90రోజుల్లో పరిష్కారం లభించేది. కానీ ఇప్పుడు మూడునాలుగు సంవత్సరాలు గడిచినకానీ కేసు పరిష్కారం జరగటంలేదు కానీ కేసు బాధితులుమాత్రం కోర్టు చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన పరిస్థితి నెలకొన్నాయి. అన్ని కేసుల వైపు కాకుండా వినియోగదారు ఫోరంలో తక్షణమే ఆధారాలతో యుక్తంగా ఉంటే వెంటనే పరిష్కారం తీర్పు వెలబడును. కానీ నేటివరకు కూడా పరిష్కార దిశలు కనుక్కోలేకపోతున్నారు. సిబ్బంది కూడా అంతంత మాత్రమే ఉన్నారు.

- సి. లక్ష్మీనారాయణ, కరీంనగర్

### వర్షపు నీటిని ఒడిసిపట్టాలి

ఉపాధిహామీ కొత్త రూపం సంతరించుకున్న తరువాత రోజుల పెంపు గురించి దానిని అందుకోవడం గురించి చాలా చర్చ జరుగుతున్నది. ఐతే అందరికి 125రోజుల లక్ష్యం అందుకోవడం సాధ్యంకాకపోవచ్చు. కానీ కనీసంలో కనీసం 110 రోజుల లక్ష్యం చేరుకోవడం విఫలం ఏమికాదు. అయితే ఎల్‌నీనో ప్రభావం సెప్టెంబర్ మాసంలో తెలంగాణలో తీవ్ర ప్రభావం చూపబోతున్నది తద్వారా పడిన కాసిన్ని చినుకులు అయినా వడిసి పట్టే అవకాశం ఉంటుంది.

- భారత అవినాష్, జనగామ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి
ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# ఎల్‌నినో కట్టడికి ప్రత్యేక కార్యాచరణ

**ప్రభుత్వ చర్యలతో పాటు ప్రజల భాగస్వామ్యమూ అంతేకీలకం. పరిశ్రమలు నీటి పునర్వినియోగాన్ని తప్పనిసరి చేయాలి. విద్యుత్ పొదుపు చేసే సాంకేతికతలను ప్రోత్సహించాలి. బ్యాంకులు, బీమా సంస్థలు వాతావరణ ముప్పులను దృష్టిలో ఉంచుకుని రైతులు, చిన్న వ్యాపారులకు రక్షణ కల్పించే కొత్త పథకాలను రూపొందించాలి. విద్యాసంస్థలు విద్యార్థుల్లో నీటి సంరక్షణ, పర్యావరణ బాధ్యతను పెంపొందించాలి. ప్రతి కుటుంబం నీటి పొదుపు, విద్యుత్ ఆదా, మొక్కల పెంపకాన్ని దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలి. ఎల్‌నినోను మనం ఆపలేం. ఎందుకంటే అది ప్రకృతి వ్యవస్థలో భాగం. కానీ దాని ప్రభావాన్ని జాతీయ సంక్షోభంగా మారకుండా నిరోధించే శక్తి మన చేతుల్లోనే ఉంది. శాస్త్రీయ ఆలోచన, దూరదృష్టి గల పాలన, ప్రకృతి వనరుల వివేక వంతమైన వినియోగం, ప్రజల బాధ్యతాయుతమైన భాగస్వామ్యం కలిసి నడిస్తే ఎల్‌నినో ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చు.**

డి జె మోహన రావు

ఒకప్పుడు ఎల్‌నినో అంటే రుతుపవనాల తీరు మారడానికి కారణమయ్యే ప్రకృతి పరిణామం అనే అవగాహనే ఉండేది. కానీ నేడు అది దేశ వ్యవసాయం, నీటి వనరులు, విద్యుత్ ఉత్పత్తి, ప్రజారోగ్యం, పర్యావరణం, ఆర్థిక వ్యవస్థ వంటి సమస్త జీవన రంగాలను ఒకేసారి ప్రభావితం చేసే సవాలుగా మారింది. వాతావరణ మార్పులు దీనికి తోడవడంతో ప్రమాద తీవ్రత మరింత పెరుగుతోంది. అందుకే ఎల్‌నినోను కేవలం వాతావరణ ఘటనగా కాకుండా దేశ భవిష్యత్తును ప్రభావితం చేసే జాతీయ సవాలుగా గుర్తించి దీర్ఘకాలిక కార్యాచరణను రూపొందించాల్సిన అవసరం ఉంది. ఎల్‌నినో తొలి దెబ్బ వ్యవసాయ రంగంపైనే పడుతుంది. దేశంలోని సుమారు సగానికి పైగా సాగుభూమి ఇప్పటికీ వర్షాధారంగానే ఉంది. వర్షాలు ఆలస్యమైనా, తక్కువగా కురిసినా, ఒక్కసారిగా అధికంగా కురిసినా రైతే ఎక్కువ నష్టపోతాడు. ఈ పరిస్థితిని మార్చాలంటే వ్యవసాయాన్ని పూర్తిగా వర్షాలపై ఆధారపడే స్థితి నుంచి క్రమంగా బయటకు తీసుకురావాలి. ప్రతి నీటి బొట్టును ఆదా చేసే డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సాగు పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించాలి. గ్రామస్థాయిలోనే రైతులకు ఖచ్చితమైన వాతావరణ సమాచారాన్ని అందించి, ఏ పంట వేయాలి, ఎప్పుడు విత్తాలి, ఎంత నీరు ఇవ్వాలనే నిర్ణయాలను శాస్త్రీయ సూచనల ఆధారంగా తీసుకునేలా వ్యవస్థను బలోపేతం చేయాలి. నీటి కొరతను ఎదుర్కోవడం వ్యవసాయానికే కాదు, తాగునీరు, పరిశ్రమలు, పట్టణ జీవనానికీ అత్యంత కీలకం. అందువల్ల నీటి సంరక్షణను జాతీయ ఉద్యమంగా చేపట్టాలి. గ్రామాల్లో ఫామ్‌పాండ్లు, పట్టణాల్లో ఇంకుడు గుంతలు, వర్షపు నీటి నిల్వ వ్యవస్థలను తప్పనిసరి చేయాలి. నిర్లక్ష్యానికి గురైన చెరువులు, కాలువలను పునరుద్ధరించాలి. భూగర్భ జలాల విచ్చలవిడి వినియోగాన్ని నియంత్రిస్తూ వాటి పునరుద్ధరణకు ప్రాధాన్యం ఇవ్వాలి. పరిశ్రమల్లో శుద్ధి చేసిన నీటిని తిరిగి వినియోగించే విధానాన్ని విస్తృతంగా అమలు చేయాలి. వ్యవసాయ విధానంలో కూడా మార్పు అవసరం. నీటి కొరత ప్రాంతాల్లో వరి, చెరకు వంటి అధిక నీటి అవసరమున్న పంటలపై ఆధారపడటం భవిష్యత్తులో మరింత ప్రమాదకరం. అలాంటి ప్రాంతాల్లో చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు వంటి తక్కువ నీటితో పండే పంటలను ప్రోత్సహించాలి. నేలలో తేమను నిలిపే ఆధునిక సాగు పద్ధతులను విస్తరించాలి. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన రైతు పరిహారం కోసం నెలల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి మారాలి. ఉపగ్రహ చిత్రాలు, డిజిటల్ సాంకేతికత ఆధారంగా పంట నష్టాన్ని వేగంగా అంచనా వేసి బీమా పరిహారాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసే పారదర్శక వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఎల్‌నినోతో వేడి తరంగాల తీవ్రత కూడా పెరుగుతోంది. వేసవి కాలం పొడవుగా మారుతుండగా ఉష్ణోగ్రతలు కొత్త రికార్డులు నమోదు చేస్తున్నాయి. రైతులు, నిర్మాణ కార్మికులు, వృద్ధులు, చిన్నారులు ఎక్కువగా ప్రభావితమవుతున్నారు. వడదెబ్బలు, నిర్జలీకరణ, గుండె సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయి. కాబట్టి హీట్‌వేవ్‌లను సాధారణ వేసవి సమస్యగా కాకుండా ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా పరిగణించాలి. ముందస్తు హెచ్చరికలు, తాగునీటి కేంద్రాలు, పనివేళల మార్పు వంటి చర్యలతో పాటు పట్టణ ప్రణాళికలో చెట్ల పెంపకం, హరిత ప్రాంతాలు, గ్రీన్



బిల్డింగ్‌లకు ప్రాధాన్యం ఇవ్వాలి. నగరాలు వేడిని వెదజల్లే కాంక్రీట్ ద్వీపాలుగా మారకుండా ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి అవసరం. అధిక ఉష్ణోగ్రతలతో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల వ్యాప్తి తీరులో మార్పులు కనిపిస్తున్నాయి. మరోవైపు దీర్ఘకాలం ఎండలు కొనసాగితే అడవుల్లో కార్చిచ్చుల ప్రమాదం పెరుగుతుంది. ఇది జీవవైవిధ్యానికి తీవ్రమైన ముప్పు. అందువల్ల అడవులు, మడ అడవులు, చిత్తడి నేలలను సంరక్షించడం పర్యావరణ పరిరక్షణమాత్రమేకాదు దేశ భద్రతలో భాగంగా భావించాలి. ఎల్‌నినో ప్రభావాన్ని ముందుగానే గుర్తించి నష్టాన్ని తగ్గించడంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం కీలకం. పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు, కెల్విన్ తరంగాల కదలికలు, వాతావరణ మార్పులను నిరంతరం పరిశీలిస్తూ మరింత ఖచ్చితమైన అంచనాలు రూపొందించాలి. కృత్రిమ మేధస్సు, ఆధునిక వాతావరణ నమూనాలను విస్తృతంగా వినియోగించాలి. పరిశోధనల ఫలితాలు రైతుకు అర్థమయ్యే భాషలో గ్రామస్థాయికి చేరి, అధికారుల నిర్ణయాలకు మార్గదర్శకంగా మారినప్పుడే వాటి అసలు ప్రయోజనం ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరగడంతో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతుంది. అదే సమయంలో జలాశయాల్లో నీరు తగ్గి జలవిద్యుత్ ఉత్పత్తి పడిపోతుంది. ఈ పరిస్థితిని ఎదుర్కోవాలంటే సౌర, పవన విద్యుత్ ఉత్పత్తిని వేగంగా విస్తరించాలి. రూఫ్ టాప్ సోలార్, విద్యుత్ నిల్వ బ్యాటరీలు, శక్తి సామర్థ్యం ఎక్కువగా ఉన్న పరికరాల వినియోగాన్ని ప్రోత్సహించాలి. ఎల్‌నినో ప్రభావం చివరకు సామాన్యుడి వంటింటికీ చేరుతుంది. వర్షాభావంతో పంట దిగుబడులు తగ్గితే బియ్యం, పప్పులు, కూరగాయలు, వంటనూనెల ధరలు పెరుగుతాయి. పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడుతుంది. అందువల్ల ప్రభుత్వం ముందుగానే ఆహార నిల్వలను బలోపేతం చేయాలి. ఆధునిక శీతల గిడ్డంగులను విస్తరించి పంట కోత తర్వాతి నష్టాలను తగ్గించాలి. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా దిగుమతి-ఎగుమతి విధానాలను సకాలంలో సవరించాలి. కృత్రిమ కొరత సృష్టించే అక్రమ నిల్వదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. రైతుకు గిట్టుబాటు ధర, వినియోగదారుడికి అందుబాటు ధర లభించేలా సమతుల్య విధానాలు అమలు చేయాలి. ఎల్‌నినోను ఎదుర్కోవడం ఒక్క శాఖ బాధ్యత కాదు. వ్యవసాయం, నీటిపారుదల, గ్రామీణాభివృద్ధి, విద్యుత్, ఆరోగ్యం, పర్యావరణం, విపత్తు నిర్వహణ, ఆర్థిక శాఖలు సమన్వయంతో పనిచేయాలి. దేశమంతటికీ ఒకే విధానం సరిపోదు. రాజస్థాన్‌కు అవసరమైన ప్రణాళిక కేరళకు సరిపోదు, ఈశాన్య రాష్ట్రాల అవసరాలు దక్కన్ పీఠభూమి పరిస్థితులతో పోల్చలేం. ప్రతి రాష్ట్రం తన భౌగోళిక పరిస్థితులు, నీటి లభ్యత, పంటల స్వభావాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకోవాలి. ప్రభుత్వ చర్యలతో పాటు ప్రజల భాగస్వామ్యమూ అంతే కీలకం. పరిశ్రమలు నీటి పునర్వినియోగాన్ని తప్పనిసరి చేయాలి. విద్యుత్ పొదుపు చేసే సాంకేతికతలను ప్రోత్సహించాలి. బ్యాంకులు, బీమా సంస్థలు వాతావరణ ముప్పులను దృష్టిలో ఉంచుకుని రైతులు, చిన్న వ్యాపారులకు రక్షణ కల్పించే కొత్త పథకాలను రూపొందించాలి. విద్యాసంస్థలు విద్యార్థుల్లో నీటి సంరక్షణ, పర్యావరణ బాధ్యతను పెంపొందించాలి. ప్రతి కుటుంబం నీటి పొదుపు, విద్యుత్ ఆదా, మొక్కల పెంపకాన్ని దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలి. ఎల్‌నినోను మనం ఆపలేం. ఎందుకంటే అది ప్రకృతి వ్యవస్థలో భాగం. కానీ దాని ప్రభావాన్ని జాతీయ సంక్షోభంగా మారకుండా నిరోధించే శక్తి మన చేతుల్లోనే ఉంది. శాస్త్రీయ ఆలోచన, దూరదృష్టి గల పాలన, ప్రకృతి వనరుల వివేకవంతమైన వినియోగం, ప్రజల బాధ్యతాయుతమైన భాగస్వామ్యం కలిసి నడిస్తే ఎల్‌నినో ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. ఎల్‌నినోను సాధారణ వాతావరణ ఘటనగా కాకుండా దేశ భవిష్యత్తుకు ప్రకృతి వినిపిస్తున్న హెచ్చరికగా గుర్తించినప్పుడే నిజమైన మార్పుకు నాంది పలుకుతుంది. ●

# పట్టిసీమ నీటితో డెల్టాకు కొత్త ఊపిరి

జి.సూర్యనారాయణ

రాజకీయ నేతలు ఓట్ల కోసం ఆలోచిస్తే రాజకీయ వేత్తలు ముందు చూపుతో భావితరాల కోసం ఆలోచిస్తారని నానుడి. రాజకీయ వేత్తలు దూరదృష్టితో తీసుకున్న నిర్ణయాలే భవిష్యత్తులో ప్రజలకు ఉపయుక్తంగా వుంటుందని అనటానికి పట్టిసీమ ఎత్తిపోతల పథకం ఒక ఉదాహరణగా అని చెప్పవచ్చు. నవ్యాంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యారు. ఆర్థిక లోటుతో పాటు నీటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. పోలవరం బహుళార్థక సాధక ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కావటానికి చాలా సంవత్సరాలు పడుతుంది. కృష్ణానదికి ఎగువన కర్ణాటక, తెలంగాణలో నిర్మించిన ప్రాజెక్టుల వల్ల ప్రకాశం బ్యారేజీకి రానురాను నీటి ప్రవాహం తగ్గిపోతోంది. ఈ నేపథ్యంలో కృష్ణాడెల్టాలోని 13లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని, లక్షల ప్రజలకు తాగు నీటిని ఇచ్చి కాపాడేందుకు నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో దక్షిణ భారతంలోతొలిగా నదుల అనుసంధానికి శ్రీకారం చుట్టారు. గోదావరి జిల్లాలోని పట్టిసీమ గ్రామంలో గోదావరి నదీ వద్ద పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని యుద్ధ ప్రాతిపదికన నిర్మించేందుకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 1600 వందల కోట్లను కేటాయించారు. అప్పటి ప్రతిపక్షనేత ఇది పట్టిసీమ కాదు, వట్టిసీమ అని రాష్ట్ర అసెంబ్లీలో నానా రగడ చేశారు. ఈ పథకాన్ని మా పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఖరాకండీగా ప్రకటించారు. ఈ ప్రాజెక్టు కాంట్రాక్టర్ల జేబులు నింపటానికేనని



ఆయన తీవ్రంగా విమర్శించారు. ఎన్ని విమర్శలు చేసినా చంద్రబాబు పంతం పట్టి ఒక్క ఏడాదిలోనే పట్టి సీమ పథకం నిర్మాణం చేశారు. పోలవరం కుడి కాలువలో మిగిలిన వందల కిలో మీటర్ల ప్రాంతాన్ని తవ్వి ఇబ్రహీంపట్నం వద్ద కృష్ణానదిలో అనుసంధానం చేశారు. గోదావరికి వరద వచ్చే సమయంలో 24 పంపులతో రోజుకీ 8వేలు పైగా క్యూసెక్కులు నీటిని ఇది ఎత్తిపోస్తుంది. కృష్ణానదికి వరద ప్రవాహం లేని రోజులలో పట్టిసీమ నీటిని తోడి కృష్ణా డెల్టాలోని 13 లక్షల ఎకరాల ఆయకట్టుకు జీవం పోస్తుంది. రైతులకు, ప్రజలకు ఉభయతారకంగా నిలిచింది. నేడు ఎల్‌నిన్ ప్రభావంతో నైరుతీ రుతుపవనాలు వచ్చినా నేటికీ పూర్తిస్థాయిలో వర్షాలు కురవలేదు. ఈనేపథ్యంలో కృష్ణా నదిలో నీటి ప్రవాహం లేదు. వరదలురాలేదు. ఈ నేప థ్యంలో పట్టి సీమ నీరే కృష్ణాడెల్టాలోని లక్షలాది ఎకరాల భూములకు, లక్షల ప్రజల తాగునీరుకు నేడు శరణ్యమైంది. ఎల్‌నిన్ ప్రభావంతో ఉమ్మడి కృష్ణాజిల్లాలలో ఇప్పటికీ సరైన వర్షపాతం లేదు. ఈ తరుణంలో పట్టిసీమ పథకం లేకపోతే సాగు సరే తాగునీటికి ప్రజలు అల్లాడిపోయేవారు. ముందుచూపుతో, దార్శనికతతో పట్టిసీమను నిర్మించిన ముఖ్యమంత్రి చంద్రబాబును రైతులు, ప్రజలు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు. పట్టిసీమను వ్యతిరేకించిన వారి నిర్ణయాలను జనం తూర్పార పడుతున్నారు. ప్రతి పథకాన్ని గుడ్డిగా విమర్శించటం అవివేకం. అవినీతి జరిగితే ప్రభుత్వాన్ని నిలదీయవచ్చు. విపక్షాలు ప్రతిదాన్ని విమర్శించటం వల్ల ప్రజలలో చులకనై నవ్వులు పాలవ్వుతారని పట్టిసీమ ఉదంతమే ప్రబల తార్కాణం. ●

# సముద్ర సంరక్షణే ఆర్థికాభివృద్ధికి మూలం

డి. జయరాం

మన దేశం మూడు వైపులా సముద్రాలను ఆనుకుని ఉన్న దేశం. అయినప్పటికీ మన అభివృద్ధి చర్చల్లో సముద్రాలకు తగిన స్థానం దక్కలేదు. వ్యవసాయం, పరిశ్రమలు, రహదారులు, నగరాల గురించి ఎంతమాట్లాడామో, సముద్రాల గురించి అంతగా ఆలోచించలేదు. కానీప్రపంచం ఇప్పుడు మరో వాస్తవాన్ని గుర్తిస్తోంది. భూమిపై అవకాశాలు కుదుస్తున్న కొద్దీ భవిష్యత్తు విస్తరిస్తున్నది సముద్రాల్లోనే. సముద్రాలు కేవలం నీటి విస్తీర్ణాలు కావు. అవి వాణిజ్య మార్గాలు. ఆహార వనరులు, ఉపాధి ఆధారాలు, వ్యూహాత్మక ఆస్తులు, భారత విదేశీ వాణిజ్యంలో పరిమాణం పరంగా దాదాపు 95 శాతం, విలువ పరంగా సుమారు 70 శాతం సరకు రవాణా సముద్ర మార్గాల ద్వారానే సాగుతోంది. దేశానికి రెండు మిలియన్ చదరపు కిలోమీటర్లకు పైగా ప్రత్యేక ఆర్థిక మండలం, 7,500 కిలోమీటర్లకు పైగా తీర రేఖ ఉన్నాయి. మత్స్యరంగం నుంచి ఇంధన భద్రతవరకు, ఓడరేవుల నుంచి అంతర్జాతీయ వాణిజ్యం వరకు అనేక రంగాలు సముద్రాలపై ఆధారపడి ఉన్నాయి. అందుకే సముద్రాల ఆరోగ్యం దెబ్బతింటే నష్టపోయేది పర్యావరణం మాత్రమే కాదు. ఆర్థిక వ్యవస్థ కూడా. ప్రపంచం నేడు సముద్రాలను కాపాడాలని మాట్లాడటానికి కారణం వాటిపై పెరుగుతున్న ఒత్తిడే. అధిక మత్స్యవేట, ప్లాస్టిక్ కాలుష్యం, వాతావరణ మార్పులు సముద్ర జీవవైవిధ్యాన్ని క్రమంగా క్షీణింపజేస్తున్నాయి. సముద్ర ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. పగడపు దిబ్బలు తెల్లబడుతున్నాయి. అనేక చేపల జాతులు ఒత్తిడికి గురవుతున్నాయి. ఒకప్పుడు అంతులేని వనరులుగా కనిపించిన సముద్రాలు కూడా పరిమిత సామర్థ్యం కలిగిన పర్యావరణ వ్యవస్థలేనని ప్రపంచం ఆలస్యంగా గ్రహిస్తోంది. ఈ క్షీణత సముద్రాల్లోనేఆగిపోదు. దాని ప్రభావం ఆహార భద్రతపై పడుతుంది. ఉపాధిపై పడుతుంది. వాణిజ్యంపై పడుతుంది. చివరికి వాతావరణ స్థిరత్వంపైనా పడుతుంది. భారత్ కూడా ఈ సవాళ్లకు అతీతం కాదు. తీరప్రాంతాల్లో వేగంగా పెరుగుతున్న నగరీకరణ, పారిశ్రామిక వ్యర్థాలు, ప్లాస్టిక్ కాలుష్యం, మడ అడవుల క్షీణత, కొన్ని ప్రాంతాల్లో అధిక మత్స్య వేట ఇప్పటికే హెచ్చరికలు జారీ చేస్తున్నాయి. మరోవైపు వాతావరణ మార్పుల కారణంగా సముద్ర మట్టం పెరుగుతోంది. తుఫానుల తీవ్రత అధికమవుతోంది. తీరప్రాంత ప్రజల జీవన విధానాలు ఒత్తిడికి గురవుతున్నాయి. ఒకప్పుడు ప్రకృతి వైపరీత్యాలుగా కనిపించిన అనేక సంఘటనలు ఇప్పుడు వాతావరణ సంక్షోభం తీవ్రతను గుర్తుచేస్తున్నాయి. అందుకే సముద్ర సంరక్షణను ఖర్చుగా కాదు, భవిష్యత్తుపై పెట్టుబడిగా చూడాల్సిన అవసరం ఉంది. సముద్రాలను కాపాడాలా? మత్స్యకారుల జీవనోపాధిని కాపాడాలా? అనే ప్రశ్నతరచూ వినిపిస్తుంది. కానీ ఈ రెండింటి మధ్యవిరోధం లేదు. సముద్ర జీవవైవిధ్యం క్షీణిస్తే మొదట దెబ్బతినేది మత్స్యకారుడే. చేపల నిల్వలు తగ్గితే ఆదాయంతగ్గుతుంది. పర్యావరణ వ్యవస్థ బలహీనపడితే జీవనోపాధి అస్థిరమవుతుంది. అందుకే సముద్ర సంరక్షణ మత్స్యకారులకు వ్యతి



రేకమైన విధానం కాదు, వారి భవిష్యత్తుకు రక్షణ కవచం. సముద్రాలను కాపాడటం అంటే మత్స్యకారుడి రేపటిని కాపాడటమే. ఈ వాస్తవాన్ని భారత మత్స్యరంగగణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచ చేపల ఉత్పత్తిలో భారత్ దాదాపు 8శాతం వాటా కలిగి ఉంది. ఈరంగం ప్రత్యక్షంగా సుమారు 58 లక్షల మందికి ఉపాధి కల్పిస్తోంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు మూడు కోట్ల మంది జీవనోపాధి దీనిపైనే ఆధారపడి ఉంది. 2023-24లో చేపలు, మత్స్య ఉత్పత్తుల ఎగుమతుల ద్వారా రూ.60 వేల కోట్లకు పైగా విదేశీ మారకద్రవ్యం లభించింది. ఈ సంఖ్యలు ఒక విషయాన్ని స్పష్టంగా చెబుతున్నాయి. సముద్రాల సంరక్షణ పర్యావరణ లక్ష్యం మాత్రమే కాదు. ఉపాధి, ఆదాయం, ఎగుమతులు, ఆహార భద్రతకు సంబంధించిన ఆర్థిక అవసరం కూడా. ఇదే నేపథ్యంలో ప్రపంచం మెరైన్ ప్రొటెక్టెడ్ ఏరియాస్ గురించి మాట్లాడుతోంది. సముద్రంలోని కొన్ని ప్రాంతాలను ప్రత్యేక రక్షణ కింద ఉంచి జీవవైవిధ్య పునరుద్ధరణకు అవకాశం కల్పించాలన్నదే దీని ఉద్దేశం. దీనిని కొందరు అభివృద్ధికి అడ్డంకిగా చూస్తారు. కానీ అసలు ప్రశ్న వేరే. నేడు కొంత నియంత్రణ విధించకపోతే రేపు సంరక్షించడానికి ఏమి మిగులుతుంది? ప్రకృతి వనరులవిషయంలో ప్రపంచం చేసిన తప్పులను సముద్రాల విషయంలో పునరావృతం చేయకూడదన్న ఆలోచనే ఈ విధానాలకుపునాది. అయితే ప్రపంచ లక్ష్యాలను యథాతథంగా అనుసరించడం భారత్‌కు సాధ్యం కాదు. 2030నాటికి భూమి, జలవనరులు, సముద్రాల్లో 30శాతం ప్రాంతాలను రక్షిత మండలాలుగా మార్చాలనే లక్ష్యం వెనుక ఉన్న ఉద్దేశం సమర్థనీయమే. కానీ అభివృద్ధి చెందుతున్న దేశాల సామాజిక, ఆర్థిక వాస్తవాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. సంరక్షణ పేరుతో స్థానిక సమాజాలను దూరం చేయడం కాదు. వారిని భాగస్వాములను చేయడం ముఖ్యం. సముద్రాలను కాపాడే పోరాటం మత్స్యకారులతో కలిసి సాగాలి తప్ప, వారిపై సాగకూడదు. ఈ చర్చలో తరచూ వినిపించే మరో పదం బ్లూ ఎకానమీ. దీనిని చాలామంది సముద్ర ఆర్థిక వ్యవస్థగా మాత్రమే అర్థం చేసుకుంటారు. కానీ దీని పరిధి మరింత విస్తృతమైనది. సముద్ర రవాణా, ఓడరేవులు, మత్స్యరంగం, తీర పర్యాటకం, సముద్ర జీవసాంకేతిక రంగాలు, సముద్ర గర్భ ఖనిజాలు, సముద్ర ఆధారిత పునరుత్పాదక ఇంధనం, లోతట్టు సముద్ర పరిశోధనలాంటివి ఇందులో భాగమే. సంక్షిప్తంగా చెప్పాలంటే భవిష్యత్తు ఆర్థికవృద్ధికి సముద్రాలను కొత్త సరిహద్దులుగా మార్చే అభివృద్ధి నమూనానే బ్లూ ఎకానమీ. భారత్ ఇప్పటికే ఆ దిశగా అడుగులు వేస్తోంది. సాగర్‌మాల, డీప్ ఓషన్ మిషన్ వంటి కార్యక్రమాలు అందుకు నిదర్శనం. ప్రత్యేక ఆర్థిక మండలంలో అపార మత్స్య సంపద ఉంది. సముద్రగర్భంలో విలువైన ఖనిజాలున్నాయి. సముద్ర ఆధారిత ఇంధన రంగంలో కొత్త అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ఒక విషయం మాత్రం స్పష్టం. ఆరోగ్యకరమైన సముద్రాలు లేకుండా బ్లూఎకానమీ కేవలం నినాదంగానే మిగులుతుంది. సముద్ర పర్యావరణ వ్యవస్థలు క్షీణిస్తే ఈ అవకాశాలన్నీ కాగితాలకే పరిమిత మవుతాయి. అందుకే సముద్ర సంరక్షణ, ఆర్థికాభివృద్ధి మధ్య సంఘర్షణ ఉందనే భావనతప్పు. నిజానికి సంరక్షణ లేకుండా అభివృద్ధి సాధ్యం కాదు. తక్షణ లాభాల కోసం సముద్ర సంపదను విచక్షణారహితంగా వినియోగించడం సులభం. కానీదీర్ఘకాలిక అభివృద్ధి కోసం దానిని సంరక్షించడమే వివేకం. నేడువిధించే పరిమితులు రేపటి అవకాశాలను కాపాడతాయి. ●




# ట్రంప్‌కు మరో షాక్!

## జన్మతః పౌరసత్వం రద్దు ఉత్తర్వులను నిలిపివేసిన ఫెడరల్ కోర్టు

**వాషింగ్టన్, సెప్టెంబరు 3:** అమెరికా గడ్డపై అడుగుపెట్టి బిడ్డకు జన్మనిస్తే చాలు.. ఆ బిడ్డకు ఆటోమేటిక్‌గా అమెరికన్ పౌరసత్వం వచ్చేస్తుంది! పదేపదే ఈ నిబంధనపై విరుచుపడే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఆ దేశ న్యాయస్థానం మరోసారి గట్టి షాక్ ఇచ్చింది. పుట్టుకతో వచ్చే పౌరసత్వాన్ని రద్దు చేస్తూ ఆయన తీసుకొచ్చిన కొత్త ఉత్తర్వుల అమలును ఫెడరల్ కోర్టు గురువారం నిలిపివేసింది. సుప్రీంకోర్టు ఇప్పటికే ఒకసారి ఈ ప్రయత్నాన్ని తిరస్కరించినా, వెనక్కి తగ్గకుండా ట్రంప్ మరో రూపంలో తీసుకొచ్చిన ఉత్తర్వులకు మేరీల్యాండ్ ఫెడరల్ జడ్జ్ డెబోరా బోర్డ్‌మన్ బ్రేకులు వేశారు. అమెరికా పౌరులు లేదా గ్రీన్‌కార్డు హోల్డర్లు కాని విదేశీయులకు పుట్టే పిల్లలకు పౌరసత్వాన్ని ట్రంప్ గతంలోనే ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ఇచ్చారు. అయితే జూన్ 30న అమెరికా సుప్రీంకోర్టు ఆ ఉత్తర్వును తీవ్రంగా తప్పుపట్టింది. అమెరికా రాజ్యాంగంలోని 14వ సవరణలో ఉన్న పౌరసత్వ నిబంధనలకు ఇది పూర్తిగా విరుద్ధమని స్పష్టం చేసింది. అమెరికా భూభాగంలో జన్మించిన ప్రతి ఒక్కరికీ చట్టబద్ధంగా పౌరసత్వం లభిస్తుందని తేల్చిచెప్పడంతో ట్రంప్ తొలి ప్రయత్నం దారుణంగా విఫలమైంది.

**మళ్లీ పంతానికి పోయిన ట్రంప్ .. 'బర్త్ టూరిజం'పై గురి**

సుప్రీంకోర్టు షాక్ ఇచ్చినప్పటికీ ట్రంప్ తన పంతాన్ని వీడలేదు. కొందరు మహిళలు కేవలం తమ పిల్లలకు అమెరికా పౌరసత్వం దక్కాలనే ఉద్దేశంతోనే ప్రసవ సమయానికి వీసాలపై ఇక్కడికి వస్తున్నారని, దీనినే 'బర్త్ టూరిజం' అంటారని ఆరోపిస్తూ గత నెల 6న మరొక కొత్త ఆదేశంపై సంతకం చేశారు. విదేశీ ప్రభుత్వ ఉద్యోగులు, మోసపూరిత మార్గాల్లో లేదా వ్యాపారాల ద్వారా పౌరసత్వం పొందాలని చూసేవారి పిల్లలకు, అలాగే 'శత్రు దేశాల పౌరులుగా' వర్గీకరించిన వారి పిల్లలకు పౌరసత్వాన్ని నిరాకరించేలా అందులో కఠిన నిబంధనలు చేర్చారు.

**న్యాయస్థానాన్ని ఆశ్రయించిన హక్కుల సంఘాలు**

ట్రంప్ కొత్త ఆర్డర్ వెలువడగానే వలసదారుల హక్కుల కోసం పోరాడే 'కాసా' (సిఎఎస్ఎ), 'అసైలమ్ సీకర్ అడ్వకేసీ ప్రాజెక్టు' వంటి సంస్థలు తక్షణమే కోర్టు తలుపులు తట్టాయి. పౌరసత్వ హక్కు కోల్పోయే ప్రమాదంలో పడిన చిన్నారుల తరఫున క్లాస్-యాక్షన్ పిటిషన్ దాఖలు చేశాయి'. ట్రంప్ తీసుకొచ్చిన ఈ 'న భూతో న భవిష్యత్' తరహా ఆదేశాలను తక్షణమే నిలిపివేసి, పిల్లల హక్కులను కాపాడాలని జడ్జి డెబోరా బోర్డ్‌మన్‌ను కోరాయి. బాధితుల వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి, ట్రంప్ సర్కార్ నిర్ణయంపై స్టే విధిస్తూ ప్రాథమిక ఇంజక్షన్ ఆర్డర్ జారీ చేశారు.

# భారత్, బెల్జియం వాణిజ్యం ఐదేళ్లలో రెట్టింపు

## - ఢిల్లీలో ప్రధాని మోడీతో బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ భేటీ - భాగస్వామ్యం బలోపేతానికి అధినేతల అంగీకారం - రక్షణ, వాణిజ్యంలో ద్వైపాక్షిక ఒప్పందాలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3:** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ గురువారం న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో నిర్వహించిన ద్వైపాక్షిక చర్చల సందర్భంగా తమ దేశాల మధ్య ఉన్న సమగ్ర సంబంధాలను సమీక్షించారు. రక్షణ, వాణిజ్యం, పెట్టుబడులు, ఆవిష్కరణలు, సెమీకండక్టర్లు, ఫిన్‌టెక్, కీలక ఖనిజాలు, ప్రజల మధ్య సంబంధాలు, విద్యాపరిశోధన సహకారం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఇద్దరు నేతలు చర్చలు జరిపారు. పరస్పర ఆసక్తి ఉన్న ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై అభిప్రాయాలను పంచుకోవడంతో పాటు, భారత్-బెల్జియం మధ్య ఉన్న సన్నిహిత, బహుముఖ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి తాము కట్టుబడి ఉన్నామని వారు పునరుద్ఘాటించారు. ఈ విషయాన్ని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. ఇరుదేశాల ప్రధానమంత్రుల సమక్షంలో రక్షణ, పునరుత్పాదక ఇంధనం, నేరాల నియంత్రణ, దౌత్యపరమైన శిక్షణ వంటి రంగాలలో రెండు దేశాల మధ్య కుదిరిన అవగాహన ఒప్పందాలు కుదిరాయి. రాబోయే ఐదేళ్లలో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేయడంతో పాటు, ఒక వ్యాపార వేదిక, పెట్టుబడుల వేదిక, కాన్సులర్ చర్చల యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడానికి ఇరు పక్షాలు అంగీకరించినట్లు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ సమావేశంలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, ప్రధాని ముఖ్య కార్యదర్శి పికె మిశ్రా, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి (పశ్చిమ) సిబి జార్జ్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంయుక్త మీడియా సమావేశంలో ప్రధాని మోడీ మాట్లాడుతూ, గత త్రైమాసికంలో భారత్ 7.8 శాతం వృద్ధి రేటును నమోదు చేసిందని తెలిపారు. ప్రస్తుత సవాళ్లతో కూడిన ప్రపంచంలో ఈ పురోగతి ప్రపంచ దేశాలకు ఎంతో ఆత్మవిశ్వాసాన్ని, నూతన అవకాశాలను సృష్టిస్తోందని మోడీ పేర్కొన్నారు. భారత్- బెల్జియం ద్వైపాక్షిక సహకారం సంప్రదాయ రంగాలకే పరిమితం కాకుండా రక్షణ వంటి కీలక రంగాలకూ విస్తరించిందని మోడీ అన్నారు. ఆధునిక రక్షణ పరికరాల తయారీలో ఇరు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని, జొరావర్ ట్యాంక్ వంటి వ్యవస్థల విషయంలోనూ సహకారం కొనసాగుతోందని తెలిపారు. ప్రపంచం ప్రస్తుతం తీవ్ర పరిణామాలు, అనిశ్చితితో కూడిన పరిస్థితులను ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో ఘర్షణలు కొనసాగుతున్నాయని, ఆహారం, ఇంధనం, సరఫరా వ్యవస్థల నుంచి దాదాపు ప్రతి రంగంపైనా అనిశ్చితి ప్రభావం చూపుతోందన్నారు. ఇలాంటి సవాళ్ల మధ్యనూ భారత ఆర్థిక వ్యవస్థ తన వేగాన్ని కొనసాగిస్తోందని చెప్పారు. భారత్, బెల్జియం దేశాలు సంభాషణ, దౌత్యంపై విశ్వాసం ఉంచుతున్నాయని ప్రధాని చెప్పారు. ఉక్రెయిన్ అయినా, పశ్చిమాసియా అయినా, అక్కడ



కొనసాగుతున్న ఘర్షణలకు వీలైనంత త్వరగా ముగింపు పలికేందుకు చేపట్టే అన్ని ప్రయత్నాలకు భారత్ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. స్వచ్ఛమైన ఇంధన భవిష్యత్తు, విశ్వసనీయమైన సరఫరా వ్యవస్థలు భారత్, బెల్జియం ఉమ్మడి ప్రాధాన్యతలుగా ఉన్నాయని తెలిపారు. సెమీకండక్టర్ రంగంలో బెల్జియంకు ఉన్న సాంకేతిక నైపుణ్యం, భారత్ వద్ద ఉన్న విస్తృత స్థాయి సామర్థ్యాలు పరస్పరపూరకంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ రంగంలో ఇరు దేశాల సహకారానికి మంచి అవకాశాలు ఉన్నాయని చెప్పారు.



# మెరుగైన టారిఫ్ రేటు ఇస్తేనే బిటిఎ

## వివరాలు వెల్లడిస్తాం: కేంద్రమంత్రి పీయూష్ గోయల్ వెల్లడి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 3:** అమెరికా పోటీ దేశాలకు అందిస్తున్న టారిఫ్ రేట్ల కంటే భారతీయ వస్తువులకు మెరుగైన సుంక రాయితీలు కల్పించిన తర్వాతే అమెరికాతో కుదుర్చుకోనున్న ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం వివరాలను వెల్లడిస్తామని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ గురువారం తెలిపారు. భారత్ ఇప్పటికే తొమ్మిది స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏలు) అమలు చేస్తోందని గోయల్ చెప్పారు. ఈ ఒప్పందాల పరిధిలో ఉన్న దేశాల సంయుక్త స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) సుమారు 60 ట్రిలియన్ డాలర్లుగా ఉందని తెలిపారు. వీటి ద్వారా ఇప్పటికే ప్రపంచ వాణిజ్యంలో దాదాపు మూడింట రెండొంతుల భాగానికి భారత్‌కు ప్రాధాన్య మార్కెట్ లభిస్తోందన్నారు. కెనడా, మెక్సికో, చిలీ, మెర్కోసూర్, ఎస్‌ఏసీయూ, జీసీసీ, ఇజ్రాయెల్ తదితర దేశాలు, వాణిజ్య కూటములతో భారత్ త్వరలో వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకునే ప్రయత్నాలు చేస్తోందని గోయల్ వెల్లడించారు. అలాగే ఆసియాన్, దక్షిణ కొరియా, జపాన్‌తో ఇప్పటికే ఉన్న వాణిజ్య ఒప్పందాలను సమీక్షించే ప్రక్రియ కూడా కొనసాగుతోందన్నారు. ఈ చర్యల ద్వారా భవిష్యత్తులో ప్రపంచ వాణిజ్యంలో సుమారు 75 శాతం భాగానికి పోటీ దేశాల కంటే తక్కువ టారిఫ్ రేట్లతో భారత్‌కు మార్కెట్ ప్రాప్యత లభించే అవకాశం ఉందని వివరించారు. ఇప్పటికే బ్రిటన్, మారిషస్, ఒమన్, యూఏఈ, ఆస్ట్రేలియాలతో భారత్ వాణిజ్య ఒప్పందాలను అమలు చేస్తోంది.

న్యూజిలాండ్‌తో కుదిరిన వాణిజ్య ఒప్పందం త్వరలో అమల్లోకి వస్తుంది. ఆ తర్వాత 27 దేశాల యూరోపియన్ యూనియన్‌తో కుదిరిన ఎఫ్‌టీఏ కూడా అమల్లోకి వస్తుంది. అమెరికా మన పోటీ దేశాలతో పోలిస్తే భారతీయ వస్తువులకు ప్రాధాన్య టారిఫ్ రేటును అందించగలిగిన వెంటనే బీటీఏను ఖరారు చేసి తుది వివరాలను ప్రకటిస్తాం" అని వాణిజ్య మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఎఫ్‌టీఏలపై వర్క్‌షాప్‌లో గోయల్ తెలిపారు. అమెరికా టారిఫ్‌లతో మళ్లీ చర్చలుభారత్, అమెరికా గత ఫిబ్రవరిలో వాణిజ్య ఒప్పందం తొలి దశకు సంబంధించిన చట్రాన్ని ఖరారు చేసినట్లు ప్రకటించాయి. అయితే అమెరికా టారిఫ్‌లలో మార్పులు రావడంతో ఇరు దేశాల మధ్య చర్చలు మళ్లీ కొనసాగుతున్నాయి. జూలై 24 నుంచి భారత్ సహా పలు దేశాలపై అమెరికా అదనంగా 10 శాతం టారిఫ్‌ను విధించింది.

దీంతో భారత్‌అమెరికా వాణిజ్య చర్చల్లో టారిఫ్ రేట్లు కీలక అంశంగా మారాయి. జీ20 వాణిజ్య మంత్రుల సమావేశం కోసం సెప్టెంబర్ చివర్లో గోయల్ అమెరికాలోని మిల్వాకీ నగరాన్ని సందర్శించే అవకాశం ఉంది. అక్కడ అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమీసన్ గ్రీర్‌తో ఆయన ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. ఈ సమావేశాల్లో భారత్‌అమెరికా వాణిజ్య చర్చలు ప్రధాన అంశాల్లో ఒకటిగా ఉండే అవకాశం ఉంది. రెండు రోజుల పాటు జరిగే జీ20 వాణిజ్య మంత్రుల సమావేశం సెప్టెంబర్ 30న ప్రారంభం కానుంది. 2026లో జీ20 అధ్యక్ష బాధ్యతలను అమెరికా నిర్వహిస్తోంది. పోటీ దేశాల కంటే టారిఫ్ ప్రయోజనం అవసరంఅమెరికా మార్కెట్‌లో భారత్ శ్రీలంక, బంగ్లాదేశ్, థాయ్‌లాండ్, కంబోడియా, వియత్నాం, ఇండోనేషియా, మలేషియా వంటి దేశాలతో పోటీపడుతోందని గోయల్ తెలిపారు. ఈ దేశాలతో పోలిస్తే భారతీయ వస్తువులకు టారిఫ్ ప్రయోజనం లభిస్తే అమెరికా మార్కెట్‌లో అవి మరింత పోటీ సామర్థ్యాన్ని సాధిస్తాయని చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో భారత్ అమెరికాకు సుమారు 87 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను ఎగుమతి చేసింది.

# డ్రైవింగ్ లైసెన్స్ జారీలో కొత్త మార్పులు!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 3:** డ్రైవింగ్ చేసే వారికి కేంద్రం కీలక మార్పులు తీసుకొచ్చేందుకు సిద్ధమవుతోంది. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారికి లైసెన్స్‌పై పాయింట్లు తగ్గించే విధానం తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోంది. నిబంధనలు పదేపదే ఉల్లంఘిస్తే లైసెన్స్ సస్పెండ్ లేదా రద్దు చేసే అవకాశం ఉంటుంది. అదే సమయంలో సురక్షితంగా వాహనం నడిపే వారికి గుడ్ పాయింట్లు ఇచ్చి ప్రోత్సాహకాలు అందించనున్నారు. కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గురువారం 66వ సియామ్ వార్షిక సమావేశంలో ఈ విషయాలు వెల్లడించారు. ప్రతిపాదిత విధానంలో ప్రతి ట్రాఫిక్ ఉల్లంఘనకు డ్రైవింగ్ లైసెన్స్‌పై పాయింట్లు తగ్గుతాయని చెప్పారు. నిర్ణయించిన పరిమితి దాటితే లైసెన్స్‌ను ముందుగా సస్పెండ్ చేసి, ఆ తర్వాత రద్దు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. మంచి పాయింట్లు సాధించే డ్రైవర్లకు బీమా సంస్థల నుంచి ప్రత్యేక ప్రయోజనాలు కల్పించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు గడ్కరీ చెప్పారు. వాహన రిజిస్ట్రేషన్‌కు కూడా ఇదే తరహా పాయింట్ల విధానాన్ని తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. దేశంలో రోడ్డు ప్రమాదాల పరిస్థితి చాలా తీవ్రంగా ఉందని గడ్కరీ ఆందోళన వ్యక్తం చేశారు. 2024లో బస్సు ప్రమాదాల్లో 3,855 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ద్విచక్ర వాహన ప్రమాదాల్లో 81,780 మంది మరణించారని చెప్పారు. సీటు బెల్ట్ పెట్టుకోకపోవడం వల్ల 14,466 మరణాలు నమోదయ్యాయని, హిట్ అండ్ రన్ ఘటనల్లో 34,030 మంది చనిపోయారని వివరించారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్, మద్యం తాగి వాహనం నడపడం, డ్రైవింగ్ సమయంలో ఫోన్ వాడటం ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా ఉన్నాయన్నారు.



# న్యాయవిద్యార్థులపై చర్యలు తీసుకునే అధికారం నల్సార్ వర్సిటీదే!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 3:** లా విద్యార్థులపై చర్యలు తీసుకునే చట్టబద్ధమైన అధికారం బీసీఐ (బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా)కు లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వారు విద్యార్థులు అని, వారంతా సంబంధిత యూనివర్సిటీలు, విద్యా సంస్థల పరిధిలోని వస్తారని వెల్లడించింది. ఇటీవల నల్సార్ లా యూనివర్సిటీ విద్యార్థుల అంశంలో చెలరేగిన వివాదంపై విచారణ సందర్భంగా కోర్టు తాజా సూచనలు చేసింది. హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీలో 2026 లా గ్రాడ్యుయేట్ విద్యార్థుల స్నాతకోత్సవం జరగాల్సి ఉంది. దీనికి సీజేఐ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించింది. అయితే, ఆయనను చీఫ్ గెస్టుగా రావడాన్ని విద్యార్థులు వ్యతిరేకించారు. దీంతో కార్యక్రమం రద్దైంది. ఆ తర్వాత బెంగళూరు లా విద్యార్థులు కూడా ఇలాగే చేశారు. అయితే, నల్సార్ విద్యార్థుల వైఖరిపై బీసీఐ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ విద్యార్థుల్ని ఎన్‌రోల్ చేయకూడదని లాయర్లకు ఆదేశాలు జారీ చేసింది. దీనిపై విద్యార్థులు, న్యాయ కోవిదుల నుంచి వ్యతిరేకత రావడంతో వెంటనే ఆ నిర్ణయాన్ని బీసీఐ వెనక్కు తీసుకుంది. అయితే, సీజేఐ రాకను అడ్డుకున్న లా విద్యార్థులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌పై తాజాగా విచారణ జరిగింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి మోహన ఆధ్వర్యంలోని బెంచ్ విచారణ జరిపింది. విద్యార్థులపై చర్యలు తీసుకునే చట్టబద్ధమైన హక్కు బీసీఐకి లేదా రాష్ట్ర బార్ కౌన్సిల్స్‌కు లేదని వివరించింది. వారు విద్యార్థులు అని, వారిపై చర్యలు తీసుకునే హక్కు సంబంధిత యూనివర్సిటీలకే ఉంటుందని పేర్కొంది. ఒకవేళ వారు అడ్వకేట్లుగా ఎన్‌రోల్ అయితే, అప్పుడు వారిపై చర్యలు తీసుకునేందుకు బీసీఐకి హక్కు ఉంటుందని వెల్లడించింది.

# కేజ్రీవాల్ బి టీమ్‌గా మారిన సిజెపి!

## కాక్రోచ్ జనతాపార్టీ డెమొక్రటిక్ కొత్త పార్టీ ఆవిర్భావం..




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 3:** నీట్ పేపర్ లీక్, విద్యార్థుల సమస్యలు కేంద్రంగా కాక్రోచ్ జనతా పార్టీ ఏర్పాటైంది. జంతర్ మంతర్ వద్ద ఉద్యమం చేసి ఏకంగా విద్యాశాఖ మంత్రిగా ఉన్న ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించేలా చేసిన కాక్రోచ్ పార్టీలో విభేదాలు వచ్చాయి. సీజేపీపై ఆరోపణలు చేస్తూ మనీష్ బ్రహ్మభట్ కాక్రోచ్ జనతా పార్టీడెమొక్రటిక్ పేరుతో కొత్త వర్గాన్ని ఏర్పాటు చేశారు. కొత్త జాతీయ టీమ్‌లో ప్రతీ రాష్ట్రం నుంచి ఐదుగురు చొప్పున వాలంటీర్లు, నిరసనకారుల్ని చేర్చాలని తాము సూచించామని, కానీ సీజేపీ ఏకపక్షంగా వ్యవహరించిందని చెప్పారు. సీజేపీడెమొక్రటిక్ పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజాస్వామ్య నిర్ణయ ప్రక్రియకు ప్రాధాన్యం ఇస్తుందని బ్రహ్మభట్ చెప్పారు. జంతర్ మంతర్ ఉద్యమం సక్సెస్ అయిన తర్వాత సీజేపీ అమ్ముడుపోయిందని, రాజకీయంగా మారిందని బ్రహ్మభట్ ఆరోపించారు. ప్రస్తుతం అది టీమ్ కేజ్రీవాల్‌గా మారిందని దుయ్యబట్టారు. సీజేపీడెమొక్రటిక్ ఏర్పాటుకు, ఇటీవల సీజేపీ ప్రకటించిన కొత్త టీమ్ ఎంపిక కారణమని ఆయన చెప్పారు. కొత్త కమిటీ ఏర్పాటు చేసే సమయంలో ఒక్క వాలంటీర్‌ను కూడా సంప్రదించలేదని ఆరోపించారు. సీజేపీ కొత్త టీమ్‌లో 12 మందిలో 8 మంది ఆమ్ ఆద్మీ పార్టీ తో సంబంధం ఉన్న వారిని చేర్చారని ఆరోపించారు.

సీజేపీ టీమ్ కేజ్రీవాల్‌గా మారిందని దుయ్యబట్టారు. 8 మందితో పాటు ఒక మహిళా స్నేహితురాలిని, కాలేజీ స్నేహితుడిని కూడా టీమ్‌లో చేర్చారని ఆరోపించారు. కేజ్రీవాల్ ఆదేశాల మేరకే సీజేపీ పనిచేస్తోందని సంచలన వ్యాఖ్యలు చేశారు. సీజేపీ టీమ్‌లో అధికార ప్రతినిధి తప్పా మరే మహిళ లేదని, ముస్లింలు, సిక్కుల్ని వాడుకుని అన్యాయం చేశారని, వారికి చోటు కల్పించలేదని అన్నారు. ఇది పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా జరిగిన విద్యార్థి ఉద్యమం అయినప్పటికీ, ఇందులో ఏ విద్యార్థినీ భాగస్వాములను చేయలేదని అన్నారు. సీజేపీనే పేపర్ లీక్ మాఫియాగా మారిపోయిందని ఆరోపించారు. ఉద్యమంలో శివసేన, ఆప్, సమాజ్‌వాదీ, ఆర్జేడీ, బీజేపీ, కాంగ్రెస్‌తో సహా దేశవ్యాప్తంగా ఉన్న వివిధ పార్టీలకు చెందిన వారు ఉద్యమంలో పాల్గొన్నారని అయినప్పటికీ ఒక్కరికీ సీజేపీలో చోటుకల్పించలేదని అన్నారు. సీజేపీ కేవలం ఒకే పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తోందని ఆరోపించారు.

# ఇరాన్‌కు ఏదేశం సహకరించినా తీవ్ర ఆంక్షలు ఎదుర్కోనాల్సిందే

## అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో

**వాషింగ్టన్, సెప్టెంబరు 3:** ఇరాన్‌తో భారత్ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోబోతోందన్న వార్తలను అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కొట్టిపారేశారు. అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి ఇరాన్‌కు ఏ దేశం సహకరించినా, ఆ దేశం కూడా తీవ్రమైన ఆంక్షలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన గట్టిగా హెచ్చరించారు. కిర్గిజ్‌స్థాన్‌లోని బిష్కెక్‌లో జరిగిన 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోడీ, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో భేటీ అయిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. భారత్, ఇరాన్ మధ్య వాణిజ్య ఒప్పందం ఉందని నేను అనుకోవడం లేదని రూబియో ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. అయితే, ప్రపంచంలోని చాలా దేశాలు తమ విదేశాంగ విధానాలను స్వతంత్రంగా రూపొందించుకుంటాయని, ఇరాన్‌తో సంప్రదింపులు జరుపుతాయని ఆయన అంగీకరించారు. అవసరమైనప్పుడు ఇరాన్ ప్రభుత్వ ప్రతినిధులతో తాము కూడా చర్చలు జరిపినట్లు ఆయన గుర్తుచేశారు. అదే సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలో చేసిన హెచ్చరికను రూబియో పునరుద్ఘాటించారు.

అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి ఇరాన్‌కు ఏ దేశం సాయం చేయకూడదు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడానికి, అణ్వాయుధాన్ని నిర్మించడానికి అవసరమైన ఆదాయాన్ని సమకూర్చుకునే మార్గాలను ఇరాన్‌కు కల్పించకూడదు. ఒకవేళ ఏవైనా దేశాలు అలా చేస్తే, వాటిపై కూడా మేము ఆంక్షలు విధించాల్సి వస్తుందని రూబియో హెచ్చరించారు. ట్రంప్ యంత్రాంగం ప్రధాన లక్ష్యం ఇరాన్‌ను అణ్వాయుధ శక్తిగా మారకుండా నిరోధించడమేనని రూబియో స్పష్టం చేశారు.

అధ్యక్షుడిగా ట్రంప్ ఉన్నంత కాలం ఇరాన్‌ను అణ్వస్త్ర దేశంగా మారేందుకు ఎప్పటికీ అనుమతించమని ఆయన అన్నారు. ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ప్రాథమికంగా ఆర్థిక ఆంక్షలను ఉపయోగిస్తామని, అయితే అవసరమైతే సైనిక చర్యకు కూడా వెనుకాడబోమని ఆయన తెలిపారు. ఇరాన్ తన ఆర్థిక వనరులను దేశ ప్రజల సంక్షేమానికి కాకుండా ఉగ్రవాదం, అణ్వాయుధాల కోసమే ఖర్చు చేస్తోందని రూబియో ఆరోపించారు.



# స్టాలిన్‌కు మద్రాస్ హైకోర్టు షాక్

## ఇవిఎంలపై పిటిషన్ కొట్టివేత

**చెన్నై, సెప్టెంబరు 3:** తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేతఎంకే స్టాలిన్‌కు మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. కొలత్తూరు అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎంలు, వీవీప్యాట్ ధ్రువీకరణలో అవకతవకలు జరిగాయంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు గురువారం కొట్టివేసింది. ఈ పిటిషన్ అసలు విచారణకే అర్హమైనది కాదని ఉన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో కొలత్తూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసిన స్టాలిన్‌ను తమిళగ వెట్రి కళగం (టీవీకే) అభ్యర్థి వీఎస్ బాబు ఓడించారు. బాబుకు 82,997 ఓట్లు రాగా స్టాలిన్‌కు 74,202 ఓట్లు వచ్చాయి. దాంతో బాబు 8,795 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. స్టాలిన్ రెండో స్థానంలో నిలిచారు. మే 4న ఫలితాలు వెలువడగా మే 7నే 14 ఈవీఎంల బర్న్ మెమొరీ, మైక్రో కంట్రోలర్‌ను పరిశీలించాలన్నారు.

# పూరీ జగన్నాథునికి రూ.1912కోట్ల డిపాజిట్లు - 60వేల 821 ఎకరాల భూములు

**భువనేశ్వర్, సెప్టెంబరు 3:** పూరీ జగన్నాథ ఆలయ యాజమాన్య సంస్థ ఆలయ బ్యాంకు బ్యాలెన్స్‌కు సంబంధించిన వివరాలను అధికారికంగా వెల్లడించింది. అయోధ్య రామ్ మందిర విరాళాల దుర్వినియోగంపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో పారదర్శకతను చాటుకునేందుకు జగన్నాథుని పేరిట బ్యాంకుల్లో రూ. 1,912 కోట్లకు పైగా డిపాజిట్లు ఉన్నట్లు ప్రకటించింది. ఆలయ నిధుల నిర్వహణ అత్యున్నత పారదర్శకతతో, క్రమబద్ధమైన ఆడిటింగ్, అకౌంటింగ్ పద్ధతుల ద్వారా జరుగుతోందని ఎస్‌జేటీఏ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ అరవింద కుమార్ పఢీ స్పష్టం చేశారు. భక్తుల నమ్మకాన్ని కాపాడేందుకు స్పష్టమైన జవాబుదారీతనం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయానికి వివిధ మార్గాల ద్వారా ఆదాయం సమకూరుతోంది. భక్తులు సమర్పించే కానుకలు, విరాళాలు, ఆలయానికి చెందిన గనులు, క్వారీల ద్వారా వచ్చే ఆదాయం, ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చే వడ్డీ, భూముల లావాదేవీల ద్వారా లభించే ఆదాయంతో పాటు ప్రభుత్వ గ్రాంట్లు ప్రధాన వనరులుగా ఉన్నాయి. ఈ ఆదాయంలో కొంత భాగాన్ని కార్పస్ ఫండ్, ఫౌండేషన్ ఫండ్, టెంపుల్ ఫండ్ అనే మూడు విభాగాలలో ఫిక్స్‌డ్ డిపాజిట్లుగా జమ చేస్తారు.

# సంక్షిప్త వార్తలు

## హర్ముజ్ దాటిన 40 వాణిజ్య నౌకలు

**వాషింగ్టన్, సెప్టెంబరు 3:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చిన వేళ కీలకమైన హర్ముజ్ జలసంధి మీదుగా 40 వాణిజ్య నౌకలకు అమెరికా సైన్యం రక్షణ కల్పించింది. ఈ ఆపరేషన్‌లో సుమారు 18 మిలియన్ బ్యారెళ్ల చమురును తరలిస్తున్న నౌకలు సురక్షితంగా జలసంధిని దాటినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. యుద్ధం వేళ ఒక రోజులో హర్ముజ్ మీదుగా ఇంత భారీ సంఖ్యలో నౌకలకు అమెరికా నౌకాదళం రక్షణ కల్పించడం ఇదే తొలిసారి.



## 86 టన్నుల బంగారాన్ని లండన్‌కు తరలించిన నెదర్లాండ్స్



**ఆమ్‌స్టర్‌డ్యామ్, సెప్టెంబరు 3:** నెదర్లాండ్స్ దేశం కొన్ని నెలలపాటు 86 టన్నుల బంగారాన్ని తరలించింది. బిలియన్ డాలర్ల విలువైన ఆ పసిడిని అమెరికా, కెనడ దేశాల నుంచి తీసుకొచ్చి లండన్‌లోని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌లో భద్రపరిచింది. ఈ విషయాన్ని డచ్ సెంట్రల్ బ్యాంక్ (డిఎన్‌బి) ధ్రువీకరించింది. అంతర్జాతీయంగా అస్థిర పరిస్థితుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. లండన్‌లో భద్రపరిస్తే.. సంక్షోభ సమయంలో దానిని సులభంగా ట్రేడ్ చేయడానికి వీలవుతుందని నెదర్లాండ్స్ కేంద్ర బ్యాంకు పేర్కొంది.

## సిఎం విజయ్‌ను కలిసిన టిఎంసి రెబల్‌ఎంపి సాయానిఘోష్



**చెన్నై, సెప్టెంబరు 3:** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ను బెంగాల్ నటి, తృణమూల్ కాంగ్రెస్ తిరుగుబాటు ఎంపీ సయానీ ఘోష్ కలిశారు. చెన్నై సచివాలయంలో విజయ్‌ను కలిసి రాష్ట్ర సుపరిపాలనను, దార్శనికతను ప్రశంసించారు. అనంతరం విజయ్‌తో సయానీ ముఖ్యమంత్రితో సమావేశమైన అనంతరం సయోని ఘోష్ మాట్లాడుతూ విజయ్ పశ్చిమ బెంగాల్ గురించి ఆప్యాయంగా మాట్లాడారని గొప్ప సంస్కృతి, సంప్రదాయాల పట్ల తన ప్రశంసలను వ్యక్తం చేశారని తెలిపారు.

## జల్‌బోర్డు కేసులో మాజీ మంత్రి సత్యేంద్ర జైన్‌కు ఊరట

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 3:** ఆప్ నేత, మాజీ మంత్రి సత్యేంద్ర జైన్‌కు భారీ ఊరట లభించింది. జల్ బోర్డు కేసులో అరెస్టైన ఆయనకు ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు గురువారం బెయిల్ మంజూరు చేసింది. రూ.2 లక్షల పూచీకత్తు, ఇద్దరు సంతకాల హామీతో సత్యేంద్ర జైన్‌కు బెయిల్ లభించింది. పీసీ యాక్ట్ కింద స్పెషల్ జడ్జి సత్యేంద్ర జైన్‌కు బెయిల్ ఇస్తున్నట్లు ప్రకటించారు. సత్యేంద్ర జైన్ గతంలో అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వంలో మంత్రిగా పని చేశారు.

## టిబెట్ నేపాల్ సరిహద్దుల్లో భూకంపం




**లాసా, సెప్టెంబరు 3:** టిబెట్‌లో గురువారం భూకంపం సంభవించింది. నేపాల్ సరిహద్దులో 5.0 తీవ్రతతో భూకంపం నమోదైంది. ఈ భూకంపం కారణంగా నేపాల్‌లోనే మరోసారి ప్రజల్లో ఆందోళన నెలకొంది. వరదలతో అతలాకుతలం అయిన నేపాల్ సరిహద్దులో మరోసారి అదే నేపాల్ సరిహద్దు ప్రాంతంలో.. టిబెట్ దేశంలో భూకంపం నమోదు కావడం ఆందోళనకు గురిచేసింది. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 1.46 గంటల సమయంలో, భూమికంపించి 14 కిలో మీటర్ల లోతున ఈ భూకంపం నమోదైనట్లు ఇండియాకు చెందిన నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ వెల్లడించింది.

## గుంటూరు పట్టాభిపురం పోలీసులపై హైకోర్టు అసహనం

**విజయవాడ, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** గుంటూరు పట్టాభిపురం పోలీసులపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. షేక్ జాన్ సైదా (రబ్బానీ) అనే వ్యక్తి 10వ తరగతి చదువుతున్న 15ఏళ్ల బాలికను తీసుకెళ్లి మూడు నెలలు గడిచినా, గుంటూరు పట్టాభిపురం పోలీసులు ఆమె ఆచూకీని కనుగొనడంలో విఫలం కావడంపై హైకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఇది నిస్సందేహంగా పోలీసుల వైఫల్యమేనని స్పష్టం చేసిన కోర్టు, అటువంటి పోలీసు సిబ్బంది ఉండటం ప్రభుత్వానికి సిగ్గుచేటని ఘాటుగా వ్యాఖ్యానించింది. గుంటూరులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న తన కుమార్తె ట్యూషన్‌కు వెళ్లి తిరిగి రాలేదని, ఆమెను కోర్టు ముందు హాజరుపరిచేలా పోలీసులను ఆదేశించాలంటూ తండ్రి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేశారు. షేక్ జాన్ సైదా ఇన్‌స్టా ద్వారా పరిచయమై ట్రాప్ చేసి తన కుమార్తెను తీసుకెళ్లాడని దీనిపై పట్టాభిపురం పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి మూడు నెలలవుతున్నా తన కుమార్తె ఆచూకీ కనిపెట్టలేదని పేర్కొన్నారు. పిటిషనర్ తరపున న్యాయవాది డివి శశిధర్ వాదనలు వినిపిస్తూ బాలికను సైదా ఎక్కడికి తీసుకెళ్లాడో పోలీసులకు తెలిసినా తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టడం లేదన్నారు. పోలీసులు బాలిక కోసం మూడు రాష్ట్రాల్లో గాలించారన్న ప్రభుత్వ సహాయ న్యాయవాది (ఏజిపి) కృష్ణ ప్రణీత్ వాదనల్ని ధర్మాసనం తోసిపుచ్చింది. బాలికను కోర్టు ముందు హాజరుపరచాలని డిజిపిని ఆదేశించింది. అయితే డిజిపికి కాకుండా జిల్లా ఎస్పీకి ఆదేశాలు జారీచేయాలని ఏజిపి కోరగా ఎస్పీ, ఎస్‌హెచ్ఓలపై కోర్టుకు నమ్మకం లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

### సాదిక్ ఖాన్ కస్టడీ పిటిషన్ విచారణ 7కు వాయిదా

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** కాకినాడ జిల్లా పిఠాపురం పంచాయతీరాజ్ శాఖ అధికారి టీ నూకరాజు కుటుంబం ఆత్మహత్యల కేసులో నిందితుడిగా ఉన్న సాదిక్ ఖాన్‌పై కస్టడీ పిటిషన్ ఈనెల 7వ తేదీన విచారణ వాయిదా వేసినట్లు న్యాయవాది జవహర్ అలీ తెలిపారు. సర్పవరం పోలీసులు ముందుగా కాకినాడ సబ్ జైలుకు తరలించగా భద్రతకు సంబంధించి సమస్యలు తలెత్తే పరిస్థితి ఉండడం వలన రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించిన విషయం తెలిసిందే. అయితే నూకరాజు కుటుంబం ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులతో పాటు సౌజన్య భర్త జగదీశ్వర్ రెడ్డి మరణానికి సంబంధించిన అంశాలను, ఈ సంఘటనలో వెనుక మరిన్ని విషయాలపై వస్తున్న ఆరోపణ నేపథ్యంలో సాధిక్ ఖాన్ కస్టడీలో మరింత లోతుగా విచారిస్తే వాస్తవాలు మరెన్నో బయటకు వస్తాయని భావిస్తున్నారు. అలాగే జగదీశ్వర్ రెడ్డికి ఇచ్చినట్టుగా చెబుతున్నా విష పదార్థాన్ని కేరళ నుంచి సరఫరా చేస్తున్నట్టుగా భావిస్తూ ఇరువురుని ఇప్పటికే పోలీసులు గుర్తించినట్లు సమాచారం. అలాగే సాధిక్ ఖాన్‌ను విచారణకు సంబంధించి తమ కస్టడీలో విచారించాల్సిన విషయాలపై ప్రణాళికలను పోలీసు అధికారులు రూపొందించినట్లు సమాచారం.

### 14వ అంతస్తు నుంచి దూకి నేవీ ఉద్యోగి భార్య ఆత్మహత్య

**గాజువాక,సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:** విశాఖపట్నం నావికాదళ గృహసముదాయమైన నౌసనాబాగ్‌లో గురువారం ఉదయం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఒక వివాహిత ఎత్తయిన భవనం పైనుంచి దూకి బలవన్మరణానికి పాల్పడింది.!! మల్కాపురం పోలీసుల సమాచారం ప్రకారం... మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రియాంక వర్మ (22)కు ఐదేళ్ల క్రితం దీపక్ వర్మతో వివాహమైంది. ఆయన విశాఖపట్నంలోని భారత నౌకాదళంలో ఉద్యోగం చేస్తున్నారు. వీరికి ఒక బాబు, పాప ఉన్నారు. ప్రస్తుతం వీరు మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని నౌసనాబాగ్‌లో ఉన్న గోమతి అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్నారు.!! గురువారం ఉదయం సుమారు 8:00 గంటల సమయంలో ప్రియాంక వర్మ తాను ఉంటున్న గోమతి అపార్ట్‌మెంట్ 14వ అంతస్తు నుంచి ఒక్కసారిగా కిందకు దూకేశారు. తీవ్ర గాయాలపాలైన ఆమె అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. సమాచారం అందుకున్న నేవీ పోలీసులు వెంటనే మల్కాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విశాఖకు చేరుకున్న తర్వాత ఇచ్చే ఫిర్యాదు ఆధారంగా పూర్తిస్థాయి ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని మల్కాపురం సి.ఐ. ఇ.నరసింహారావు తెలిపారు. ఆత్మహత్యకు గల ఖచ్చితమైన కారణాలపై అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన వెల్లడించారు.

## తిరుమల సమాచారం

### మహాపూర్ణాహుతితో శాస్త్రోక్తంగా ముగిసిన కారీరిష్టి యాగం



**తిరుమల, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచ మానవాళి సంక్షేమం కోసం తిరుమల ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలోఐదు రోజుల పాటు టిటిడి నిర్వహించిన కారీరిష్టి, వరుణ జపం, పర్జన్యశాంతి హోమాలు గురువారం మహాపూర్ణాహుతితో శాస్త్రోక్తంగా ముగిశాయి. వేంకటేశ్వర వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపల్ కుప్పా శివ సుబ్రహ్మణ్య అవధాని కారీరిష్టి, వరుణ జపం, పర్జన్యశాంతి మంత్రాలను పఠించి అందరితో పలికించారు. శ్రీవారి దివ్య అనుగ్రహంతో భారతదేశవ్యాప్తంగా సకాలంలో సస్యానుకూలమైన వర్షాలు కురిసి, అతివృష్టి, అనావృష్టి బాధలు లేకుండా ప్రజలందరూ మంచి పాడిపంటలతో సుభిక్షంగా వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ అనేక దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయాన్ని అనుసరించి ఈ యాగాలను నిర్వహించినట్లు తెలిపారు. గత ఐదు రోజులుగా 32 మంది ఋత్వికులతో కారీరిష్టి సహిత వరుణ జపం, పర్జన్యశాంతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించి, మహాపూర్ణాహుతితో సంపూర్ణం చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర,అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యులు భానుప్రకాష్ రెడ్డి, పనబాక లక్ష్మి, శాంతా రామ్, ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### బ్రహ్మోత్సవాల్లో వసతికి ఇబ్బంది రాకూడదు
#### వసతి కల్పన విభాగంపై అదనపు ఇఒ సమీక్ష



**తిరుమల, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** మరో పదిరోజుల్లో తిరుమలలో ప్రారంభం కానున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో అటు భక్తులకు ఇటు సిబ్బందికి వసతికి ఇబ్బంది లేకుండా చూడాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అధికారులను ఆదేశించారు. ఈనెల 15 నుండి 23 వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వసతి గదుల కేటాయింపునకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం తిరుమలలో సుధర్మ సమావేశ మందిరంలో వసతి కల్పన విభాగంపై అదనపు ఇఒ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గదులకు మరమ్మతులు ఏవైనా ఉంటే త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. బ్రహ్మోత్సవ విధులకు డిప్యూటేషన్ పై వచ్చే సిబ్బందికి వసతి కేటాయించేందుకు వీలుగా తిరుమలలోని మఠాలు, కర్ణాటక సత్రాల్లోని 60 శాతం గదులను బ్రహ్మోత్సవ రోజుల్లో టిటిడి రిసెప్షన్ విభాగం నియంత్రణలోకి తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తిరుమల ఎస్టేట్ అధికారి వేంకటేశ్వర్లు, ఇన్ ఛార్జ్ ఐటీ జిఎంవేంకటేశ్వర్లు నాయుడు, రిసెప్షన్ ఒఎస్‌డి సత్రే నాయక్, ఎఇఒ అశోక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఎ.కొండూరుకు జెజెఎం-అమరజీవి జలధారలు

- కొండూరు కిడ్నీ బాధితుల జీవితాల్లో కొత్త ఆశలు నింపిన డి.సిఎం పవన్ కల్యాణ్
- ఉద్దానం తరహా మూత్రపిండాల సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు
- 26 నెలల కాలంలో రూ. 49.94 కోట్ల పనులు పూర్తి
- 38 ఆవాసాల పరిధిలో 130 కిలోమీటర్ల పైప్‌లైన్
- ఇంటింటికీ కుళాయిలతో దాదాపు 75,000 మందికి స్వచ్ఛమైన మంచినీరు





ఎ.కొండూరులో పవన్ కల్యాణ్ వాగ్దానం మేరకు నిర్మించిన రక్షిత మంచినీటి పథకం జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధార పథక పరిధిలో ఏర్పాటు చేసిన కుళాయి నీటిని పట్టుకుంటున్న ఎ.కొండూరు గ్రామ మహిళ

**విజయవాడ, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** మూత్రపిండాల వ్యాధి (క్రానిక్ కిడ్నీ డిసీజ్) బారినపడిన ప్రజలతో మరో ఉద్దానాన్ని తలపించే ఎన్టీఆర్ జిల్లా, ఎ.కొండూరు మండల ప్రాంతం. ఈ మండల పరిధిలో మొత్తం 21 గ్రామ పంచాయతీలు, 38 ఆవాసాలు ఉండగా, దాదాపు అన్ని గ్రామాలు దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధి ప్రభావిత ప్రాంతాలుగా ఉన్నాయి. అందులో గిరిజనులు మాత్రమే నివసించే 15 తండాలున్నాయి. తాగేందుకు గుక్కెడు నీరు దొరక్క, ప్రమాదమని తెలిసినా కలుషిత జలాలతో గొంతు తడుపుకునే పరిస్థితి నెలకొంది. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఈ సమస్య పవన్ కల్యాణ్ దృష్టికి వచ్చింది. ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఎ.కొండూరుకు రక్షిత మంచినీటి సౌకర్యం కల్పించడం ద్వారా ఆ ప్రాంత ప్రజలను కిడ్నీ వ్యాధి బారి నుంచి కాపాడాలని సంకల్పించారు. అధికారం చేపట్టిన 26 నెలల్లోనే తన పరిధిలోని గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ ద్వారా జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధారల నిధులతో ఎ.కొండూరు తాగునీటి ప్రాజెక్టును పూర్తి చేశారు. రూ.49.94 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు 100 శాతం పనులు పూర్తి చేసుకుని ఆ ప్రాంత ప్రజల నీటి కష్టాలను తీర్చింది. గత ప్రభుత్వం టెండర్ల ప్రక్రియ కూడా మొదలుపెట్టలేదు ఎ.కొండూరు తాగునీటి ప్రాజెక్టును కూడా గత ప్రభుత్వం ఆర్భాటం చేసి, కనీసం టెండర్ ప్రక్రియను కూడా మొదలుపెట్టలేదు. ఒక్క పనీ ప్రారంభించలేదు. జల్ జీవన్ మిషన్ కింద చేపట్టిన ప్రాజెక్టు కావడం, గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో 2024 మార్చి నాటికి గడువు కూడా ముగియడంతో ఈ ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకున్నాయి. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ పనులను ముందుకు తీసుకెళ్లారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్‌ను మరో నాలుగేళ్లు పొడిగించగా, రాష్ట్ర ప్రభుత్వం వాటా కూడా తక్షణమే విడుదల చేసి, పనులను యుద్ధప్రాతిపదికన ముందుకు తీసుకువెళ్లింది. కిడ్నీ వ్యాధితో ప్రజలు పడుతున్న అవస్థలను చూసి చలించిన ఉప ముఖ్యమంత్రి, నిర్దేశిత గడువులోపు పనులు పూర్తి చేయించారు. ఇబ్రహీంపట్నం ఎన్‌టిపిసి కాలువ నుంచి కృష్ణా జలాలను స్వీకరించి, అక్కడే శుద్ధి చేసి, 130 కిలోమీటర్ల పైప్‌లైన్, 12 ఓవర్‌హెడ్ ట్యాంకుల సహకారంతో దాదాపు 75వేల మందికి ఒక్కొక్కరికి రోజుకు 55 లీటర్ల చొప్పున స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నారు. ఎ.కొండూరు తాగునీటి ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన పవన్ కల్యాణ్, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, రెవెన్యూ, అటవీ, పర్యావరణ, రైల్వే శాఖలతో పాటు నేషనల్ హైవేస్ అథారిటీ అధికారులతో సమన్వయం చేసుకుంటూ, పైప్‌లైన్ నిర్మాణానికి అత్యంత త్వరితగతిన అనుమతులు లభించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లారు. గతంలో ఎ.కొండూరు మండల పరిధిలోని ప్రజలకు ట్యాంకర్ల సాయంతో తాగునీరు అందించేందుకు ప్రభుత్వం ఏటా రూ. 2.5 కోట్లు ఖర్చు చేయాల్సి వచ్చేది. పవన్ కల్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధారల రూపంలో తాగునీటి సమస్యకు, తద్వారా కిడ్నీ సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గం లభించినట్టయింది. త్వరలో ఎ.కొండూరు ప్రాంతంలో పర్యటించి మంచినీటి పథకం పనుల నాణ్యతను ఉప ముఖ్యమంత్రి పరిశీలించనున్నారు. అందుకు సంబంధించి షెడ్యూల్ సిద్ధం చేయాలని ఇప్పటికే కార్యాలయ అధికారులకు నిర్దేశం చేశారు.

## విశాఖ వేదికగా 10నుంచి 12వరకు 41వ ఐఎటిఒ జాతీయ వార్షిక సదస్సు

### పర్యాటక మంత్రి కందుల దుర్గేష్

**సచివాలయం, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు స్థానిక పర్యాటక భాగస్వాములకు జాతీయ స్థాయిలో విస్తృత అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మక నిర్ణయాలు తీసుకుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. వెలగపూడి సచివాలయంలో ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలో ఈనెల 10నుంచి 12వరకు జరగనున్న 41వ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్(ఐఎటిఒ) వార్షిక సదస్సు విశేషాలను వివరించారు. దేశవ్యాప్తంగా ప్రముఖ పర్యాటక ప్రతినిధులు,టూర్ ఆపరేటర్లు,హోటల్ నిర్వాహకులు, విధాన నిర్ణేతులను ఒకే వేదికపైకి తీసుకొచ్చే ఈ ప్రతిష్టాత్మక సదస్సుకు విశాఖపట్నం ఆతిథ్యం ఇవ్వడం రాష్ట్ర పర్యాటక రంగానికి దక్కిన గొప్ప అవకాశమని మంత్రి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 2,068కి పైగా సభ్యులతో ఇన్-బౌండ్ టూరిజంలో అగ్రగామిగా ఉన్న ఐఎటిఒ, ఎపి పర్యాటక భాగస్వాముల భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి ప్రత్యేక డ్రైవ్‌ను ప్రారంభించిందని తెలిపారు. రాష్ట్రానికి చెందిన టూర్ ఆపరేటర్లు, హోటళ్ళు, పర్యాటక భాగస్వాములు ఐఎటిఒ సభ్యత్వం పొందేందుకు చెల్లించాల్సిన రూ.10,000 (+జిఎస్టీ) వన్‌టైమ్ అడ్మిషన్ ఫీజును పూర్తిగా రద్దుచేయడం జరిగిందన్నారు. ఈ రాయితీ 2026 డిసెంబర్ 31వరకు అందజేసే దరఖాస్తులకు వర్తిస్తుందని వివరించారు. సాధారణంగా ఐఎటిఒ సభ్యులకు రూ.6,000, సభ్యులు కాని వారికి రూ.8,500 ఉండే సందస్సు రిజిస్ట్రేషన్ ఫీజును ఎపి ప్రతినిధులకు కేవలం రూ.3,000కే నిర్ణయించామన్నారు. అర్హులైన స్థానిక పర్యాటక ప్రతినిధులు ఎటువంటి ప్రాథమిక ప్రవేశ రుసుము చెల్లించకుండా ఐఎటిఒ అధికారిక పోర్టల్ ఐఎటిఒ.ఇన్/రిజిస్టర్/ఫోరమ్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ సదస్సుకు దేశ నలుమూలల నుండి 1,000మందికి పైగా ప్రముఖ ఇన్-బౌండ్ టూర్ ఆపరేటర్లు, డొమెస్టిక్ ట్రావెల్ కంపెనీలు, డెస్టినేషన్ మేనేజ్‌మెంట్ కంపెనీలు, హోటల్ రంగ ప్రతినిధులు, విమానయాన సంస్థల ప్రతినిధులు హాజరు కానున్నారని తెలిపారు. దీనివల్ల ఎపిలోని హోటళ్ళు, రిసార్టులు, పర్యాటక ప్రాంతాలను జాతీయ స్థాయిలో ఉచితంగా ప్రచారం చేసుకోవడంతో పాటు దేశంలోని అగ్రగామి టూర్ ఆపరేటర్లతో నేరుగా వ్యాపార సంబంధాలు నెలకొల్పుకునే అవకాశం లభిస్తుందని మంత్ర దుర్గేష్ అన్నారు. రాష్ట్రంలోని హోటళ్ళు, రిసార్టుల యాజమాన్యలు, టూర్ ఆపరేటర్లు, ట్రావెల్ ఏజెన్సీలు, హోమ్‌స్టే నిర్వాహకులు, ట్రాన్స్‌పోర్టు ఆపరేటర్లు, టూరిస్ట్ గైడ్లు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలందరూ ఈ అపూర్వ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఐఎటిఒ సభ్యత్వం పొందడంతో పాటు సదస్సులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర సహకారంతో ఎపిని దేశంలోని అగ్రగామి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కందుల దుర్గేష్ పునరుద్ఘాటించారు.

## బ్రహ్మోత్సవాల్లో మాడ వీధుల్లో భక్తులకు సమన్వయంతో సేవలు

- వైద్య సేవల ఏర్పాట్లపై అదనపు ఇఒ చౌదరి సమీక్ష



**తిరుమల, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో ఈనెల 15 నుండి 23వ తేది వరకు జరగనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలలో భక్తులకు సమన్వయంతో సేవలందించాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆదేశించారు.బ్రహ్మోత్సవాలు జరిగే సమయంలో మాఢవీధుల్లో అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు భక్తులకు ఇబ్బంది కలగకుండా త్వరితగతిన వైద్య సేవలు అందించాలని సూచించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా మందులను అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. మాడ వీధుల్లో భక్తులకు సమస్యలు తలెత్తితే పోలీసుల సమన్వయంతో సురక్షి తంగా త్వరితగతిన ఆసుపత్రికి తరలించాలని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో మాడ వీధుల్లో అంబులెన్సు లకు క్లియరెన్స్ ఇచ్చేలా చర్యలు చేపట్టాలని తిరుమల డిఎస్పీ కె. విజయశేఖర్‌ను కోరారు. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో వైద్య సేవలు, రవాణా విభాగాలు, పోలీసుల భద్రతపై టిటిడి అదనపు ఇఒ వెంకయ్య చౌదరి తన క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిటిడి చీఫ్‌వైద్యాధికారిణి డాక్టర్ కుసుమ కుమారి భక్తులకు అందుబాటులో ఉంచనున్న వైద్య సదుపాయాలను అదనపు ఇఒకు వివరించారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులకు వైద్య సేవలు అందించేందుకు తిరుమలలో అశ్వినీ ఆసుపత్రి, అపోలో కార్డియాక్ సెంటర్లు 24 గంటలు నిరంతరాయంగా పని చేస్తాయని తెలిపారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ 1, 2, గాలి గోపురం, ఎటిసి.కల్యాణకట, పిఎసి 5 ప్రాంతాల్లో 6 డిస్పెన్సరీలు, పీఏసీ2, భాష్యకార్ల సన్నిధి, అలిపిరి రాజగోపురం, 1500 మెట్టు, ఏడో మైలు, శ్రీవారి మెట్టు 1200 మెట్టు, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రం, శ్రీవారి ఆలయం, నారాయణగిరి షెడ్లు, దర్శన క్యూలైన్లలో ఒక మొబైల్ క్లీనిక్ (కృష్ణతేజ సర్కిల్ నుండి గోగర్భం సర్కిల్ వరకు) 10 ప్రథమ చికిత్సా కేంద్రాలతో పాటు రామ్ భగీచా, శిలాతోరణం, పాపవినాశనం, శ్రీవారి సేవా సదన్, శ్రీవారి మెట్టు, అలిపిరి పాదాల మండపం వద్ద నూతనంగా 6 వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రస్తుతం అందుబాటులో ఉన్న 11 మంది డాక్టర్లు, 139 మంది పారా మెడికల్ సిబ్బందికి అదనంగా 75 మంది డాక్టర్లు, 60 మంది పారా మెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. అత్యవసర వైద్య సేవల కోసం తిరుమలలో మొత్తం 16 అంబులెన్సులు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో విఎస్ఒ సురేంద్ర, అశ్వినీ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాలకు అదనపు ప్రత్యేక బస్సు సర్వీసులు




**తిరుమల, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు సెప్టెంబరు, అక్టోబరు నెలలో రెండు పర్యాయాలు జరగనున్న నేపథ్యంలో తిరుమలకు వచ్చే భక్తుల రద్దీ గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. పెరుగుతున్న రద్దీ దృష్ట్యా అనుగుణంగా భక్తులకు తగినన్ని బస్సు ట్రిప్పులు అందించేందుకు అదనపు ప్రత్యేక సర్వీసులను నిర్వహించడానికి ఎపిఎస్ఆర్టీసీ విస్తృత ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా, తిరుపతి తిరుమలతో బాటు తిరుమలలోని వివిధ ముఖ్య ప్రాంతాల నుండి తిరుపతికి అదనపు ప్రత్యేక అంతర్రాష్ట్ర బస్సు సర్వీసులను నిర్వహించేందుకు తిరుమల సిటీ ట్రాన్స్‌పోర్ట్ అండర్‌టేకింగ్‌తో ఆర్టీసీ పర్యవేక్షణ బృందం ఏర్పాటు చేయబడుతుంది. తిరుపతి జిల్లా ప్రజారవాణా అధికారిక కార్యాలయంలో జిల్లా ప్రజారవాణా అధికారి కె. శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో తిరుమల సిటీ ట్రాన్స్‌పోర్ట్ అండర్‌టేకింగ్‌కు చెందిన మేనేజింగ్ డైరెక్టర్ కె. గుణశేఖర్, పి. కృష్ణమూర్తితో బాటు వివిధ ఎస్టీఏల జనరల్ మేనేజర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తిరుమల నుండి తిరుపతికి 150 అదనపు ప్రత్యేక బస్సులు, తిరుపతి నుండి తిరుమలలోని వివిధ ముఖ్య ప్రాంతాలకు 150 అదనపు ప్రత్యేక బస్సులు వివిధ మార్గాల్లో నడపేందుకు అంగీకారం కుదిరింది. బ్రహ్మోత్సవాల సందర్భంగా పెరగనున్న భక్తుల రద్దీ, రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని, డిమాండ్‌కు అనుగుణంగా అదనపు ట్రిప్పులు నిర్వహించి, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఈ ఏర్పాట్లు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ పి. విశ్వనాథ్, డిప్యూటీ డిఎం మెకానికల్ ఇంజనీర్, తిరుమల పి. బాలాజీ ఆర్టీసి, తిరుమల సిటీ ట్రాన్స్‌పోర్ట్ అండర్ టేకింగ్‌కు చెందిన ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జిమ్ ట్రైనర్ సతీష్ రెడ్డి హత్య కేసులో నలుగురు నిందితుల అరెస్టు
### ప్రాణభయంతోనే వురిగొల్పిన హత్య



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** కాకినాడ భానుగుడి సెంటర్‌లో జరిగిన జిమ్ ట్రైనర్ కొడమాటి సతీష్ రెడ్డి సంచలన హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ తెలిపారు. టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ హత్యపై ఎస్పీ ఆదేశాల మేరకు కాకినాడ అడిషనల్ ఎస్పీ, ఇన్‌చార్జి సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ డాక్టర్ మహంతి కిషోర్ కుమార్ పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందాలు ఏర్పాటు చేసి సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించారు. ఈవివరాలను విలేకరుల సమావేశంలో వివరించారు. కేసు వివరాల్లోకి వెళితే రామకృష్ణారావుపేటకు చెందిన జిమ్ ట్రైనర్ కొడమాటి సతీష్ రెడ్డి ఆగస్టు 26వ తేదీ తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో కాకినాడ భానుగుడి సెంటర్‌లోని చార్మినార్ టీ సెంటర్ వద్ద హత్యకు గురయ్యాడు. మృతుడి స్నేహితుడైన బొందల సాయికిరణ్‌తో పాటు అతని స్నేహితులు ఇంటి సత్యనారాయణ, ప్రయాగ దుర్గాప్రసాద్, ఇంటి ఆదికృష్ణ కలిసి సతీష్ రెడ్డిపై దాడి చేశారు. అనంతరం ఆయనను ఫుట్‌పాత్ ర్యాంప్‌పై పడేసి కాళ్లతో తన్నడంతో పాటు, ముందుగా సిగ్నల్ లైట్ల వద్ద దాచిపెట్టిన చెక్కబద్దతో దాడి చేశారు. దాడి సమయంలో చెక్కబద్ద విరిగిపోవడంతో, దాని పదునైన ముక్కతో సాయికిరణ్ సతీష్ రెడ్డి గొంతులో పలుమార్లు పొడవడంతో ఆయన మృతి చెందినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. దీంతో తీవ్ర గాయాలతో సతీష్ రెడ్డి మృతి చెందినట్లు వెల్లడించారు. మృతుడి అన్న కొడమాటి యర్రయ్యరెడ్డి ఫిర్యాదు మేరకు కాకినాడ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నేరం అనంతరం నలుగురు నిందితులు పరారయ్యారు. దుర్గాప్రసాద్ తన బుల్లెట్ మోటార్‌సైకిల్‌ను కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ పార్కింగ్‌లో ఉంచి అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు గుర్తించారు. బొందల సాయికిరణ్(సాయి), ఇంటి సత్యనారాయణ, ప్రయాగ దుర్గాప్రసాద్, ఇంటి ఆదికృష్ణ అరెస్టయిన నిందితులని తెలిపారు. కాకినాడ టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ మజ్జి అప్పలనాయుడు, ఎస్ఐలు సువర్ణ కుమారి, ఎల్ భీష్మ కుమార్, పి. సత్తిబాబు, వారి స్టేషన్ సిబ్బంది, క్రైమ్ సిబ్బంది సహాయంతో దర్యాప్తు బృందాలు ఏర్పాటు చేసి, సాంకేతిక, ఇతర దర్యాప్తు పద్ధతుల ద్వారా నిందితుల కోసం గాలింపు చేపట్టారు. కాగా దర్యాప్తులో వెల్లడైన అంశాలను వివరిస్తూ ప్రధాన నిందితుడు బొందల సాయికిరణ్ ప్రేమ వ్యవహారానికి సంబంధించి సతీష్ రెడ్డితో విభేదాలు ఏర్పడినట్లు వెల్లడైంది. సాయికిరణ్ వేరే యువతితో ఉన్నట్లు ఫొటోలను మార్ఫింగ్ చేసి అతని ప్రియురాలికి సతీష్ రెడ్డి పంపడంతో వారి మధ్య విభేదాలు తలెత్తినట్లు విచారణలో తెలిసింది. అలాగే, సాయికిరణ్‌ను చంపేస్తానని సతీష్ రెడ్డి బెదిరించిన నేపథ్యంలో, అతను జీవించి ఉంటే తనకు ప్రాణహాని కలుగుతుందనే ఉద్దేశంతో సతీష్ రెడ్డిని హత్య చేసినట్లు ప్రధాన నిందితుడు విచారణలో తెలిపినట్లు పోలీసులు వెల్లడించారు. అరెస్టు చేసిన నలుగురు నిందితులను విచారణ అనంతరం న్యాయస్థానం ముందు హాజరుపరచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించనున్నట్లు పోలీసులు తెలిపారు. కాకినాడ టూ టౌన్ సీఐ అప్పలనాయుడుకి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు, రైల్వే స్టేషన్ పార్కింగ్ వద్ద పోలీసులు మాటువేసి ఉండగా, అక్కడ పార్కింగ్ చేసిన బుల్లెట్ మోటార్ సైకిల్‌ను తీసుకుని పరారయ్యేందుకు వచ్చిన నలుగురును అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి నాలుగు సెల్‌ఫోన్లు, బుల్లెట్ మోటార్ సైకిల్‌తో పాటు నేరం జరిగిన సమయంలో వారు ధరించిన దుస్తులను మధ్యవర్తుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు.

### బ్రహ్మోత్సవాలకు తిరుపతి నగరంలో ఆధ్యాత్మిక వైభవం ఉట్టిపడాలి

**తిరుమల, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుపతి నగరం భక్తి, ఆధ్యాత్మికత, వైభవంతో వెలుగొందేలా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని టిటిడి జెఇఒ డాక్టర్ ఎ. శరత్ అధికారులను ఆదేశించారు. టిటిడి అధికారులతో కలిసి గురువారం రేణిగుంట విమానాశ్రయం నుండి అలిపిరి గరుడ సర్కిల్ వరకు ఆయన పర్యటించి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జెఇఒ మాట్లాడుతూ ఈ నెల 15 నుండి 23వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరగనున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు దేశం నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తిరుపతికి తరలిరానున్న నేపథ్యంలో, తిరుపతి నగరానికి అడుగుపెట్టిన ప్రతి భక్తుడికి శ్రీవారి బ్రహ్మోత్సవాల దివ్య వైభవం ప్రస్ఫుటంగా కనిపించేలా నగర పరిసరాలను తీర్చిదిద్దాలని ఆయన సూచించారు. రేణిగుంట విమానాశ్రయం నుంచి తిరుపతి నగరానికి చేరుకునే మార్గంతో పాటు, నగరాన్ని నాలుగు వైపుల నుంచి కలిపే ప్రధాన కూడళ్లన్నీ శ్రీవారి భక్తి పరిమళాలు వెదజల్లేలా, ఆధ్యాత్మిక శోభతో అలరారేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఇ మనోహరం, ఎస్ఇ వేంకటేశ్వర్లు, అదనపు ఆరోగ్యఅధికారి డాక్టర్ సునీల్, విఎస్ఒ గిరిధర, ఇఇలు రవిశంకర్ రెడ్డి, సరస్వతి తదితర అధికారులు పాల్గొన్నారు.

### డిప్యూటీ ఇఒ లోకనాథంపై రెడ్ బుక్ పంజా
#### వైసిపి నేత భూమన ఘాటు వ్యాఖ్యలు

**తిరుపతి, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవారి ఆలయ డిప్యూటీ ఇఒ ఎం. లోకనాథం యాదవ్‌పై జరిగిన ఎసిబి దాడులు, అరెస్టు వెనుక కుట్ర, కుతంత్రం దాగి ఉన్నాయని టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. సిబిఐ సిట్ వందల మందిని విచారణచేసి ఛార్జ్‌షీట్ దాఖలు చేసినా అందులో లోకనాథం యాదవ్ పేరు ఎక్కడా లేదని, కనీసం ఆయనను విచారణకు కూడా పిలవలేదని భూమన పేర్కొన్నారు. అలాంటప్పుడు సిబిఐ ఇచ్చిన సమాచారం ఆధారంగానే ఎసిబి చర్యలు చేపట్టిందనే ప్రచారం ఎలా వచ్చిందని ప్రశ్నించారు. ఎసిబి డిఎస్పీ మాత్రం తమకు అందిన ఫిర్యాదు, కోర్టు అనుమతి మేరకు దాడులు నిర్వహించినట్లు చెప్పారని గుర్తుచేశారు. కల్తీనెయ్యిలో ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలోనూ ఆయన పేరు లేదంటున్నారని, మరి మధ్యలో లోకనాథం యాదవ్ ఎలా వచ్చారని అనుమానం వ్యక్తం చేశారు. ఎసిబికి సమాచారం ఇచ్చిందో బయటకు రావాలని భూమనడిమాండ్ చేశారు. టిటిడిలో కొందరు అధికారుల కుమ్మక్కై లోకనాథం యాదవ్‌ను టార్గెట్ చేశారని ఆరోపించారు. ఇది సిబిఐ రిపోర్ట్ కాదని, టిటిడిపై పడిన రెడ్ బుక్ పంజా అని వెంకటేశ్వరస్వామిని అడ్డుపెట్టుకొని టిటిడిని రాజకీయ వనరుగా మార్చుతున్నారని కరుణాకర్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు.

### అలిపిరి తనిఖీ కేంద్రంలో భారీగా మద్యం సీసాలు పట్టివేత

**తిరుమల,సెప్టెంబర్ 3ప్రభాతవార్తప్రతినిధి:** పుణ్యక్షేత్రం తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా తిరుమలకు మద్యం తరలిస్తున్న యువకుడిని అలిపిరి తనిఖీ కేంద్రంలో భద్రత సిబ్బంది పట్టుకున్నారు. గురువారం రాత్రి ఈ సంఘటన జరిగింది. తిరుమల వైభవాన్ని, ఆధ్యాత్మిక వాతావరణాన్ని దెబ్బతీసేందుకు కొందరు అక్రమార్కులు తెగబడుతున్నారు. భక్తుడిలా తిరుపతి లీలామహల్ సెంటర్‌కు చెందిన కె.బాబ్జి సాహసంతో తన వెంట మద్యం బాటిళ్లను లగేజీ సంచిలో తీసుకుని అలిపిరి తనిఖీ కేంద్రం చేరాడు. అక్కడ భద్రత సిబ్బంది నిశితంగా తనిఖీలు చేయడంతో తిరుమలకు తరలించేందుకు తీసుకువచ్చిన మద్యం బాటిళ్ళు, హాన్స్ ప్యాకెట్లు పట్టుబడ్డాయి. భక్తుడిలా ఇతను అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు ఏవిఎస్ఒ రమేశ్ కృష్ణ గుర్తించారు. అలిపిరి తనిఖీల్లో భద్రత సిబ్బంది సమర్థవంతంగా అడ్డుకున్నారు. అతని వద్ద 9 మద్యం క్వార్టర్ బాటిళ్లు బయటపడ్డాయి. వెంటనే విజిలెన్స్, పోలీసులు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, బాబ్జిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ జరుపుతున్నారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్, పోలీసులు హెచ్చరిస్తున్నారు.

# ఎస్‌పిడిసిఎల్ పరిధిలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ప్రాధాన్యం

- 33-11 కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణ పనుల వేగవంతం



**తిరుపతి, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ దక్షి ణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్‌పిడిసిఎల్) పరిధిలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి ఆదేశించారు. ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో గురువారం వివిధ అభివృద్ధి పనులపై సంస్థ డైరెక్టర్లు, చీఫ్ జనరల్ మేనేజర్లతో సిఎండి శివశంకర్ లోతేటి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ పరిధిలోని నెల్లూరు సర్కిల్‌లో 2.42 లక్షల స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయాలనే లక్ష్యానికి అనుగుణంగా 1.49 లక్షల మీటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇంకా 93వేల మీటర్లు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. తిరుపతి సర్కిల్‌లో 2.36 లక్షల మీటర్లకు గానూ 2.05 లక్షల మీటర్లను ఏర్పాటు చేశారని, 30 వేల మీటర్లను ఏర్పాటు చేయాల్సి ఉందని, చిత్తూరు సర్కిల్‌లో 94 వేల మీటర్ల లక్ష్యానికి గానూ 81 వేల మీటర్లను ఏర్పాటు చేశారని, 13 వేల మీటర్లను ఏర్పాటు చేయాల్సి ఉందని. అన్నమయ్య సర్కిల్‌లో 1.01 లక్షల మీటర్ల లక్ష్యానికి గానూ 85 వేల మీటర్లను ఏర్పాటు చేశారని, 16 వేల మీటర్లను ఏర్పాటు చేయాల్సి ఉందని, కడప సర్కిల్‌లో 1.72 లక్షల మీటర్ల ఏర్పాటు లక్ష్యానికి గానూ 1.24 లక్షల మీటర్లను ఏర్పాటు చేశారని, ఇంకా 48 వేల మీటర్లను ఏర్పాటు చేయాల్సి ఉందని, శ్రీ సత్యసాయి సర్కిల్‌లో 86 వేల మీటర్ల ఏర్పాటు లక్ష్యం కన్నా ఎక్కువగా 89 వేల మీటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా అనంతపురం సర్కిల్‌లో 1.43 లక్షల మీటర్ల లక్ష్యానికి గానూ 1.27 లక్షల మీటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, ఇంకా 15 వేల మీటర్లను ఏర్పాటు చేయాల్సి ఉందని, నంద్యాల సర్కిల్‌లో 1,01 లక్షల మీటర్ల ఏర్పాటు లక్ష్యానికి గానూ 99 వేల మీటర్లను ఏర్పాటు చేశారని, ఇంకా 2 వేల మీటర్లను ఏర్పాటు చేయాల్సి ఉందని, కర్నూలు సర్కిల్‌లో 1.41 లక్షల మీటర్ల ఏర్పాటు లక్ష్యానికి గానూ 1.27 లక్షల మీటర్లను ఏర్పాటు చేశారని, ఇంకా 14 వేల మీటర్లను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. సంస్థ పరిధిలో మొత్తంగా 13.20 లక్షల స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు లక్ష్యం నిర్దేశించగా, ఇప్పటివరకు 10.89 లక్షల మీటర్లను ఏర్పాటు చేశారని, ఇంకా 2.31 లక్షల స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాల్సి ఉందని వివరించారు. ఈ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్మార్ట్ మీటర్ల కమ్యూనికేషన్ స్థితి, మీటర్ల ద్వారా అందుతున్న డేటా విశ్లేషణ, ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల అమలు తదితర అంశాలపై సిఎండి సమగ్రంగా సమీకించారు.

**డేటా విశ్లేషణకు ప్రాధాన్యం:** స్మార్ట్ మీటర్ల నుండి అందుతున్న డేటాను సమర్థవంతంగా విశ్లేషించి, విద్యుత్ వినియోగ విధానం, బిల్లింగ్ తదితర అంశాల్లో అవసరమైన నిర్ణయాలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని సిఎండి సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని విద్యుత్ పంపిణీ సేవలను మరింత మెరుగుపరచాలని తెలిపారు. ఎస్‌పిడిసిఎల్ పరిధిలో నిర్మాణంలో ఉన్న 33/11 కెవి సబ్‌స్టేషన్ల పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. నిర్ణీత గడువులో పనులను పూర్తి చేసి, సబ్‌స్టేషన్లను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా వినియోగదారులకు మెరుగైన నాణ్యమైన విద్యుత్ సరఫరా అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసుకు రైతులు దరఖాస్తు చేసుకునే విధానాన్ని మరింత సులభతరం చేస్తున్నామని సిఎండి తెలిపారు. ఈ చర్యలో భాగంగానే వినియోగదారులు 1912 కు కాల్ చేయడం ద్వారా పేరు, తండ్రి పేరు, ఆధార్ నంబరు, మొబైల్ నంబరు తదితర వివరాలను తెలియజేసి, వ్యవసాయ విద్యుత్ సర్వీసుకు దరఖాస్తును నమోదు చేసుకోవచ్చని తెలియజేశారు. ఆ తర్వాత ఈ వివరాలకు సంబంధించిన డాక్యుమెంట్లను విద్యుత్ శాఖ సిబ్బంది అందుకుని, వివరాలను ధ్రువీకరించిన అనంతరం నూతన సర్వీస్ కోసం చెల్లింపు ప్రక్రియ మొదలవుతుందని వివరించారు.

**యాప్‌ల వినియోగం సరళీకృతం:** సంస్థ పరిధిలో విద్యుత్ వినియోగదారులకు ఆధునిక సాంకేతికత ద్వారా మెరుగైన, సత్వర సేవలందించేందుకు కృషి చేస్తున్నామని సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. సంస్థ పరిధిలో అందుబాటులో ఉన్న వివిధ యాప్ ల పనితీరుపై క్షుణ్ణంగా సమీక్షి ంచారు. వివిధ యాప్‌ల వినియోగాన్ని సరళీకృతం చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థలో సాంకేతికతను విస్తృతంగా వినియోగించుకోవడం ద్వారా వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరాతో పాటు మెరుగైన సేవలు అందించడమే ఎస్‌పిడిసిఎల్ ప్రధాన లక్ష్యమని సిఎండి శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో సంస్థ డైరెక్టర్లు కె. గురవయ్య, పి. అయూబ్ ఖాన్, చీఫ్ జనరల్ మేనేజర్లు జె. రమణాదేవి, ఆర్.పద్మ, ఎన్. శోభా వాలెంటీనా, యం.మురళీ కుమార్, సిహెచ్ రామచంద్రరావు, కె.సంపత్ కుమార్, ఎస్.రమణ, జనరల్ మేనేజర్లు సుబ్బారావు, జగదీష్, లత, సురేష్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కర్నూలులో మాజీ సిఎం జగన్



వధువరులు ఆశీర్వదిస్తున్న వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి

**కర్నూలు అర్బన్, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి కర్నూలులో పర్యటించారు. కర్నూలులోని సెయింట్ జోషప్ కళాశాల మైదానంలో జరిగిన మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి కుమారుడు జనక్ వివాహ రిసెప్షన్‌కు ఆయన హాజరయా ్యరు. ఈసందర్భంగా నూతన వధువరులు శ్రియ - జనక్‌లను వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీర్వదించి వారికి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. నూతన దంపతులు సుఖ సంతోషాలతో ఆనందంగా దాంపత్య జీవితాన్ని గడపాలని ఆయన ఆకాంక్షించారు. వధువు శ్రియ రాజమండ్రి కూడ మాజీ చైర్మన్ షర్మిల, మెడపాటి అనిల్‌రెడ్డి దంపతుల కుమార్తె వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతనిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు హాజరయ్యారు.

## రమ్య ఫుడ్స్ ఎల్‌ఎల్ పి కంపెనీలో కార్మికుడు మృతి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు3,ప్రభాతవార్త:** ఈతకోట రమ్య ఫుడ్స్ ఎల్ఎల్ పి కంపెనీలో పనిచేస్తున్న కార్మికుడు మృతి చెందిన ఘటన డాక్టర్ బిఆర్ అంబెద్కర్ కోనసీమ జిల్లా లో చోటుచేసుకుంది.ఈ సంఘటన పై కేసు నమోదు చేసినట్లు రావులపాలెం అర్బన్ సిఐ జి రమేష్ బాబు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కొత్తపేట మండలం గంటి శెట్టిబలిజ పేటకు చెందిన గుత్తుల రాజు (23) రమ్య ఎల్ఎల్పీ కంపెనీలో జనరల్ ఆపరేటర్ కు హెల్పర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే బుధవారం రాత్రి కంపెనీలో ఫౌడర్ ట్యాంకర్ పైన పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు ట్యాంకర్లో పడటంతో మిషన్ ఆపుచేసి యాజమాన్యం స్థానిక ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు తల్లి గుత్తుల భారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్సై రమణారెడ్డి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రమేష్ బాబు తెలిపారు.దీంతో ఫ్యాక్టరీలో సరైన జాగృత్తలు ,నిబంధనలు పాటించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

## ఆటో-బైక్ ఢీ.. ముగ్గురు కార్మికులు మృతి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,సెప్టెంబరు3 (ప్రభాతవార్త):** వారంతా రెక్కాడితే గాని డొక్కాడని కూలి పని చేసుకునే వ్యక్తులు.పని నుంచి ఇంటికి తిరిగి వస్తూ కొద్ది నిమిషాల్లో ఇంటికి చేరుకునే లోపే ఆ వ్యక్తులను మృత్యువు కబళించింది. ఎదురుగా వస్తున్న ఆటో రూపంలో ఆ వ్యక్తుల ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి. ఆయా కుటుంబాలకు ఆధారంగా వుండే వారిని కోల్పోవడంతో కన్నీరుమున్నీరు అవుతున్నారు.ఒకే గ్రామ పంచాయతీకి చెందిన ముగ్గురు వ్యక్తులు మరణంతో ఆయా కుటుంబాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి. ఆయా గ్రామాల్లో కుటుంబ సభ్యుల రోదనలు ఆకాశాన్నంటాయి. కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పటవల పంచాయతీ మట్లపాలెం కొత్తూరు వద్ద జాతీయ రహదారి 216 పై గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు మృతి చెందిన సంఘటన పలువురిని దిగ్భ్రాంతికి గురి చేసింది. కాకినాడ నుంచి తాళ్ళరేవు వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తులు, కాకినాడ వైపు వెళ్తున్న ఆటో ఎదురు ఎదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఘటనా స్థలంలో ద్విచక్ర వాహనంపై ఉన్న మట్లపాలెం గ్రామానికి చెందిన ఇంటి కృష్ణ(29) అక్కడికక్కడే మృతి చెందాడు. కొన ఊపిరిలో ఉన్న కొత్తూరు గ్రామానికి చెందిన కొమ్మనపూడి మణికంఠ(33), రాఘవేంద్రపురం గ్రామానికి చెందిన కొండ్రు తంబి(40) తీవ్ర గాయాలతో కాకినాడలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ప్రమాదం మృతుడు మణికంఠ ఇంటి ఎదురుగా జరగడం ఆ కుటుంబ సభ్యులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఘటనా స్థలానికి కోరంగి ఎస్.ఐ. సత్యనారాయణ చేరుకుని ట్రాఫిక్ నిరోధించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఐసిడిఎస్ పిడి, కోవూరు సిడిపిఒ సస్పెన్షన్

**నెల్లూరు, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త - కలెక్టరేట్:** పలు ఫిర్యాదులు, ఆరోపణల నేపథ్యంలో నెల్లూరు ఐసీడీఎస్ పీడీ హేనాసుజన, కోవూరు ఇన్చార్జి సీడీపీఓ శారదను సస్పెండ్ చేస్తు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. కోవూరు ఇన్చార్జి సీడీపీఓకు, కోవూరు అంగన్వాడీ కార్యకర్తలకు మధ్య చాలా కాలంగా ఆరోపణలు, ప్రత్యారోపణలు జరుగుతున్నాయి. అంగన్వాడీ వర్క్స్, అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు, సీఐటీయూ ఆధ్వర్యంలో కోవూరు సీడీపీఓ అంగన్వాడీలను వేధింపులకు గురిచేస్తోందని ఆరోపిస్తూ, కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఈ విషయమై విచారణాధికారిగా ఐసీడీఎస్ పీడీని నియమించారు. దీంతో విచారణకు కోవూరు ఇన్చార్జి సీడీపీఓ, అంగన్వాడీ వర్కర్లు సహకరించటం లేదని, ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్ కలెక్టర్‌కు నివేదిక సమర్పించినట్లు సమాచారం. వారి సమస్యల పరిష్కారం కాలేదు. అంగన్ వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పీడీ హేనా సుజన్, కోవూరు ఇన్చార్జి సీడీపీఓకు సహకరిస్తూ తమకు న్యాయం చేయటం లేదని ఆరోపిస్తూ ఆందోళన బాట పట్టారు. చివరగా బుధవారం ఐసీడీఎస్ కార్యాలయం ముట్టడికి కూడా వారు పిలుపు నిచ్చారు. ఇలా ఆరోపణలు, ఫిర్యాదులు, ముట్టడి కార్యక్రమ పిలుపుకు స్పందించిన ఉన్నతాధికారులు, ఐసీడీఎస్ పీడీని, కోవూరు ఇన్చార్జి సీడీపీఓను సస్పెండ్ చేశారు.

## కారుమూరి కస్టడీ కోసం పోలీసుల పీటీ వారెంట్

**విజయవాడ,.సెప్టెంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం రవాణా టెండర్ల కేసులో నిందితుడిగా ఉన్న కారుమూరి నాగేశ్వరరావును కస్టడీలోకి తీసుకునేందుకు పోలీసులు పీటీ వారెంట్ పిటిషన్ వేశారు. ప్రస్తుతం ఆయన చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్నారు. ఈ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని న్యాయవాదులను ఆదేశించిన న్యాయస్థానం, తదుపరి విచారణను సెప్టెంబర్ 11వ తేదీకి వాయిదా వేసింది.

# ఎకరం కూడా ఎండిపోకూడదు

- ఎల్ నినో ప్రభావంతో వర్షాలు అంతంత మాత్రమే
- రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలి
- విబి జి రామ్ జి నిధుల అనుసంధానంతో కరువు పరిస్థితుల నుంచి గట్టేక్కాలే ప్రణాళికలు సిద్ధం
- కేబినెట్ భేటీలో విస్తృత చర్చ: మంత్రి కొలుసు పార్థసారథి



మంత్రి కొలుసు పార్దసారధి

**విజయవాడ, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రి మండలి సమావేశంలో పలు అంశాలపై తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర సచివాలయం నాల్గవ భవనం ప్రచార విభాగంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరించారు. అనంతరం మంత్రి పార్థసారథి ఎల్ నినో అంశంపై మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎల్ నినో ప్రభావాన్ని తగ్గించి ప్రజలకు తాగునీటికి ఇబ్బంది తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఆరుతడి పంటల సాగు వైపు అన్నదాతలు దృష్టిసారించే విధంగా చైతన్యవంతులను చేయాలని ఆదేశించారని వివరించారు. రాష్ట్రంలో ఒక్క ఎకరం కూడా పంట నష్టపోకూడదని, ఏ ఒక్క ఎకరంలో పంట కూడా ఎండిపోకూడదని మంత్రులు, అధికారులకు ముఖ్యమంత్రి స్పష్టం చేశారన్నారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం నమోదయిందని, ఇప్పటి వరకు 52శాతం తక్కువ వర్షపాతం నమోదైందని మంత్రి పార్థసారథి వివరించారు. దేశంలోనే తక్కువ వర్షపాతం నమోదైన రాష్ట్రాల్లో మన రాష్ట్రం మొదటి రెండు స్థానాల్లో ఉందన్నారు. సాధారణ వర్షపాతం నమోదైతే ఈ పాటికి దాదాపు 90 శాతం భూమి సాగులోకి వచ్చేదని, కాని ఈ ఏడాది ఇప్పటి వరకు కేవలం 60- 65 శాతం మాత్రమే సాగులోకి వచ్చిందంటే పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుందని అన్నారు. రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఎల్ నినో ప్రభావాలను రైతులకు వివరిస్తూ, వారికి పంట మార్పిడిపై తగు సూచనలు, సలహాలు అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. ఆరుతడి పంటల వైపు రైతన్నలు మొగ్గుచూపేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం ప్రభుత్వం 90వేల కిలోల ఆరుతడి పంటల విత్తనాలను పంపిణీ కోసం సిద్ధం చేయాలని సిఎం ఆదేశించారన్నారు. విత్తనాల సబ్సిడి కోసం రూ.90 కోట్ల ఆర్థిక సాయానికి ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారన్నారు. పశు రక్షణలో భాగంగా పశుగ్రాస కొరతను అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. విబి జి రామ్ జి భాగస్వామ్యంతో పశుగ్రాస పెంపకం చేపట్టేలా చర్యలు తీసుకోనున్నామన్నారు. అదేవిధంగా ఉద్యానపంటలను సైతం కాపాడుకోవాల్సి న అవసరం ఎంతైన ఉందన్నారు. ఉద్యాన పంటల సాగుకు నీటి సరఫరా ఎంతో అవసరమని, వాటిని కాపాడుకోవడానికి అవసరమైతే విబి జి రామ్ జి పనుల ద్వారా సమీప చెరువుల నుండి కాలువలు ద్వారా నీటిని తరలించడం లేదా బిందు సేద్యంపై అవగాహన పెంచి అందుకు అవసరమైన సహకారం అందించాలని ముఖ్యమంత్రి సూచించారన్నారు. జిల్లాల్లో ఉన్న అగ్రికల్చర్ యూనిర్సిటీలు, కాలేజీల అధ్యాపకులతో రైతులకు తక్కువ నీటి వనరుతో లాభదాయక పంటల సాగుపై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. వరి సాగుకు ఎక్కువ పరిమాణంలో సాగునీరు అవసరం ఉంటుందని, కాని ఎల్ నినో ప్రభావంతో సాగు నీరు అందని స్థితి నెలకొందన్న విషయం వరి సాగు రైతులకు స్పష్టంగా వివరించి ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించేలా చర్యలు తీసుకోవడం ద్వారా ఫలితం ఉంటుందన్నారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో త్రాగునీటి కష్టాలు తప్పేలా లేవని, రాష్ట్రవ్యాప్తంగా 14,829 హ్యాబిటేషన్లు ఉన్నాయి. నివాస ప్రాంతాల వారీగా ప్రపోజల్స్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని మంత్రి పార్ధసారథి తెలిపారు. ప్రజలందరికీ త్రాగునీరు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని వివరించారు. అవకాశం ఉన్న ప్రాంతాల్లో బోర్లు వేయడం లేదా ట్యాంకర్లు ద్వారా త్రాగునీటిని సరఫరా చేయడం వంటి తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే ఇతర రాష్ట్రాల నుండి ట్యాంకర్లు అద్దె ప్రాతిపదికన తీసుకురావాలన్న ఆలోచన చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావాన్ని వివరిస్తూ కేంద్రానికి లేఖలు రాయాలని, కేంద్రానికి ఎప్పటికప్పుడు పరిస్థితిని వివరిస్తూ ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. వాతావరణ ఆధారిత బీమాను చేయడంలో మన రాష్ట్రం దేశంలోనే 6వ స్థానంలో ఉందని, కరువు నిధులు ఎక్కువగా రాష్ట్రానికి అందేలా కృషి చేస్తున్నామన్నారు. కేంద్రం, రాష్ట్ర, విబి జి రామ్ జి నిధుల అనుసంధానంతో కరువు పరిస్థితులను గట్టేక్కాలే ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందన్నారు. తిరుపతి నుండి ఎన్ఐఇఎల్ఐటి (నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) సంస్థ తరలించడం లేదని, కొందరు చేస్తున్న దుష్ప్రచారంలో వాస్తవం ఎంతమాత్రం లేదన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ రంగాల్లో మన రాష్ట్రాన్ని మరింత బలోపేతం చేసే దిశగా అమరావతిలో క్వాంటం ఎఐ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని, మన రాష్ట్రంలో మూడు యూనివర్సిటీల ఏర్పాటుకు అనుమతి లభించిందని మంత్రి వివరించారు.

# క్యాబినెట్ ఆమోదంతో ఆరు దశాబ్దాల ఎదురుచూపులకు తెర

- 1,215 పేద కుటుంబాలకు ఊరట
- నెల రోజుల్లోనే మాట నిలబెట్టుకున్న మంత్రినారాయణ
- త్వరలో పట్టాల పంపిణీ పండుగ





కల సాకారం చేసిన సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ చిత్రపటాలకు పాలాభిషేకం

**నెల్లూరు, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:** వైద్యం ఆరు దశాబ్దాలుగా వెంటాడుతున్న భయం, అనిశ్చితి, కన్నీళ్లకు ఇక తెరపడనుంది. సర్వేపల్లి కాలువకట్టపై నివసిస్తున్న నిర్వాసితుల 60 ఏళ్ల సమస్యకు కూటమి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపింది. 1,215 పేద కుటుంబాలకు శాశ్వత ఇంటి పట్టాలు మంజూరు చేసేందుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో కాలువకట్టపై సంబరాలు అంబరాన్నంటాయి. ఇళ్ల పట్టాలు ఇప్పిస్తానని నెల రోజుల క్రితం హామీ ఇచ్చిన రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. సంకల్పం గట్టిదైతే సాధించలేనిది ఏదీ లేదని మరోసారి నిరూపించారు. మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖలను సమన్వయ పరిచి అధికారిక ప్రక్రియను వేగవంతం చేసి క్యాబినెట్ ఆమోదం సాధించారు. త్వరలోనే నిర్వాసితులకు శాశ్వత పట్టాలు పంపిణీ చేయనున్నారు. కాలువకట్టపై నివాసాలు తొలగిస్తారన్న ప్రచారం జరిగిన ప్రతిసారీ నిర్వాసితులు వణికిపోయేవారు. ఎప్పుడు తమ ఇళ్లు ఖాళీ చేయాల్సి వస్తుందోనన్న భయంతో నిద్రలేని రాత్రులు గడిపారు. సొంత ఇంట్లోనే హక్కు లేని పరిస్థితి.. భవిష్యత్తుపై భరోసా లేని జీవితం.. ఇలా ఐదు దశాబ్దాలు గడిచిపోయాయి. తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. మంత్రి నారాయణ ప్రత్యేక దృష్టి సారించడంతో పరిస్థితి మారింది. గత నెల 8 వ తేదీన కాలువకట్టపై పర్యటించిన మంత్రి సమస్యను స్వయంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. పేదల ఇళ్లకు శాశ్వత భద్రత కల్పించడంలో మరో మైలురాయిని అధిగమించారు. తొలుత భగత్‌సింగ్ కాలనీలో 1,400 కుటుంబాలకు శాశ్వత పట్టాల సమస్యకు పరిష్కారం చూపిన మంత్రి, ఇప్పుడు సర్వేపల్లి కాలువకట్టపై మరో 1,215 కుటుంబాలకు పట్టాల మార్గం సుగమం చేశారు. రెండు ప్రాంతాల్లో కలిపి వేలాది కుటుంబాలకు శాశ్వత భరోసా కల్పించడం ద్వారా పేదల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకుందని స్థానికులు చెబుతున్నారు. దీంతో నాలుగు ప్రాంతాల్లో పండుగ వాతావరణం నెలకొంది.క్యాబినెట్ ఆమోదం వార్త తెలియగానే లబ్ధిదారుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. చిల్డ్రన్స్ పార్క్ రోడ్డు,స్టోన్ హౌస్ పేట ఉడ్‌హౌస్ సంగం, బాలాజీనగర్ అన్నపూర్ణ అపార్ట్మెంట్ ఎస్ఎస్ చికెన్ సెంటర్, శెట్టిగుంటరోడ్ ప్రాంతాల్లో సంబరాలు నిర్వహించారు.సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారాయణ, డీసీఎం పవన్ కళ్యాణ్ ఫ్లెక్సీలకు పాలాభిషేకాలు చేసి పూలవర్షం కురిపించారు. స్వీట్లు పంచిపెట్టారు. రంగులు చల్లుకుని, బాణాసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. దాంతో కాలువకట్ట ప్రాంతమంతా పండుగ వాతావరణాన్ని తలపించింది. 60 ఏళ్లుగా మమ్మల్ని పట్టించుకునేవారు లేరు. ఇళ్లు తొలగిస్తారన్న వార్త వచ్చిన ప్రతిసారీ భయంతో బతికాం. ఇప్పుడు మా పిల్లల భవిష్యత్తుకు భరోసా వచ్చింది. శాశ్వత పట్టాలు ఇప్పిస్తానని చెప్పి నెల రోజుల్లోనే హామీ నిలబెట్టుకున్న మంత్రి నారాయణకు ఆజన్మాంతం రుణపడి ఉంటాం అంటూ నిర్వాసితులు భావోద్వేగానికి గురయ్యారు. పేదల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా చేతల్లో చూపిస్తోందని ఈ పరిణామం మరోసారి నిరూపించింది. సమస్యను గుర్తించడం నుంచి శాఖల సమన్వయం, క్యాబినెట్ ఆమోదం వరకు మంత్రి నారాయణ ప్రత్యేక శ్రద్ధ చూపారు.టీడీపీ అంటే మాటల ప్రభుత్వం కాదు, చేతల ప్రభుత్వం మని మరోసారి రుజువైందని స్థానిక టీడీపీ నాయకులు పేర్కొన్నారు. రెండు తరాల నిరీక్షణ తర్వాత సర్వేపల్లి కాలువకట్ట కథలో కొత్త అధ్యాయం మొదలైందంటున్నారు. ఆరు దశాబ్దాల నిరీక్షణకు తెరదించి, 1,215 కుటుంబాలకు శాశ్వత భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ పాలాభిషేక కార్యక్రమంలో కాలువకట్ట నిర్వాసితులతో పాటు నగర మేయర్ దేవరకొండ సుజాత, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ, నగర టీడీపీ అధ్యక్షులు మామిడాల మధు, కార్పొరేటర్లు కర్తం ప్రతాప్ రెడ్డి,కిన్నెర మాల్యాద్రి, వెంకటేశ్వర రెడ్డి, టీడీపీ నాయకులు సాయిరాం, పెంచల చౌదరి, ఆంచూరు శ్రీనివాసులు, బీసీ బాబు, తిరుమల నాయుడు, కొండా ప్రవీణ్, అన్నపూర్ణ, ఇంతియాజ్, జహీర్, మొయినుద్దీన్, జనసేన నేత గుణుకుల కిషోర్, మార్కెటింగ్ కమిటీ మెంబెర్ గుణుకుల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నల్లకోటులో వచ్చి గురజాల కోర్టులో లొంగిపోయిన హత్యకేసు నిందితుడు

### పోలీసుల అదుపులో మరో నిందితుడు లచ్చిరెడ్డి..?

**రెంటచింతల, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:** పోలీసులకు చిక్కకుండా నేరుగా న్యాయమూర్తి ఎదుట లొంగిపోవాలని భావించాడు.ఆ మేరకు లాయర్ దుస్తుల్లో ఉండి పోలీసులు కళ్లుగప్పి ఆర్డీవో కార్యాలయం నుంచి న్యాయస్థాన భవనాల ప్రాంగణంలోకి వెళ్లాడు.ద్విచక్రవాహనంపై వెనుకూర్చుని నల్ల గౌను వేసుకుని చేతిలో వివిధ రకాల కాగితాలు పట్టుకుని నల్ల అద్దాలు పెట్టుకుని నేరుగా ఏజేసీజె పి.అలేఖ్య ఎదుట హత్యకేసు నిందితుడు మోర్తాల ఉమ లొంగిపోయిన ఉదంతమిది.. వివరాల్లోకెళ్తే రెంటచింతల మండలంలోని రెంటాల గ్రామానికి చెందిన వైసీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి నవులూరి చెన్నారెడ్డి ఆగస్టు 6 రాత్రి స్కూటీపై స్వగ్రామానికి వెళ్తున్న సమయంలో దారి కాచి కారుతో ఢీకొట్టించి కళ్ళల్లో కారం చల్లి గొంతు కోశారు. ఈ హత్య పల్నాట సంచలనం కలిగించింది. చెన్నారెడ్డి హత్యకు సంబంధించి ఇప్పటి వరకు 8 మందిని అరెస్ట్ చేశారు. మరో ఇద్దరునిందితులు మామ,అల్లుడైన జక్కిరెడ్డి లచ్చిరెడ్డి, మోర్తాల ఉమమహేశ్వరరెడ్డిల కోసం గాలింపు జరుపుతున్న నేపథ్యంలో గురువారం గురజాకోర్టులో ఉమ లొంగిపోగా లచ్చిరెడ్డిని అక్కడే పోలీసులు అదుపులోకి తీసుకుని గురజాల స్టేషన్కు తరలించారు. దీంతో చెన్నారెడ్డి హత్యకేసులోని నిందితులంతా 9 మంది కటకటాలపాలు కాగా లచ్చిరెడ్డి ఒక్కరే అధికారికంగా మిగిలాడు..1988 మార్చిలో విజయవాడకు చెందిన దేవినేని మురళీ హత్యకేసులోని ప్రధాన నిందితుడు అప్పటి తూర్పు ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా ఇదే తరహాలో కోర్టుకు నల్లకోటుతో వచ్చి లొంగిపోయిన విషయం పాఠకులకు విదితమే.మెజిస్ట్రేట్ అలేఖ్య నిందితుడైన ఉమమహేశ్వరరెడ్డికి 14 రోజుల పాటు రిమాండ్ విధించడంతో సబ్ జైలుకు తరలించారు.

## కల్వర్ట్‌ను ఢీకొన్న కారు.. డ్రైవర్ మృతి



**మర్రిపాడు (నెల్లూరు), సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :** మర్రిపాడు మండలం నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై పొంగూరు కండ్రిక-నందవరం మార్గమధ్యంలో గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వెళుతున్న కారు అదుపు తప్పి బ్రిడ్జ్ కల్వర్టును ఢీకొట్టింది. ఈసంఘటనలో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. సమాచారం అందుకున్న ఎస్ఐ బలరామిరెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుని స్వగ్రామం మర్రిపాడు మండలం తిమ్మాయపాళెం కాగా మృతుడు నెల్లూరులో నివాసం ఉంటూ ఓ ఆటో ఫైనాన్స్ నడుపుతున్నాడు. మృతుని కుటుంబ సభ్యులకు ఎస్ఐ సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

## కిడ్నాప్ కేసులో ముగ్గురు అరెస్ట్

- మూడు రోజుల్లోనే పురోగతి సాధించిన తిరుపతి రూరల్ పోలీసులు
- మరో ముగ్గురిని తీవ్రంగా గాలిస్తున్న పోలీసులు

**తిరుపతి క్రైమ్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జులై నెల 28న కిడ్నాప్ కేసు నమోదు అయిన విషయం విధితమే. ఈ సందర్భంగా రూరల్ సిఐ మద్దయ్య ఆచారి సమాచారం మేరకు తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం, నాగపట్నం గ్రామానికి చెందిన బాధితుడు సుమంత్ నాని క్రికెట్ ప్రిడిక్షన్ అప్ ధ్వారా అధిక ఫాలోవర్స్‌తో విజయవంతం కావడంతో ఆ యాపుని ఉత్తర భారతదేశానికి చెందిన వర్తకులకు 6 కోట్లకు అమ్మకానికి పెట్టాడు. ఇందులో భాగంగా 30 లక్షలు అడ్వాన్స్‌ని పొందాడు. అనంతరం వివిధ రకాల హవాల ద్వారా ఆరు కోట్లు మొత్తాన్ని తీసుకున్నాడు. అనంతరం ఇండోనేషియాకి తరలి వెళ్లాడు. తర్వాత జులై 29వ తారీకు భారతదేశానికి చేరుకున్న సుమంత్‌ని అత్యాశతో మిత్రులు అయిన యస్వంత్, మనోజ్, గౌతమ్ వీళ్ళకు సహకరించిన బాలాజీ, చరణ్, వాజిద్ భాషలు కలసి చంద్రగిరి తొండవాడలో కిడ్నాప్ చేసి చంద్రగిరి మండలం శ్రీనివాస మంగాపురం సమీపన ఒక హోమ్ స్టేలో దాచి ఉంచారు. అనంతరం హైదరాబాద్‌లోని కేపిహెచ్‌బి పోలీస్ స్టేషన్ పరిధిలో వున్న మనోజుకు చెందిన అపార్ట్ మెంట్ కు సుమంతుని కిడ్నాపర్లు తరలించారు. అనంతరం మనోజ్, చరణ్ మద్యం మత్తులో ఉండగా సుమంత్వా వాట్సాప్‌లో యూరపులో ఉన్న తన గర్ల్ ఫ్రెండ్‌కు మెసేజ్ చేసాడు.సుమంత్ గర్ల్ ఫ్రెండ్ కె. పి.హెచ్.బి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం కే.పి.హెచ్.బి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి క్రికెట్ బెట్టింగ్‌కు సంబంధించినవిగా అనుమానించి 30 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. తరువాత సుమంత్ ఆగస్టు 28న తిరుపతి రూరల్ పోలీస్ స్టేషనులో ఫిర్యాదు చేసాడు. బాధితుడి పిర్యాదు మేరకు రూరల్ పోలీసు కేసునమోదు చేసి నేరస్థులను గాలించారు. ఇందులో భాగంగా చంద్రగిరికు చెందిన బాలాజీ, చరణ్, వాజిద్ భాషలను కాలూరు క్రాస్ వద్ద పిర్యాదు అందిన మూడు రోజుల్లోనే సెప్టెంబర్ 1, మంగళవారం తిరుపతి రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా తిరుపతి రూరల్ సి.ఐ మద్దయ్యచారి మాట్లాడుతూ కిడ్నాప్‌లో ప్రధాన సూత్రధారులు యశ్వంత్, మనోజ్, గౌతంల కోసం గాలిస్తున్నామని అరెస్టు చేసిన నిందితులను కోర్టుకు తరలించనున్నట్లు తెలిపారు. మిగిలిన మరో ముగ్గురు కిడ్నాపర్లను తీవ్రంగా గాలిస్తున్నామని త్వరలోనే వారిని కూడా అరెస్టు చేస్తామని వివరించారు. కిడ్నాప్ కేసులో వేగంగా పురోగతి సాగిస్తున్న రూరల్ పోలీసులను తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు అభినందించారు.

## మక్తాపురంలో పల్లె వీక్షణలో నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా

**సంగం (నెల్లూరు), సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :** సంగం మండలం మక్తాపురం గ్రామంలో పల్లెవీక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా పాల్గొన్నారు. మక్తాపురం రైతుల విజ్ఞప్తి మేరకు తక్షణమే వ్యవసాయ గౌడ్‌ను భూమిని కేటాయించారు. శ్మశాన వాటికకు భూమి మంజూరు. మక్తాపురం గ్రామానికి బస్సు నడపాలని ప్రజలు కోరగా వెంటనే ఆర్టీసి అధికాలను ఆదేశించారు. కలెక్టర్ గ్రామాల్లోని వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో నేరుగా తెలుసుకున్నారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను గుర్తించి సాధ్యమైన సమస్యలకు అక్కడిక్కడే పరిష్కారం చూపడమే పల్లె వీక్షణ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు.వి.బి.జి రాంజీ ఉపాధీ హామి పనులను కలెక్టర్ పరిశీలించారు. కూలీలతో నేరుగా మాట్లాడారు. కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. గ్రామంలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలోని చిక్కుడు తోటలను కలెక్టర్ సందర్శించారు. రైతులతో మాట్లాడి పంటసాగు ,దిగుబడి సాగులో ఎదురౌతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు. చిన్నారులకు అందుతున్న సేవలు, విద్యా కార్యక్రమాలపై అంగన్‌వాడీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన స్థానిక విలేఖర్లతో మాట్లాడుతు పల్లెవీక్షణ కార్యక్రమం ద్వారా గ్రామంలోని వాస్తవ పరిస్థితులను నేరుగా తెలుసుకునే అవకాశం కలుగుతుందని అన్నారు. ప్రజలతో నేరుగా మాట్లాడవచ్చునని వారి సమస్యలను పరిష్కరించ వచ్చునని చెప్పారు.

## గణేశ్ పందిళ్ల ఏర్పాటుకు అనుమతులు ఇక మరింత సులభం!

**విజయివాడ,సెప్టెంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వినాయక మండపాలు/పందిళ్ల ఏర్పాటుకు అవసరమైన అనుమతుల కోసం రాష్ట్రవ్యాప్తంగా ఏకీకృత ఆన్‌లైన్ అనుమతి వ్యవస్థ అందుబాటులోకి తీసుకురాబడింది.గణేష్ ఉత్సవ్.నేట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు పోలీస్, అగ్నిమాపక,మున్సిపల్, విద్యుత్ మరియు రెవెన్యూ శాఖల సమన్వయంతో అనుమతుల ప్రక్రియ మంజూరైన అనంతరం క్యూఆర్ కోడ్‌తో కూడిన డిజిటల్ అనుమతి పత్రం పొందవచ్చుఈ సేవ పూర్తిగా ఉచితంసురక్షి తమైన, ప్రశాంతమైన మరియు క్రమబద్ధమైన వినాయక చవితి వేడుకల నిర్వహణ కోసం నిర్వాహకులు ఈ ఆన్‌లైన్ సదుపాయాన్ని వినియోగించుకుని ముందస్తుగా దరఖాస్తు చేసుకోవచ్చు.

## చైనా మాస్టర్స్‌లో క్వార్టర్స్‌కు శ్రీకాంత్, డబుల్స్ జోడీ సాత్విక్-చిరాగ్



**షెన్‌జెన్ (చైనా):** చైనా మాస్టర్స్‌లో ప్రపంచ 9వ ర్యాంకర్ విక్టర్ లాయ్‌ను ఓడించి భారత్ షట్లర్ కిదాంబి శ్రీకాంత్ క్వార్టర్స్‌లో అడుగుపెట్టాడు. అలాగే డబుల్స్ విభాగంలో సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి-చిరాగ్ శెట్టి జోడీ క్వార్టర్స్‌కు చేరుకున్నారు. చైనాలోని షెన్‌జెన్‌లో గురువారం జరిగిన చైనా మాస్టర్స్ టోర్నమెంట్‌లో, కిదాంబి శ్రీకాంత్ ప్రపంచ నంబర్ 9 విక్టర్ లాయ్‌ను వరుస గేమ్‌లలో ఓడించి తదుపరి రౌండ్‌కు దూసుకెళ్లాడు. బిడబ్ల్యూఎఫ్ సూపర్ 750 టోర్నమెంట్‌లో మాజీ ప్రపంచ నంబర్ 1 ఆటగాడు, గంటలోపే లైని 21-18, 21-19 తేడాతో ఓడించాడు. 3-3తో స్కోరును సమం చేసిన తర్వాత, లై వరుసగా తప్పులు చేయడంతో శ్రీకాంత్ 3-7తో వెనుకబడ్డాడు. ఆ తర్వాత కోలుకుని 8-8తో స్కోరును సమం చేశాడు. కెనడియన్ ఆటగాడు తిరిగి పట్టు సాధించి 15-11 ఆధిక్యంలోకి వెళ్లాడు. కానీ శ్రీకాంత్ ఒక శక్తివంతమైన జంప్ స్మాష్‌తో స్కోరును సమం చేసిన తదుపరి 18-16 ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. ఆ తర్వాత అతను మ్యాచ్ పాయింట్ సాధించగా, లై కొట్టిన షాట్ బయటకు వెళ్లడంతో శ్రీకాంత్‌కు విజయం చేకూరింది. పురుషుల డబుల్స్ ఈవెంట్‌లో, సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి-చిరాగ్ శెట్టి ఫ్రాన్స్‌కు చెందిన క్రిస్టో పోపోవ్-తోమా పోపోవ్‌లను 21-17, 22-24, 21-9 తేడాతో ఓడించి క్వార్టర్స్‌కు చేరుకున్నారు. చిరాగ్‌సాత్విక్ జోడీ 8-3 ఆధిక్యంతో బలమైన ఆరంభాన్ని సాధించింది. మొదటి విరామ సమయానికి 11-6 ఆధిక్యంలో నిలిచిన ఈ భారత జోడీ, విరామం తర్వాత తమ ఆధిక్యాన్ని 16-9కి పెంచుకుంది. ఫ్రెంచ్ జోడీ చివరిలో గట్టిగా ప్రయత్నించినప్పటికీ, చిరాగ్‌సాత్విక్ పట్టుదలతో నిలబడి, 17 నిమిషాల్లో జరిగిన తొలి గేమ్‌ను 21-17 తేడాతో గెలుచుకుంది.

## ఇండోనేసియా మాస్టర్స్ అష్మిత ముందంజ ప్రణయ్ నిష్క్రమణ






**ఇస్తోరా సెనాయన్:** ఇండోనేషియా మాస్టర్స్‌లో జువాన్ చెన్ ఝూ చేతిలో ఓటమితో హెచ్‌ఎస్ ప్రణయ్ ఓటమి పాలవ్వగా, అష్మిత చలిహా ముందంజ వేసింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ డ్రాలో, టాప్ సీడ్ అష్మిత చలిహా మలేషియాకు చెందిన గో జిన్ వెయ్‌పై 10-21, 21-10, 21-17 తేడాతో విజయం సాధించి తదుపరి రౌండ్‌కు దూసుకెళ్లింది. అలాగే స్వదేశీ క్రీడాకారిణి ఇలీషా పాల్‌పై 21-15, 21-11 తేడాతో విజయం సాధించిన మూడో సీడ్ అన్మోల్ ఖర్బ్ కూడా తదుపరి రౌండ్‌కు చేరుకుంది. పురుషుల సింగిల్స్ రౌండ్ ఆఫ్ 16లో చైనాకు చెందిన జువాన్ చెన్ ఝు చేతిలో ఓడిపోవడంతో హెచ్‌ఎస్ ప్రణయ్ ఇండోనేషియా మాస్టర్స్ నుండి నిష్క్రమించాడు. ఆరంభపు గేమ్ హోరాహోరీగా సాగింది, ఏ ఆటగాడూ స్పష్టమైన ఆధిక్యాన్ని నెలకొల్పలేకపోయాడు. చైనా ఆటగాడు రెండు లేదా మూడు పాయింట్ల ఆధిక్యాన్ని సంపాదించిన ప్రతిసారీ ప్రతిస్పందిస్తూ, ఝూ ఆధిక్యం మరీ అధికం కాకుండా ప్రణయ్ చూసుకున్నాడు. 16-18తో వెనుకబడిన ప్రణయ్, పోరాడి 19-18తో ఆధిక్యంలోకి వచ్చాడు. అయితే, ఝూ స్కోరును 19-19తో సమం చేశాడు. ఇద్దరూ 20-20తో సమంగా నిలవగా, చివరకు ఝూ స్వల్ప ఆధిక్యంతో 22-20 తేడాతో గేమ్‌ను కైవసం చేసుకున్నాడు. అక్కడి నుండి ఆట చాలా వరకు ఏకపక్షంగా సాగింది, ఝూ రెండవ గేమ్‌పై పట్టు సాధించి, దానిని 21-15 తేడాతో కైవసం చేసుకుని, 45 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించాడు.

## ఐపిఎల్ 2027: ఇంపాక్ట్ ప్లేయర్‌పై రచ్చ

### ఫ్రాంచైజీలకు బిసిసిఐ అల్టిమేటం!

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్ 2027)లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధన మరోసారి పరిశీలనలోకి వచ్చింది. రాబోయే ఐపీఎల్ సీజన్‌కు ముందు మొత్తం 10 ఫ్రాంచైజీల నుంచి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సరికొత్త అభిప్రాయాలను కోరింది. ఐపీఎల్ 2026 ముగిసిన తర్వాత ఈ నిబంధనను సమీక్షిస్తామని గతంలో బీసీసీఐ



కార్యదర్శి దేవజిత్ సైకియా పేర్కొన్న నేపథ్యంలో బోర్డు ఈ ముందడుగు వేసింది. క్రికెట్ కార్యకలాపాల విస్తృత ఫీడ్‌బ్యాక్ ప్రక్రియలో భాగంగా తమ అభిప్రాయాలను లిఖితపూర్వకంగా సమర్పించాలని బీసీసీఐ అన్ని ఫ్రాంచైజీలను కోరింది.

పీఎంఓఏ, అంపైరింగ్, ప్రాక్టీస్ సెషన్లు, మ్యాచ్ నిబంధనలపై కూడా బోర్డు సలహాలను కోరినప్పటికీ, వాటన్నింటిలో ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనే అత్యంత కీలకమైన అంశంగా మారింది. గత కొన్ని ఐపీఎల్ సీజన్లుగా ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధన తీవ్ర చర్చకు దారితీసింది. ముఖ్యంగా ఐపీఎల్ 2026 ఎడిషన్‌లో 200కు పైగా భారీ స్కోర్లు భారీగా నమోదు కావడం, బ్యాట్‌బంతి మధ్య సమతుల్యత దెబ్బతింటోందనే ఆందోళనలు తీవ్రం కావడంతో ఈ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి భారత క్రికెటర్లు కూడా ఈ నిబంధనపై గతంలో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది ఆల్‌రౌండర్ల అభివృద్ధిని దెబ్బతీయడంతో పాటు బౌలర్ల ప్రాధాన్యతను తగ్గిస్తోందని విమర్శలు ఉన్నాయి. గతంలో నిర్వహించిన కెప్టెన్ల సమావేశంలో పలువురు వ్యతిరేకించినప్పటికీ, బోర్డు ప్రాథమికంగా ఈ నిబంధనను కొనసాగించేందుకే మొగ్గు చూపింది. దేవజిత్ సైకియా మాట్లాడుతూ టోర్నీలో కొన్ని లో స్కోరింగ్ మ్యాచ్‌లు కూడా జరిగాయి, ప్రేక్షకులు మ్యాచ్‌లను బాగా ఆస్వాదిస్తున్నారు, బౌలర్లకు కూడా మంచి వికెట్లు దక్కుతున్నాయి, ఇది అన్ని అంశాలు కలగలిసిన ప్యాకేజీ అంటూ నిబంధనను సమర్థించారు. అయితే, ఫ్రాంచైజీలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తే ఈ నిబంధనను పునఃపరిశీలించేందుకు బోర్డు సిద్ధంగా ఉంటుందని సైకియా గతంలోనే హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఫ్రాంచైజీల క్రికెట్ ఆపరేషన్స్ విభాగాల నుంచి వచ్చే నివేదికలను క్రోడీకరించిన తర్వాత, ఐపీఎల్ 2027 సీజన్ కోసం ఈ నిబంధనలో ఏవైనా మార్పులు చేయాలా లేక పూర్తిగా తొలగించాలా అనే దానిపై బీసీసీఐ తుది నిర్ణయం తీసుకోనుంది.




## యూఎస్ ఓపెన్.. దూసుకెళ్లిన సబలెంకా

**న్యూయార్క్:** అరీనా సబలెంకా యూఎస్ ఓపెన్‌లో తన సత్తా చాటింది. కేవలం 53 నిముషాల్లోనే పోలినా ఇయాట్సెంకో పై 6-1, 6-12 తేడాతో ఆధిపత్య విజయం సాధించి తదుపరి రౌండ్‌లోకి దూసుకెళ్లింది. న్యూయార్క్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో సబలెంకా తన మొదటి సర్వ్‌లో దాదాపుగా దోషరహితంగా ఆడింది. తొలి సెట్‌లో 16 పాయింట్లకు 15 పాయింట్లు, మొత్తంగా 28 పాయింట్లకు 21 గెలుచుకుంది. మూడో సీడ్ జెస్సికా పెగులా కూడా సోఫియా కెనిన్‌ను 56 నిముషాల్లోనే 6-3, 6-1 తేడాతో ఓడించి త్వరితగతిన మూడో రౌండ్‌కు చేరుకుంది. అలాగే జైమ్ ఫారియాపై 4-6, 6-0, 6-3, 6-2 తేడాతో విజయం సాధించిన కార్లోస్ అల్కరాజ్, సబలెంకా తర్వాతి స్థానంలో నిలిచాడు. గత ఏడాది ఫైనల్ వరకు ఒక సెట్ కోల్పోని ఈ డిఫెండింగ్ ఛాంపియన్, ఆ తర్వాత వరుసగా ఎనిమిది గేమ్‌లు గెలిచి ఆధిక్యం సాధించాడు. జెస్సికా పెగులా సోఫియా కెనిన్‌ను 6-3, 6-1 తేడాతో ఓడించడానికి కేవలం 56 నిమిషాలు మాత్రమే తీసుకుంది. 2020 ఆస్ట్రేలియన్ ఓపెన్ ఛాంపియన్ అయిన కెనిన్, తన మొదటి మ్యాచ్‌లో వీనస్ విలియమ్స్‌ను ఓడించింది. 8వ సీడ్ బెన్ షెల్టన్, ఆషే కోర్టులో పెగులా తర్వాత హుబెర్ట్ హుర్కాజ్‌ను 6-3, 5-7, 7-6 (3), 7-5 తేడాతో ఓడించగా, 7వ సీడ్ డానిల్ మెద్వెదేవ్, సెబాస్టియన్ గోర్జ్షని 6-13, 6-3, 7-5 తేడాతో సునాయాసంగా ఓడించాడు.

## లండన్ స్క్వాష్ క్లాసిక్.. క్వార్టర్ ఫైనల్స్‌కు అనాహత్



**ఇంగ్లాండ్:** పిఎస్ఎ గోల్డ్-టైర్ లండన్ స్క్వాష్ క్లాసిక్ 2026 టోర్నమెంట్‌లో 18 ఏళ్ల భారత్ టీనేజ్ ప్లేయర్ అనాహత్ సింగ్ క్వార్టర్ ఫైనల్స్‌లోకి దూసుకెళ్లింది. గురువారం ఇంగ్లాండ్‌లో జరిగిన జూనియర్ ప్రపంచ ఛాంపియన్, బెల్జియంకు చెందిన ప్రపంచ నంబర్ 11 నీలే గిలిస్‌ను 39 నిమిషాల్లో 2-1 (13-11, 4-11, 11-8) తేడాతో ఓడించి క్వార్టర్ ఫైనల్స్‌లో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. అనాహత్, గిలిస్ మొదటిసారి ఒకరినొకరు ఎదుర్కొన్నారు. మరోవైపు, రామిత్ టాండన్ రెండో రౌండ్‌ను దాటడంలో విఫలమయ్యాడు. అతను ఇంగ్లాండ్‌కు చెందిన ప్రపంచ నంబర్ 15 మొహమ్మద్ ఎల్షోర్బగీ చేతిలో 29 నిమిషాల్లో 2-0 (10-12, 9-11) తేడాతో ఓడిపోయాడు. ప్రపంచ 42వ ర్యామిత్, భారత ఆటగాడైన రామిత్‌పై 40 హెడ్‌టుహెడ్ రికార్డును కలిగి ఉన్న ఎల్ షోర్బగీపై ఇంకా ఒక్క విజయాన్ని కూడా నమోదు చేయలేదు. అంతకుముందు, వీర్ చోత్రాని యానిక్ విల్హెల్మి చేతిలో వరుస గేమ్‌లలో ఓడిపోయి మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. ఈ పిఎస్ఎ గోల్డ్-టైర్ టోర్నమెంట్‌లో ఇంకా బరిలో ఉన్న ఏకైక భారత ప్లేయర్ అనాహత్ మాత్రమే కావడం విశేషం.

## పుంజుకున్న సేవలరంగం

### ఆగస్టులో 54.1కి పెరిగిన పిఎంఐ సూచీ




**న్యూఢిల్లీ,సెప్టెంబరు 3:** తయారీ రంగానికి భిన్నంగా భారత్ సేవల రంగ కార్యకలాపాలు ఆగస్టులో కొంత మెరుగుపడ్డాయి. అయితే మొత్తం కార్యకలాపాల వృద్ధి నాలుగేళ్లకు పైగా కాలంలో అత్యంత బలహీన స్థాయిల్లోనే కొనసాగింది. సేవల రంగ పర్చేజింగ్ మేనేజర్స్ సూచీ జూలైలో 53.3గా ఉండగా, ఆగస్టులో 54.1కి పెరిగింది. అయినప్పటికీ ఆగస్టు పీఎంఐ 2022 మార్చి తర్వాత రెండో అత్యల్ప స్థాయిగా నమోదైంది. దీర్ఘకాలిక సగటు 54.5తో పోలిస్తే స్వల్పంగా తక్కువగా ఉంది. ఉద్యోగ నియామకాలు 15 నెలల్లోనే అత్యంత వేగంగా పెరగడం సానుకూల పరిణామంగా నిలిచింది. సేవల రంగంలోని 400 సంస్థల కొనుగోలు విభాగాల అధికారుల నుంచి సేకరించిన సమాధానాల ఆధారంగా ఈ సర్వే నిర్వహించారు. పిఎంఐ 50కి పైన ఉంటే వృద్ధిని, 50కి దిగువన ఉంటే క్షీణతను సూచిస్తుంది. ఆగస్టులో భారత్ సేవల కార్యకలాపాల వృద్ధి వేగం పెరిగింది. ఉత్పత్తి, కొత్త వ్యాపారం పెరగడం వృద్ధికి మద్దతిచ్చాయి. అయితే మొత్తం వృద్ధి వేగం నాలుగేళ్లకు పైగా కాలంలో నమోదైన అత్యంత బలహీన స్థాయిల్లోనే ఉంద్థి అని హెచ్‌ఎస్‌బిసి చీఫ్ ఇండియా ఎకనామిస్ట్ ప్రాంజుల్ భండారీ పేర్కొన్నారు. అంతర్జాతీయ డిమాండ్ నుంచి పెద్దగా మద్దతు లభించలేదని ఎస్‌అండ్‌పీ గ్లోబల్ తెలిపింది. కొత్త ఎగుమతి ఆర్డర్లు జూలైతో పోలిస్తే దాదాపు అదే స్థాయిలో పెరిగాయి. గత ఏడాది సగటుతో పోలిస్తే ఎగుమతి అమ్మకాల వృద్ధి తక్కువగానే ఉంది.మరోవైపు, సేవల సంస్థలు 15 నెలల్లోనే అత్యంత వేగంగా ఉద్యోగులను నియమించుకున్నాయి. దీంతో వ్యాపార రంగంలో కొంత విశ్వాసం ఇంకా కొనసాగుతోందని సర్వే సూచించింది.

## ఎన్ఎస్ఇపై సెబి పిటిషన్లు కొట్టివేత

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 3:** కోలోకేషన్, డార్క్ ఫైబర్ కేసులకు సంబంధించి నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ)తో సుమారు రూ.1,500 కోట్ల సెటిల్‌మెంట్‌కు సెబీ ఆమోదం తెలిపిన నేపథ్యంలో ఎన్ఎస్ఇపై మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు గురువారం పరిష్కరించింది. కోలోకేషన్, డార్క్ ఫైబర్ కేసుల్లో కొంతమంది స్టాక్ బ్రోకర్లు ఇతర పెట్టుబడిదారుల కంటే ముందుగా మార్కెట్ డేటాను పొందేందుకు, ట్రేడింగ్ చేసేందుకు అక్రమ మార్గాల్లో లబ్ధి పొందారనే ఆరోపణలు ఉన్నాయి.జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ కే.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం సెటిల్‌మెంట్ ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకుని, సెబీ దాఖలు చేసిన పిటిషన్లను పరిష్కరించింది. జూలైలో సెబీ నుంచి సూత్రప్రాయ ఆమోదం పొందిన అనంతరం, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కోలోకేషన్, డార్క్ ఫైబర్ కేసులను రూ.1,491.21 కోట్లకు సెటిల్ చేసేందుకు ఎన్ఎస్ఇ రూ.714.74 కోట్లను సెబీకి చెల్లించింది. ఇప్పటికే ఎన్ఎస్ఇ డిపాజిట్ చేసిన రూ.776.47 కోట్లతో కలిపి మొత్తం సెటిల్‌మెంట్ మొత్తం రూ.1,491.21 కోట్లు పూర్తయింది.ఎన్ఎస్ఇ తొలుత 2025 జూన్ 20న సెబీకి రెండు సెటిల్‌మెంట్ దరఖాస్తులు సమర్పించింది. కోలోకేషన్, డార్క్ ఫైబర్ అంశాలకు కలిపి రూ.1,387.39 కోట్ల సెటిల్‌మెంట్‌కు ప్రతిపాదించింది. అనంతరం 2026 మార్చి 13న సెటిల్‌మెంట్ నిబంధనలను సవరించి, మొత్తం మొత్తాన్ని రూ.1,491.21 కోట్లకు పెంచింది. దేశంలోనే అతిపెద్ద స్టాక్ ఎక్స్ఛేంజ్ అయిన ఎన్ఎస్ఇ త్వరలో ఐపిఓకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఈ సెటిల్‌మెంట్ ప్రాధాన్యత సంతరించుకుంది.

## ఇక వాట్సాప్‌లోనూ బిల్లు చెల్లింపుల సేవలు




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 3:** భారత్‌లో వాట్సాప్ ద్వారా బిల్లుల చెల్లింపు సేవలను మెటా ప్లాట్‌ఫామ్స్ అందుబాటులోకి తీసుకువస్తోంది. ప్రపంచంలోని అతిపెద్ద మార్కెట్లలో ఒకటైన భారత్‌లో వాట్సాప్ ఆర్థిక సేవల విస్తరణలో భాగంగా ఈ కొత్త సదుపా యాన్ని ప్రవేశపెడుతోంది. ఆండ్రాయిడ్, ఐఓఎస్ రెండుప్లాట్‌ఫామ్‌లలోనూ ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. ఇకపై వినియోగదారులు మరోయాప్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా నేరుగా వాట్సాప్‌నుంచే వివిధ రకాల బిల్లులు చెల్లించవచ్చు.ఈ సేవలో విద్యుత్, గ్యాస్, నీటి బిల్లులు, ఫాస్ట్‌ట్యాగ్, బీమా, క్రెడిట్ కార్డు, రుణ చెల్లింపులు తదితరాలు ఉంటాయి. భారత్ కనెక్ట్ నెట్‌వర్క్ ఆధారంగా ఈ సేవను అందిస్తున్నారు. వాట్సాప్ బిల్ పేమెంట్ సేవ ద్వారా దేశవ్యాప్తంగా 30 కేటగిరీల్లో 22,722 బిల్లర్లకు చెల్లింపులు చేసే అవకాశం వినియోగదారులకు లభిస్తుంది. అయితే ఈ సదుపాయం దేశవ్యాప్తంగా ఒకేసారి అందరికీ కాకుండా దశలవారీగా అందుబాటులోకిరానుంది. వాట్సాప్ హోమ్ స్క్రీన్ పైభాగంలో కనిపించే ఐఎన్‌ఆర్ గుర్తుద్వారా బిల్ పేమెంట్ విభాగాన్ని యాక్సెస్ చేయవచ్చు. అక్కడినుంచి బిల్లుల చెల్లింపులతోపాటు సంబంధిత ఖాతాలను నిర్వహించుకో వచ్చు. ఒకే బిల్లర్ వద్ద ఒకటికంటే ఎక్కువ ఖాతాలు ఉన్న వినియోగదారులు వాటిని ఒకేప్రొవైడం కింద నిర్వహించుకునే సదుపాయం కూడా ఉంటుంది.

## వరుసగా నాలుగో రోజు నష్టాల్లో స్టాక్ మార్కెట్లు




**ముంబయి, సెప్టెంబరు 3:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో సెషన్‌లోనూ నష్టాలతో ముగిశాయి. బ్యాంకింగ్, రియల్టీ షేర్లలో కొనుగోళ్లు జరిగినప్పటికీ ఐటీ, ఆటో తదితర రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి సూచీలను దిగజార్చింది. ముడిచమురు ధరలు అధిక స్థాయిలో ఉండటం, మధ్యప్రాచ్యంలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగుతుండటంతో ఇన్వెస్టర్లలో అప్రమత్తత నెలకొంది. బిఎస్ఇ సెన్సెక్స్ 417.49 పాయింట్లు తగ్గి 76,152.86 వద్ద స్థిరపడితే నిఫ్టీ 41 పాయింట్లు క్షీణించి 23,873.45 వద్ద ట్రేడింగ్‌ముగించింది. వరుసగా నాలుగు సెషన్లలో సెన్సెక్స్ 1.44 శాతం, నిఫ్టీ 1.25 శాతం చొప్పున నష్టపోయాయి.ముడిచమురు భయాలుబ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు సుమారు 96 డాలర్లకు చేరడం మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపింది. ఇంధన సరఫరాల్లో అంతరాయాలపై ఆందోళనలు కొనసాగడంతో ద్రవ్యోల్బణం, బాండ్ ఈల్డ్స్, భారత్ బాహ్య రంగ సమతుల్యతపై ఇన్వెస్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మరోవైపు ఆర్‌బిఐ ప్రత్యేక ఫారెక్స్ స్వాప్ పథకం చివరి పది రోజుల్లో భారత బ్యాంకులు 60 బిలియన్ డాలర్లకు పైగా సమీకరించడంతో బ్యాంకింగ్ షేర్లు మార్కెట్ ట్రెండ్‌కు భిన్నంగా రాణించాయి. నిఫ్టీలో మహీంద్రా అండ్ మహీంద్రా 1.25 శాతం, ఇన్ఫోసిస్ 0.85 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.81 శాతం చొప్పున నష్టపోయి సూచీపై ఒత్తిడి పెంచాయి. బిఎస్ఇ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.15 శాతం, బిఎస్ఇ 250 స్మాల్‌క్యాప్ సూచీ 1.01 శాతం లాభపడ్డాయి. బిఎస్ఇలో 2,545 షేర్లు లాభపడగా, 1,778 షేర్లు నష్టపోయాయి. 228 షేర్లు మార్పులేకుండా ముగిశాయి. నవంబర్ సెటిల్‌మెంట్ బ్రెంట్ ముడిచమురు ఫ్యూచర్స్ ధర 1.21 డాలర్లు పెరిగి బ్యారెల్‌కు 96.84 డాలర్లకు చేరింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి బలపడింది. రూపాయి 94.5900 వద్ద ట్రేడవగా గత సెషన్‌లో 94.7300 వద్ద ముగిసింది.అక్టోబర్ 5, 2026 సెటిల్‌మెంట్ ఎంసీఎక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ 0.74 శాతం పెరిగి 10 గ్రాములకు రూ.1,53,533కు చేరాయి. ఆర్‌బిఎల్ బ్యాంక్ 4.80 శాతం దూసుకెళ్లింది. యూరో టైటన్ బయోటెక్ 4.91 శాతం వెల్‌స్పన్ కార్ప్ 4.26 శాతం పెరిగింది. ఓ విదేశీ బ్రోకరేజ్ సంస్థ రేటింగ్‌తో కవరేజీ ప్రారంభించి రూ.3,250 టార్గెట్ ధరను ప్రకటించింది.ఎక్స్‌టీజీ గ్లోబల్ ఇన్ఫోటెక్ 5.11 శాతం లాభపడింది. ఐపిఒల పరంగాచూస్తే రేస్ ఆఫ్ బిలీఫ్ సంస్థకు సాయంత్రం 5 గంటల వరకు 31,37,810 షేర్లకు గాను 33,77,36,692 షేర్లకు బిడ్లు వచ్చాయి. దీంతో ఇష్యూ 107.63 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ఇష్యూ ధరల శ్రేణి రూ.227-239గా ఉంది. కనీసం 62 షేర్లకు, ఆ తర్వాత వాటి గుణిజాల్లో బిడ్ వేయాల్సి ఉంటుంది. దీపా జ్యువెలర్స్ 1,85,20,085 షేర్లకు గాను 78,85,39,164 షేర్లకు బిడ్లు వచ్చాయి. ఇష్యూ 42.58 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ధరల శ్రేణి రూ.168-177గాప్రకటించింది. కనీసం 84 షేర్లకు, ఆ తర్వాత వాటి గుణిజాల్లో బిడ్ చేయవచ్చు. రెండు ఐపీఓలు సెప్టెంబర్ 1న ప్రారంభమై గురువారం ముగిసాయి.

## ఎన్‌ఆర్‌ఐల నుంచి రూ.33,975 కోట్లు ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ సేకరణ




**ముంబయి, సెప్టెంబర్ 3:** రిజర్వుబ్యాంకు ప్రవేశపెట్టిన ఎఫ్‌సిఎన్నార్బీ స్వాప్ విండో కింద ఎన్‌ఆర్‌ఐ ఖాతాదారుల నుంచి ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ సుమారు 3.57 బిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.33, 975 కోట్లు సమీకరించింది. ఈ వివరాలను సెప్టెంబర్ 3న బిఎస్‌ఇకి ఇచ్చిన నియంత్రణ సంస్థల దాఖలులో బ్యాంక్ వెల్లడించింది. జూన్ 30, 2026 నాటికి బ్యాంక్ మొత్తం డిపాజిట్ బేస్‌లో ఈ సమీకరణ దాదాపు 11 శాతానికి సమానం. ఇదే సమయంలో బ్యాంక్‌కు చెందిన ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్ బ్యాంకింగ్ యూనిట్ (ఐబియూ) సుమారు 2.60 బిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.24,720 కోట్లు విలువైన రుణకల్పనకు ముందుకువచ్చింది. ఆర్‌బిఐకి చెందిన ఫారిన్ కరెన్సీ నాన్‌రెసిడెంట్ (బ్యాంక్) డిపాజిట్ ఆర్బీఐకి చెందిన ఫారిన్ కరెన్సీ నాన్ రెసిడెంట్ (బ్యాంక్) డిపాజిట్ స్వాప్ విండో కింద ఈ నిధులను సమీకరించారు. నిర్దేశిత నిబంధనలకు అనుగుణంగా అర్హత కలిగిన ఎన్‌ఆర్‌ఐ ఖాతాదారుల నుంచి బ్యాంకులు విదేశీ కరెన్సీ డిపాజిట్లను సమీకరించేందుకు ఈ సదుపాయం వీలు కల్పిస్తుంది. ఈ నిధుల సమీకరణతో ఐడిఎఫ్సీ ఫస్ట్ బ్యాంక్ డిపాజిట్ బేస్‌కు ఊతం లభించింది. బ్యాంక్ వెల్లడించిన రూపాయి విలువలను ఆగస్టు 31, 2026న అమల్లో ఉన్న మారకపు రేటు ఆధారంగా లెక్కించినట్లు తెలిపింది. ఎఫ్సీఎన్నార్బీకింద సమీకరించిన నిధుల వివరాలు తాత్కాలికమైనవని, ఆడిట్ చేయనివని బ్యాంక్ స్పష్టం చేసింది. ఎన్‌ఆర్‌ఐల నుంచి 3.57 బిలియన్ డాలర్ల నిధుల సమీకరణ, ఐబియు ద్వారా 2.60 బిలియన్ డాలర్ల రుణకల్పనతో విదేశీ కరెన్సీ డిపాజిట్లు, అంతర్జాతీయ బ్యాంకింగ్ కార్యకలాపాల్లో బ్యాంక్ విస్తరిస్తున్న కార్యకలాపాలను సూచిస్తోంది.

## వేతన ఖాతాదారులకు ఎస్‌బిఐ షాక్




**ముంబయి, సెప్టెంబరు 3:** భారతదేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాలరీ ప్యాకేజీ ఖాతాదారులకు సడెన్ షాక్ ఇచ్చింది. ఈ కేటగిరీ ఖాతాదారులు ఎస్‌బిఐ డెబిట్ కార్డును ఉపయోగించి ఇతర బ్యాంకు ఎటిఎంలు, డిపాజిట్‌కమ్ విత్‌డ్రాయల్ మెషిన్లనుంచి నుంచి చేసుకునే ఉచిత ఎటిఎం ట్రాన్సాక్షన్లపై పరిమితులు విధించింది. ఇప్పటివరకు ఎస్‌బిఐ శాలరీ ప్యాకేజ్ అకౌంట్స్ కింద ఈ డెబిట్ కార్డులతో ఇతర బ్యాంకు ఎటిఎంలలో నెలవారీగా ఉచితంగా 10 సార్లు నగదు విత్‌డ్రా చేసుకునేందుకు అవకాశం ఉండేది. ఇప్పుడు ఆ పరిమితిని 5కు తగ్గించింది. ఈ పరిమితి ఫైనాన్షియల్, నాన్ ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్లు రెండింటికీ వర్తిస్తుంది. కొత్త రూల్స్ 2026, అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. ఇక ఈ ఉచిత లావాదేవీల పరిమితి దాటితే బ్యాంక్ తమ శాలరీ ప్యాకేజ్ అకౌంట్ హోల్డర్లకు ఛార్జీలు విధించనుంది. ఇక్కడ నెలవారీగా 5 ట్రాన్సాక్షన్ల లిమిట్ దాటితే అదనంగా చేసే ఒక్కో ట్రాన్సాక్షన్‌పై రూ. 23 ప్లస్ జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. ఇదే సమయంలో నాన్ ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్లకు అయితే రూ. 11 ప్లస్ జీఎస్టీ ఛార్జీ పడుతుంది. ఈ కొత్త రూల్స్ కేవలం శాలరీ అకౌంట్ హోల్డర్లకే ఉండగా, ఇతర సాధారణసేవింగ్స్ అకౌంట్లకు సంబంధించి రూల్స్‌లో ఎలాంటి మార్పులు చేయలేదు. ఇక్కడ నెలవారీ ఉచిత లావాదేవీలు, సర్వీస్ ఛార్జీలు వంటివి గతంలో ఉన్నవే వర్తించనున్నాయి. మరోవైపు ఎస్‌బిఐ ఎటిఎంలలో కస్టమర్లు ప్రతి నెలా 10 ఉచిత ట్రాన్సాక్షన్లు చేసుకోవచ్చు. ఇతర బ్యాంకు ఎటిఎంలలో 5 వరకు ఫ్రీ క్యాష్ విత్‌డ్రా ట్రాన్సాక్షన్లకు అనుమతి ఉంటుంది. ఇది సాధారణ కస్టమర్లకు వర్తిస్తుంది. మరోవైపు ఎస్‌బిఐ అన్ని రకాల శాలరీ ప్యాకేజీ అకౌంట్ హోల్డర్లు.. ఎస్బీఐ ఎటిఎంలలో అపరిమిత ట్రాన్సాక్షన్లు చేసుకోవచ్చు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

# ఆశ్రమ పాఠశాలల్లో ప్రభుత్వ మెనూ తప్పనిసరిగా అమలు చేయాలి.

**ఈర్లపల్లి ఆశ్రమ పాఠశాలలో లోపాలపై కలెక్టర్ అసంతృప్తి.**

**పోలవరం జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 3 ప్రభాత వార్త.** పోలవరం జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం రాత్రి రంపచోడవరం మండలం



ఈర్లపల్లి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్.. పాఠాలు అర్థమవుతున్నాయా, ప్రతిరోజూ మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందిస్తున్నారా, పాఠశాలలో మౌలిక సదుపాయాలు సక్రమంగా ఉన్నాయా అనే అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. పాఠ్యాంశాలను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించాలని, అవసరమైతే ఒకటికి రెండుసార్లు వివరించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆశ్రమ పాఠశాలకు సరఫరా చేస్తున్న నిత్యావసర సరుకులు, పాలు, గుడ్లు, కోడి మాంసం, కూరగాయల నాణ్యత, సరఫరా విధానంపై కలెక్టర్ ఆరా తీశారు. ఆహార పదార్థాల నాణ్యతా ప్రమాణాలపై తగిన పర్యవేక్షణ లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్‌ఎం ఎస్. రాజేశ్వరి గైరాజరుపై, డిప్యూటీ వార్డెన్ కె. అనురాధ విధుల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం, ఆహార



నాణ్యతపై పర్యవేక్షణ లోపాలపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌ను కలెక్టర్ ఆదేశించారు. నిబంధనలు పాటించని సరఫరాదారులపై చర్యలు తీసుకుని, అవసరమైతే బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, మెరుగైన విద్యా బోధన, అవసరమైన మౌలిక సదుపాయాలు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.


తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
రాజమహేంద్రవరం | శుక్రవారం 04 సెప్టెంబర్ 2026 | I


## జిమ్ ట్రైనర్ సతీష్ రెడ్డి సంచలన హత్య కేసులో నలుగురి అరెస్టు

**--మార్ఫింగ్ ఫొటోలే హత్యకు కారణం, అదనపు ఎస్పీకిషోర్ కుమార్**



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 3 (ప్రభాత వార్త):** కాకినాడ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి భానుగుడి సెంటర్‌లో ఆగస్టు 26 తెల్లవారు జామున 2 గంటల సమయంలో జరిగిన జిమ్ ట్రైనర్ కొడమాటి సతీష్‌రెడ్డి సంచలన హత్య కేసును పోలీసులు ఛేదించి నలుగురు నిందితులను అరెస్టు చేశారు. గురువారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో కాకినాడ అదనపు ఎస్పీ, ఇన్‌చార్జి ఎస్‌డీపీవో డాక్టర్ మహంతి కిషోర్‌కుమార్ వివరాలు వెల్లడించారు. ఆగస్టు 26న చార్మినార్ టీ సెంటర్ వద్ద సతీష్‌రెడ్డిపై బొందల సాయికిరణ్, ఇంటి సత్యనారాయణ, ప్రయాగ దుర్గాప్రసాద్, ఇంటి ఆదికృష్ణ దాడి చేసి హత్య చేసినట్లు దర్యాప్తులో తేలింది. సాయికిరణ్‌కు సంబంధించిన మార్ఫింగ్ ఫొటోలను సతీష్‌రెడ్డి అతని ప్రియురాలికి పంపడంతో ఏర్పడిన విభేదాలే హత్యకు కారణమని పోలీసులు తెలిపారు. నిందితులు నేరం అనంతరం పరారయ్యారు. దుర్గాప్రసాద్ రైల్వే స్టేషన్ పార్కింగ్‌లో ఉంచిన ఎపి 05 డి ఎన్ 8800 బుల్లెట్‌ను తీసుకునేందుకు వచ్చిన నలుగురిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వారి నుంచి నాలుగు సెల్‌ఫోన్లు, బుల్లెట్ మోటార్‌సైకిల్, ఘటన సమయంలో ధరించిన దుస్తులను స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన పోలీసులను ఎస్పీ జి. బిందుమాధవ్ అభినందించారు.

## నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా.. 1,500 ఉద్యోగాలు!

**40 కంపెనీల్లో అవకాశాలు.. సెప్టెంబర్ 9న నిర్వహణ**

**కలెక్టర్ కె. దినేష్‌కుమార్**



**రంపచోడవరం, సెప్టెంబర్ 3: ప్రభాతవార్త.** పోలవరం జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సెప్టెంబర్ 9న రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కె. దినేష్‌కుమార్ తెలిపారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 40 ప్రముఖ కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొంటాయని, వివిధ కేటగిరీల్లో సుమారు 1,500 ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులకు ఉద్యోగం, విద్యార్హతలను బట్టి నెలకు రూ.15 వేల నుంచి రూ.50 వేల వరకు వేతనం లభించే అవకాశం ఉందన్నారు. పదో తరగతి నుంచి పోస్టు గ్రాడ్యుయేషన్ వరకు విద్యార్హతలు కలిగిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు ఆధార్‌కార్డు, విద్యార్హత ధ్రువపత్రాలు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, వాటి జిరాక్స్ ప్రతులను వెంట తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని నిరుద్యోగ యువత జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకుని ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె. లచ్చారావు, మేనేజర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## యల్లారావు హత్య కేసులో ముగ్గురి అరెస్ట్



**రామచంద్రపురం, సెప్టెంబర్ 03 (ప్రభాత వార్త):** రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆగస్టు 24న జరిగిన తంగేటి యల్లారావు హత్య కేసులో ఏ–2 నుంచి ఏ–4 వరకు ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. రేవు పవన్‌కళ్యాణ్ (28), రేవు వీరబాబు (26), కొమరపు తరుణ్‌కుమార్ (26)లను బుధవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు దర్యాప్తులో ఏ–1 ఉమాదేవితో పవన్‌కళ్యాణ్‌కు పరిచయం ఉన్నట్లు, యల్లారావును హత్య చేసేందుకు ఇద్దరూ కలిసి పథకం వేసినట్లు పోలీసులు తెలిపారు. పథకం ప్రకారం పవన్‌కళ్యాణ్ తన తమ్ముడు వీరబాబు, బావమరిది తరుణ్‌కుమార్‌లను యల్లారావు ఇంటికి తీసుకెళ్లి, తాను బయట కాపలా ఉన్నట్లు వెల్లడించారు. ఇంట్లో ఉమాదేవితో కలిసి ఇద్దరూ యల్లారావును పట్టుకోగా, ఉమాదేవి రాయితో దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం వీరబాబు, తరుణ్‌కుమార్‌లు కూడా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన యల్లారావు మృతి చెందినట్లు పేర్కొన్నారు. నేరాన్ని ఉమాదేవిపై వేసేందుకు పథకం వేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. సీసీ కెమెరా దృశ్యాలు, కాల్‌డేటా, ఇతర ఆధారాల ఆధారంగా నిందితులను గుర్తించి అరెస్టు చేసినట్లు సీఐ ఎం.వెంకటనారాయణ, ఎస్ఐ నాగేశ్వరరావులు తెలిపారు.

## పూల వ్యర్థాలతో మహిళలకు సరికొత్త ఉపాధి బాట

**2027 పుష్కరాల నాటికి మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి: ఎంపీ పురందేశ్వరి**



**కడియం, సెప్టెంబర్ 3 ం(ప్రభాతవార్త)** ఆలయాల్లో లభించే పూల వ్యర్థాలను సద్వినియోగం చేసి అగరబత్తీలు, అత్తర్లు, సుగంధ తైలాలు తదితర ఉత్పత్తులను తయారు చేయడం ద్వారా మహిళలకు ఉపాధి కల్పించాలని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. 'టెంపుల్ ఎసెన్షియల్స్--రాజమహేంద్రవరం' పేరుతో ప్రత్యేక బ్రాండ్‌ను అభివృద్ధి చేసి, 2027 గోదావరి పుష్కరాల నాటికి భక్తులు, పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కడియంలోని జీఎన్‌ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఎలీప్, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో కన్నౌజ్ ఎఫ్ఎఫ్‌డీసీ సాంకేతిక సహకారంతో నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో మూడో రోజు ఎంపీ పాల్గొన్నారు. శిక్షణ పొందుతున్న 35 మంది మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. మహిళలు రుణాలు పొందే స్థాయికే పరిమితం కాకుండా సొంత పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. శిక్షణ అనంతరం పరిశ్రమల ఏర్పాటుకు స్థలం, యంత్రాలు, రుణాలు, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పుష్కరాలకు వచ్చే భక్తులను మహిళా సంఘాల ఉత్పత్తులకు మార్కెట్‌గా వినియోగించుకోవాలని సూచించారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ స్థానిక వనరులతో మహిళలకు స్థిరమైన జీవనోపాధి కల్పించడమే కార్యక్రమం లక్ష్యమన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ పూలు, కొబ్బరి పీచు, అరటి తదితర ముడిసరుకులతో విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేయాలని సూచించారు. మహిళా పారిశ్రామికవేత్తల కోసం 20 ఎకరాల్లో పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎఫ్‌డీసీ డైరెక్టర్ శక్తి వినయ్ శుక్లా, ఎలీప్ అధ్యక్షురాలు కె.రమాదేవి, సహాయ కలెక్టర్లు, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన ఆఖరి మండల ప్రజా పరిషత్ సమావేశం

**-ఎంపీటీసీ సభ్యుల సన్మాన కార్యక్రమం**



**కొత్తపేట, సెప్టెంబర్ 03, (ప్రభాతవార్త)** కొత్తపేట మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు మార్గన గంగాధరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ నెల 24 తేదీతో ఎంపీటీసీ సభ్యులు లకు పదవీ కాలం ముగియ నున్న సందర్భంగా ఎంపిటిసి సభ్యులు అందరికీ పూలమాలు శాలువాలు మెమోటోలు ఘనముగా సత్కరించారు ఈ సందర్భముగా 5 సంవత్సరలు ప్రతి సమావేశానికి విచ్చేసి సహకరించిన ఎంపిటిసి సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు ఈ సందర్భంగా ప్రమోషన్ మీద వెళ్లిన నరేష్ ఘనంగా సత్కరించారు ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా గౌరవ ఆర్డిఓ ఎమ్మార్వో ఎండిఓ హరి కృష్ణారెడ్డి గౌరవ ఎంపిటిసి సభ్యులు మాజీ సర్పంచులు అధికారులు పాల్గొన్నారు

# పిఠాపురంలో..

# 'అధికార రాజ్యం'!

**ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం**

- పనికో రేటు.. ఫైలుకో బేరం అంటూ ఆరోపణలు
- పవన్ మార్కు పాలనకు కొందరు అధికారులే అడ్డంకా?
- పవన్ పాలనకు మచ్చ తెస్తున్నారంటూ జన సైనికుల ఆవేదన

**పిఠాపురం, సెప్టెంబర్ 3( ప్రభాతవార్త)** ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్‌కళ్యాణ్ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నా.. నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. వివిధ శాఖల అధికారులకు ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ సమస్యలను పరిష్కరించకుండా కొర్రీలు, నిబంధనల పేరుతో కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు సంబంధించి కూడా కొందరు అధికారులు, బిల్లులు చెల్లించకుండానే ముందస్తు వసూళ్లకు పాల్పడుతున్నారనే విమర్శలు జనసేన శ్రేణుల్లోనే వ్యక్తమవుతున్నట్టు సమాచారం. పనులు మంజూరు చేయించడం నుంచి బిల్లులు, అనుమతుల వరకు 'బేరసారాలు' సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### ఫిర్యాదులు.. ఫైళ్లకే పరిమితమా?

పోలీసు, రెవెన్యూ, రవాణా, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, జలవనరులు, దేవాదాయ, మున్సిపల్, సహకార తదితర శాఖల్లో కొందరు అధికారుల పనితీరుపై ఫిర్యాదులు వచ్చినా చర్యలు కనిపించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఫిర్యాదులపై విచారణ కమిటీలకు సమాచారం అందుతున్నప్పటికీ రాజకీయ సిఫార్సులతో వ్యవహారం సద్దుమణిగిపోతోందనే ఆరోపణలూ వినిపిస్తున్నాయి.

### అధికారుల బదిలీలు ఎప్పుడు..?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు దగ్గర పడుతున్నా, కొంతమంది అవినీతిఅధికారుల బదిలీలు చేపట్ట లేదని పలువురు



విమర్శిస్తున్నారు. ఆయా స్థానాల్లో పాతుకుపోయిన అధికారులు, పనికో రేటు... ఫైలుకో బేరం పెడుతూ అక్రమార్జనకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. ఇటువంటి అవినీతి అధికారుల కారణంగా పవన్ పాలనకు మచ్చ తెస్తున్నారనే ఆవేదన జనసైనికుల్లో వ్యక్తమవుతోంది.

### నిఘా ఏది...?

పిఠాపురం వంటి కీలక నియోజకవర్గం లో అవినీతి ఆరోపణలపై అవినీతి నిరోధక శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ వంటి సంస్థలు సమగ్రంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఫిర్యాదులు వస్తున్నప్పటికీ విచారణలు కనిపించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అవినీతి అధికారుల తీరుపై ప్రజల నుంచి ఫైవ్ మెన్ కమిటీకి ఫిర్యాదులు వెళ్తున్నా, వాటిపై చర్యలు తీసుకోవడంలో రాజకీయ సిఫార్సులు ప్రభావం చూపుతున్నాయన్న, ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి పవన్ కళ్యాణ్ నియోజకవర్గం అభివృద్ధికి భారీగా నిధులు తీసుకురావడంతో పాటు సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి పెడుతున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అధికారులు, ప్రజా ప్రతినిధుల వ్యవహార శైలి ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తుందన్న ఆవేదన ప్రజల్లో వ్యక్తమవుతోంది.

### పవన్ పాలనకు పరీక్ష!



అందుకే పిఠాపురంలో అవినీతి అధికారులపై వస్తున్నఫిర్యాదులపై స్వతంత్ర విచారణ, శాఖల వారీగా విజిలెన్స్ తనిఖీలు, అవినీతి ఆరోపణలపై అవినీతి నిరోధక శాఖ అధికారులతోదర్యాప్తు చేపట్టి తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



## ఆసుపత్రి నుంచి సురక్షితంగా గ్రామానికి చేరిన గొల్లగుప్ప బాధితులు

**14 మందికి మలేరియా ఉన్నట్టు నిర్ధారణ.. భద్రాచలంలో కొనసాగుతున్న చికిత్స.**

**గురువారం గొల్లగుప్పలో పర్యటించిన ప్రత్యేక వైద్య బృందాలు**







**చింతూరు, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:** పోలవరం జిల్లా ఎటపాక మండల పరిధిలోని గొల్లగుప్ప గ్రామంలో క్లోరోక్విన్ మాత్రల ఘటన రాష్ట్ర వ్యాప్తంగా కలకలం సృష్టించింది. ఈ ఘటనలో ఒక బాలిక మృతి చెందగా 53 మంది అస్వస్థకు గురైన విషయం అందరికీ తెలిసిందే. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించడంతోఅధికారులు అప్రమత్తం అయ్యారు. జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, చింతూరు ఐ. టీ. డి. ఏ. ప్రాజెక్ట్ అధికారి శుభం నొక్వాల్ పరిస్థితి ని పర్యవేక్షణ చేస్తున్నారు. గొల్ల గుప్ప గ్రామంపై ప్రత్యేక దృష్టి సారించారు. మన్యం లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలకు శ్రీకారం చుట్టారు. అస్వస్థతకు గురైన మొత్తం 53 మంది బాధితుల్లో 39 మందిని ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అనంతరం సురక్షితంగా గురువారం గ్రామానికి తరలించారు. దీంతో బాధితుల కుటుంబ సభ్యులు కొంత ఊరట చెందారు.
ఇదిలా ఉండగా, వైద్య పరీక్షల్లో 14 మందికి మలేరియా ఉన్నట్లు నిర్ధారణ కావడంతో వారిని భద్రాచలం ఆసుపత్రిలోనే ఉంచి మెరుగైన వైద్య చికిత్స అందిస్తున్నారు. వైద్యుల పర్యవేక్షణలో వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.
మరోవైపు గొల్లగుప్ప గ్రామాన్ని ప్రత్యేక వైద్య బృందాలు గురువారం సందర్శించి పరిస్థితిని సమీక్షించాయి. ఒకే చిన్న గ్రామములో 14 మందికి మలే రియా ఉన్నట్టు గుర్తించటంతో గ్రామంలోని ప్రజల అందరి నమూనాలు సేకరించి ఆరోగ్య పరిస్థితిపై వివరాలు సేకరించడంతో పాటు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించారు. పాఠశాల లో చిన్నారులు సైతం పాఠశాలకు హాజరు కావటంతో వైద్య బృంధాలు చిన్నారులను సైతం పరిశీలించాయి. గ్రామంలో మలేరియా వ్యాప్తి, క్లోరోక్విన్ మాత్రల వినియోగంపై ప్రత్యేక వైద్య బృందాలతో పాటు డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ విశ్వచైతన్య, ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించటంతో పాటు ఇంటి ఇంటికి వెళ్ళి ఆరోగ్య పరిస్థితి పై వివరాలు సేకరించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉన్నారని, గ్రామంలో ఎలాంటి అనారోగ్య లక్షణాలు కనిపించినా వెంటనే సమీపంలోని వైద్య సిబ్బందిని సంప్రదించాలని అధికారులు గ్రామస్తులకు సూచించారు.


## నవీన్ కుటుంబానికి ప్రభుత్వం పరిహారం ఎందుకు ప్రకటించలేదు

**అధికారుల వైఖరిపట్ల ధ్వజమెత్తిన సంతోష్ కుమార్**



**వి.ఆర్.పురం,సెప్టెంబర్ 3,ప్రభాతవార్త** ఇటీవల సంభవించిన గోదావరినది వరదలకు ఇల్లు మునిగిపోవడంతో, గుండెపోటుకు గురై మృతి చెందిన శ్రీరామగిరి యువకుడు నాళ్ళారపు నవీన్ (32) కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా ఎందుకు ప్రకటించలేదని, అధికారుల తీరుపై ఆ గ్రామ తాజా మాజీ సర్పంచ్ పులి సంతోష్ కుమార్ ధ్వజమెత్తారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కారం లక్ష్మి అధ్యక్షతన ఈ విడత ప్రజా ప్రతినిధుల చివరి సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో సంతోష్ కుమార్ మాట్లాడారు. తమ గ్రామానికి చెందిన నవీన్ మరణం పట్ల ప్రభుత్వం, అధికారులు స్పందించకపోవటం, బాధిత కుటుంబానికి ఆదుకోవకపోవటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎంపిటిసి సభ్యులు పూనెం ప్రతీఫ్ కుమార్ మాట్లాడారు. గ్రామాల్లో నెలకొని ఉన్న సమస్యలను ఏకరువు పెట్టారు. సంభందిత శాఖల అధికారుల నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపారు. ప్రజా ప్రతినిధులను సన్మానించిన జడ్.పి.టి.సి రంగారెడ్డిఇప్పటికే గ్రామ పంచాయతీ సర్పంచుల పదవీ కాలం ముగిసి, సర్పంచుల తాజా మాజీలు అవ్వగా, జడ్.పి.టి.సి, ఎంపిటిసి ల పదవీకాలం ఈ నెల 26 నుండి ముగియనుంది. దీంతో గురువారం జరిగిన సర్వసభ్య సమావేశం ఈ విడత ప్రజా ప్రతినిధులకు చివరి సమావేశం అయింది. దీంతో జడ్.పి.టి.సి సభ్యులు వాళ్ళ.రంగారెడ్డి ఎంపిపి లక్ష్మి, తాజా మాజీ సర్పంచ్ లు, ఎంపిటిసి సభ్యులకు దృశ్యాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఒకరికి ఒకరు ఆప్యాయంగా పలుకరించుకొని, గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, ఎంపిడిఓ ఇమ్మానుయేల్, ఎస్ఐ షేక్.సాదిక్, ఐకెపి ఎపిఎం సుధాకర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మాధురి విద్యాలయంలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ



**శంఖవరం సెప్టెంబర్ 3 ప్రభాతవార్త** ప్రముఖ విద్యాసంస్థ మాధురి విద్యాలయంలో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణ మొత్తం బృందావనాన్ని తలపించింది. చిన్నారి విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికలు, బలరాముని వేషధారణలో ముస్తాబై అందరినీ ఆకట్టుకున్నారు. చిన్నికృష్ణుల ముద్దుముద్దు మాటలు, చిలిపి చేష్టలు అక్కడ చేరిన తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను ఎంతగానో అలరించాయి. అనంతరం విద్యార్థులచే భక్తి గీతాలు, నృత్య ప్రదర్శనలు, కృష్ణ లీలలపై చిన్న నాటికలు ప్రదర్శించారు. ఉట్టి కొట్టే కార్యక్రమం వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా విద్యాలయం చైర్మన్ కడారి తమ్మయ్య నాయుడు మాట్లాడుతూ "పిల్లలలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంచడంతో పాటు, శ్రీకృష్ణుని బోధనలను వారికి తెలియజేయడమే ఈ వేడుకల ముఖ్య ఉద్దేశం" అని , శ్రీకృష్ణుని జీవితం మనకు ధర్మమార్గంలో నడవడం, కష్టాలను ధైర్యంగా ఎదుర్కో వడం, మంచి విలువలను పెంపొందించడం నిర్పుతుంది. విద్యార్థులు ఆయన బోధనలను తమ జీవితాల్లో ప్రచరించాలి. అని తెలిపారు ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సీతాదేవి విద్యాలయ ప్రిన్సిపల్ అడపా ఆదినారాయణ విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు మృతి

**కొద్ది నిమిషాల్లో ఇంటికి చేరే లోపే మృత్యు ఒడిలోకి.**

**మట్లపాలెంలో మిన్నంటిన రోదనలు.**





**తాళ్ళరేవు, సెప్టెంబర్3 (ప్రభాతవార్త):** వారంతా రెక్కాడితే గాని డొక్కాడని కూలి పని చేసుకునే వ్యక్తులు. పని నుంచి ఇంటికి తిరిగి వస్తూ కొద్ది నిమిషాల్లో ఇంటికి చేరుకునే లోపే ఆ వ్యక్తులను మృత్యువు కబళించింది. ఎదురుగా వస్తున్న ఆటో రూపంలో ఆ వ్యక్తుల ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి. ఒకే గ్రామ పంచాయతీకి చెందిన ముగ్గురు వ్యక్తులు మరణంతో ఆయా కుటుంబాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి. ఆయా గ్రామాల్లో కుటుంబ సభ్యుల రోదనలు ఆకాశాన్నంటాయి. కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పటవల పంచాయతీ మట్లపాలెం కొత్తూరు వద్ద జాతీయ రహదారి 216 పై గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు మృతి చెందిన సంఘటన పలువురిని దిగ్భ్రాంతికి గురి చేసింది. కాకినాడ నుంచి తాళ్ళరేవు వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తులు, కాకినాడ వైపు వెళ్తున్న ఆటో ఎదురు ఎదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఘటనా స్థలంలో ద్విచక్ర వాహనంపై ఉన్న మట్లపాలెం గ్రామానికి చెందిన ఇంటి కృష్ణ(29) అక్కడికక్కడే మృతి చెందాడు. కొన ఊపిరిలో ఉన్న కొత్తూరు గ్రామానికి చెందిన కొమ్మనపూడి మణికంఠ(33) రాఘవేంద్రపురం గ్రామానికి చెందిన కొండ్రు తంబి(40) తీవ్ర గాయాలతో కాకినాడలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ప్రమాదం మృతుడు మణికంఠ ఇంటి ఎదురుగా జరగడం ఆ కుటుంబ సభ్యులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఘటనా స్థలానికి కోరంగి ఎస్.ఐ. సత్యనారాయణ చేరుకుని ట్రాఫిక్ నిరోధించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కాకినాడలో ఘనంగా పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు

**-మల్లాడి రాజేంద్ర ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు**



**కాకినాడ రూరల్, సెప్టెంబరు 3 (ప్రభాత వార్త):** ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్‌కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాకినాడ నగరంలోని 31వ డివిజన్ రెల్లిపేటలో కాకినాడ పార్లమెంట్ జనసేన ఎలక్షన్ కమిటీ సభ్యుడు మల్లాడి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య రుద్రాభిషేకం, రుద్ర హోమం, ఆయుష్మ హోమం, మహా మృత్యుంజయ హోమం, దుర్గా హోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. ఈ సందర్భంగా మల్లాడి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పవన్‌కళ్యాణ్ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ మల్లాడి రాజేంద్రప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

## కాకినాడ లోఅర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన జిల్లా ఎస్పీ

### -అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 3(ప్రభాతవార్త):** కాకినాడ నగరంలో అర్ధరాత్రి జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సెప్టెంబరు 2, 3వ తేదీల మధ్య రాత్రి భానుగుడి, అన్నమ్మ ఘాటీ, డెయిరీఫాం సెంటర్, సర్పవరం సెంటర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి వాహనాల తనిఖీలు, పోలీసుల గస్తీ విధులను పరిశీలించారు.నగరంలో నేరాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా గస్తీని మరింత ముమ్మరం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులు తమ వైఖరిని మార్చుకోవాలని ఎస్పీ హెచ్చరించారు. నేరస్తులు, రౌడీ మూకలు, అలవాటు పడిన నేరస్తులపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అవసరమైతే నేర చరిత్రను పరిగణనలోకి తీసుకుని పీడీ యాక్ట్ ప్రయోగించి జైలుకు తరలిస్తామని తెలిపారు. కాకినాడ జిల్లాలో శాంతిభద్రతలకు భంగం కలిగించే ఎవరినీ ఉపేక్షించబోమని హెచ్చరించారు.తనిఖీల్లో ఎస్పీ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ ఎస్పీ వెంట ఉన్నారు.

## ప్రజా సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం నిర్విరామ కృషి

### - రెండు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, సెప్టెంబర్03, (ప్రభాతవార్త)**రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం నిర్విరామంగా కృషి చేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు దీనికి నిదర్శనం కళ్ళ ముందు కనిపిస్తున్న అభివృద్ధి సంక్షేమాలేనని నొక్కి వక్కాణించారు గురువారం పలివెలలో ఆయన 161 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంత కుమారి ఆర్డీఓ జి వి వి సత్యనారాయణ కొత్తపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లి మంగాదేవి భీమారావు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం తో కలిసి పాల్గొన్నారు లబ్ధిదారులకు రెండు సెంట్లు చొప్పున ఇండ్ల స్థలాలను పొజిషన్స్ చూపించి అందజేశారు ప్రజలందరి ఆశీర్వాదంతో అధికారంలోకి వచ్చిన ప్రధాని మోదీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి కోసం అనునిత్యం పాటుపడుతుందన్నారు పలివెలలో ఇళ్ల పట్టాల పంపిణీ అంశంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన దుర్మార్గాలను ఆయన కళ్ళకు కట్టినట్లు వివరించారు 2009 లో పట్టాలు అందించడం కోసం ఇష్టానుసారంగా వాళ్లకు నచ్చిన వాళ్లకు ఇవ్వడం కోసం రెండు సెంట్లు రద్దు చేసి సెంటున్నర సెంటు పావు మాత్రమే కొత్తగా పట్టాలు ఇవ్వాలని ప్రయత్నం చేశారన్నారు తెలుగుదేశం నాయకులు ఈ అంశంపై పోరాడి జైలుకు కూడా వెళ్లారని హైకోర్టుకు వెళ్లి కేసు వేసి విజయం సాధించారని పేర్కొన్నారు నేడు లబ్ధిదారులకు 2సెంట్ల చొప్పున 161 మందికి పొజిషన్స్ చూపించడం జరిగిందన్నారు

## ప్రతీ రైతుకి ఫార్మర్ ఐ డి తప్పనిసరి. మండల వ్యవసాయాధికారి, ఈశ్వర రావు.



**రౌతులపూడి, సెప్టెంబర్ 3(ప్రభాత వార్త)** ప్రభుత్వంద్వారా లబ్ది పొందాలంటే ప్రతీ రైతుకి తప్పని సరిగా ఫార్మర్ ఐ డీ ఉండాలని, లేని పక్షంలో ధాన్యం కూడా ప్రభుత్వంకొనుగోలు చేయదని మండల వ్యవసాయ అధికారి ఈశ్వర రావు తెలిపారు. గురువారం ఆయన పొలాలను దర్శించి రైతులతో మాట్లాడుతూ వరి లో గడ్డి వున్నప్పుడు బ్యూటో క్లోరో 50%,1-1, 5మిల్లీ లీటర్ 25కిలోల పొడి ఇసుకలో కలిపి నాటిన మూడు నుంచి ఐదు రోజుల్లో పలచగా నీరుపెట్టి సమానంగా ఎకరాకు వెదజల్లాలన్నారు.అదేవిదంగా వరివేసిన 15నుంచి 20రోజులు అయినప్పుడు గడ్డి, తుంగ,ఆకుజాతి జూజా కలుపు మొక్కలు ఉంటే బిస్ ఫైర్ బ్యాక్ సోడియం , అనే మందు ని 80నుంచి 120 మిల్లీ లీటర్ చొప్పున ఎకరాకు పిచికారి చేయాలని తెలిపారు.

## తాళ్లరేవులో జనసైనికుల సేవలు.

### -అగ్ని బాధితులకు అండగా నిలిచిన జనసేన.-పంచాయతీ రాజ్ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులకు సత్కారం. ముమ్మిడివరం, కాకినాడ నుంచి తరలివచ్చిన నేతలు.



**తాళ్లరేవు, సెప్టెంబర్ 3 (ప్రభాతవార్త):** ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా తాళ్లరేవు మండలంలో జన సైనికులు పలు సేవా కార్యక్రమాలు చేశారు. ముందుగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కోసం ఏర్పాటుచేసిన బ్రహ్మర్షి కార్యక్రమంలో భోజనాలు అందించారు. తాళ్లరేవు పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక అధికారి సి.హెచ్.ఎస్.ఎం. ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి బండి రాజేంద్ర ల సేవలను కొనియాడుతూ సత్కరించారు. పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాలు పంపిణీ చేశారు. సీతారామపురంలోని రిలయన్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమా మనోవికాస కేంద్రం చిన్నారులకు కేక్ కట్ చేయించారు. పిల్లలకు, సిబ్బందికి పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఇటీవల తాళ్లరేవు పంచాయతీ సంత మార్కెట్లో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు పార్టీ తరఫున సేకరించిన రూ. 66 వేల నగదు, 120 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ పార్లమెంట్ ఎలక్షన్ కమిటీ సభ్యులు మల్లాడి రాజేంద్రప్రసాద్, ఉభయగోదావరి జిల్లా కోఆర్డినేటర్ ముత్యాల జయలక్ష్మి, మండలం నాయకులు అత్తిలి బాబూరావు, ఏల్ల వేల, ఎలిసే నాగేశ్వరరావు, ముత్యాల సత్య మణికంఠ, సూరంపూడి కుమార్, సుందరపల్లి సత్యనారాయణ, పోతుల రాజు, చిక్కం రామచంద్రుడు, నడవ వెంకటరమణ, కొత్తల ధనుంజయ, పోలు శ్రీనివాస, కొడికట్లపడి బాబ్జి, కొండేటి ఈశ్వరరావు, చింతపల్లి రమేష్, నంది సంతోష్, వడగన సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వ్రత టోకెన్ల కోసం.. భక్తుల వెతలు!

### మధ్యాహ్నం నుంచి మండుటెండలో మహిళల నిరీక్షణ

### టోకెన్లపై స్పష్టత కరువు.. సహనం కోల్పోయి మహిళల ధర్నా

### అధికారులను నిలదీసిన మహిళా భక్తులు

**ఎస్సై ఆగ్రహంతో మరింత ఉద్రిక్తత**



**పిఠాపురం, "సెప్టెంబర్ 3( ప్రభాతవార్త )** పవిత్ర పాదగయ పుణ్యక్షేత్రంలో వరలక్ష్మీ వ్రతం టోకెన్ల కోసం వచ్చిన మహిళా భక్తులు గురువారం చేదు అనుభవం ఎదురైంది. టోకెన్ల కోసం మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు మండుటెండలోనే గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చిందని మహిళా భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. టోకెన్లు ఎప్పుడు ఇస్తారో, ఎంతమందికి అందిస్తారో స్పష్టత లేకపోవడంతో భక్తుల్లో ఆందోళన పెరిగింది. చాలాసేపు వేచి చూసిన మహిళలు చివరకు సహనం కోల్పోయి ఆలయ ప్రాంగణంలో ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా పిఠాపురం ఎస్సై మణికుమార్ మహిళా భక్తులపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారిందని భక్తులు ఆరోపించారు. దీంతో మహిళలు అధికారులను చుట్టుముట్టి టోకెన్ల పంపిణీపై నిలదీశారు.

**'నిజమైన భక్తులకే టోకెన్లు ఇవ్వాలి'**

వరలక్ష్మీ వ్రతం ఆచరించేందుకు ఎంతో భక్తిశ్రద్ధలతో వచ్చిన తమను గంటల తరబడి పడిగాపులు కాయించడం తగదని మహిళలు వాపోయారు. "నిజమైన భక్తులకు టోకెన్లు ఇవ్వాలి.. అసలు ఎవరికి టోకెన్లు ఇస్తున్నారు?" అంటూ ఆలయ అధికారులను ప్రశ్నించారు. టోకెన్ల పంపిణీలో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. టోకెన్ల కోసం ఆలయ మండపంలోనే పలువురు మహిళా భక్తులు అలసిపోయి నిల్చున్న దృశ్యాలు కనిపించాయని వారు పేర్కొన్నారు. భక్తుల సౌకర్యాలు పట్టించుకోకుండా గంటల తరబడి నిరీక్షింపజేయడం ఏమిటని ప్రశ్నించారు.

**డిప్యూటీ సీఎంకు ఫిర్యాదు చేస్తాం**

పాదగయ వంటి ప్రముఖ పుణ్యక్షేత్రంలో భక్తులకు ఇలాంటి పరిస్థితులు రావడం బాధాకరమని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. టోకెన్ల పంపిణీ వ్యవహారంపై ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్‌కు ఫిర్యాదు చేస్తామని నినాదాలు చేశారు. భక్తుల మనోభావాలను గౌరవించి, వరలక్ష్మీ వ్రతం టోకెన్ల పంపిణీ పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆలయ అధికారులు మాత్రం పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టారు.

## ఎమ్మెల్యే చొరవతో పేద కుటుంబానికి రూ లక్ష సి యం రిలీఫ్ ఫండ్.



**చింతూరు సెప్టెంబర్ 3 ప్రభాత వార్త.** కూనవరం మండలం పోచవరం గ్రామానికి చెందిన పడియాల కల్యాణ అనే మహిళ ఆపరేషన్ నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ లక్ష రూపాయలు మంజూరి చేయించి రంపచోడవరం ఎమ్మెల్యే మిర్యాల శిరీష దేవి, ఆమె భర్త మడం విజయభాస్కర్ మానవత్వాన్ని చాటుకున్నారు. నిరుపేద కుటుంబం కావటంతో హైదరాబాద్ లో తక్షణం ఆపరేషన్ కు ఈ కుటుంబానికి సి యం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎల్ ఓ సి ఇప్పించి ఆ కుటుంబానికి బాసటగా నిలిచారు.

# సంప్రదాయ కళల పరిరక్షణకు కృషి చేయాలి :

### -ముక్కామలలో కంచి కామకోటి నాదస్వర,డోలు పాఠశాల ప్రారంభించిన ఎమ్మెల్యే గిడ్డి..



**అంబాజీపేట, సెప్టెంబర్ 3,(ప్రభాతవార్త):** సంప్రదాయ కళలు,సంగీతాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సూచించారు. మండలంలోని ముక్కామల గ్రామంలో కంచి కామకోటి నాదస్వర, డోలు పాఠశాలను ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంచి కామకోటి 70వ పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారి దివ్య అనుగ్రహంతో ఈ పాఠశాల ప్రారంభించబడిందన్నారు. 2023లో ముక్కామలలో నిర్వహించిన బ్రహ్మసత్రం సందర్భంగా వేద,శైవాగమ పాఠశాలలతో పాటు సంగీత పాఠశాల ఏర్పాటు చేయాలని స్వామి వారు సంకల్పించారని తెలిపారు.నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులు సాధారణ విద్యతో పాటు నాదస్వర, డోలు వంటి సంప్రదాయ వృత్తి విద్యలోనూ నైపుణ్యం సాధించాలనే లక్ష్యంతో ఈ పాఠశాలను ఏర్పాటు చేశారని చెప్పారు. నలుగురు విద్యార్థులతో ప్రారంభమైన పాఠశాల ప్రస్తుతం 41 మంది విద్యార్థులకు చేరుకోవడం అభినందనీయమన్నారు.ప్రస్తుతం సుమారు 32 మంది విద్యార్థులు నాదస్వర,డోలు విద్యతో పాటు సాధారణ పాఠశాల విద్యను కూడా అభ్యసిస్తున్నారని తెలిపారు. నిష్ణాతులైన గురువుల ఆధ్వర్యంలో కంచి కామకోటి పీఠం సహాయ సహకారాలతో పాఠశాల ప్రణాళికాబద్ధంగా కొనసాగుతోందన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించి, తాము అభ్యసించిన నాదస్వర,డోలు వాయిద్యాలు విద్యార్థులు ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

## అప్పనపల్లి మోడల్ ప్రైమరీ స్కూల్లో ఘనంగా స్పోర్ట్స్ కిట్ల పంపిణీ.



**మామిడికుదురు,సెప్టెంబర్03(ప్రభాతవార్త)** అప్పనపల్లి మోడల్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు గురువారం క్రీడా సామాగ్రి పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా ప్రముఖ దాత బాలా బ్రహ్మీ సమకూర్చిన ఈ స్పోర్ట్స్ కిట్లను,బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్‌కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు అందజేశారు.గ్రామంలోని రామాలయం వద్ద నిర్వహించిన ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వైనాల రఘురామయ్యతో కలిసి పవన్‌కుమార్ విద్యార్థులకు కిట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కంకిపాటి నరసింహారావు, మేడిచర్ల చిన్న, గెడ్డం వెంకటేశ్వరరావు, కంకిపాటి వెంకటేశ్వరరావు, అడబాల తాతకాపు, తులా గోపాలకృష్ణ, తులా నాగరాజు, అల్లూరి లక్ష్మీపతిరాజు, పోతు కాశీ తదితర గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రచయిత హమారా ప్రసాద్ వ్యాఖ్యలపై దళితుల ఆగ్రహం.



**మామిడికుదురు. "సెప్టెంబర్03 (ప్రభాతవార్త)** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పై తెలంగాణ రచయిత,న్యాయవాది హమారా ప్రసాద్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను దళిత సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ వ్యాఖ్యలను నిరసనగా గురువారం మామిడికుదురు బస్టాండ్ కూడలిలో దళితులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. హమారా ప్రసాద్ చిత్రపటాన్ని చెప్పులతో కొడుతూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ఆయనపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని, 'దళిత ద్రోహి హమారా ప్రసాద్' అంటూ పెద్దగా నినాదాలు చేశారు.అనంతరం బస్టాండ్ కూడలి నుండి నగరం పోలీస్ స్టేషన్ వరకు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. హమారా ప్రసాద్‌పై వెంటనే దేశద్రోహం కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ నగరం ఎస్.ఐ. చ.పద్మారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో దళిత నేతలు కలిగి ఆనందరావు,నల్లి దుర్గాప్రసాద్,గెడ్డం వెంకటేశ్వరరావు, నీతిపూడి చంద్రరావు, బొంతు మణిరాజు, కొల్లబత్తుల మున్నా, భూపతి వెంకటేష్,చెల్లుబోయిన విప్లవ్, నాగేశ్వరరావు,గెడ్డం రమేష్,పాలమూరి గోపాల్,విప్పర్తి రెడ్డి, నక్కా బాలకృష్ణ,బత్తుల జనార్దనరావు, నాగబత్తుల శ్రీకృష్ణ,పల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పన వేగవంతం

### -కొత్తపేట మండలంలో రూ4.44 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బండారు భూమిపూజ



**కొత్తపేట, సెప్టెంబర్ 03, (ప్రభాతవార్త)** రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామాల్లో అభివృద్ధి పనుల వేగవంతంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు కొత్తపేట మండలంలో కొత్తపేట పలివెల బిల్లకుర్రు గ్రామాల్లో సాస్కి నిధులు రూ4.44 కోట్లతో తలపెట్టిన పలు బీటీ రోడ్ల నిర్మాణ పనులకు గురువారం ఆయన రాష్ట్ర బి సి ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి కొత్తపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లి మంగాదేవి భీమరావు పాలూరి సత్యానందం తో కలిసి భూమి పూజ నిర్వహించారు కొత్తపేట తాళమ్మ రావి నుండి పనసలదొడ్డి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ50 లక్షలు పలివెల పీపీ రోడ్డు నుండి పెదపేట వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ1.16 కోట్ల పలివెల ఆర్ అండ్ బీ రోడ్డు నుండి పలివెల మార్కెట్ పలివెల పంచాయతీ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ 62 లక్షలు బిళ్ళకుర్రు నక్కవారిపేట నుండి మసాయిపేట యెలిశెట్టివారిపాలెం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ1.40 కోట్లు బిళ్ళకుర్రు దేగలవారిపాలెం బ్రిడ్జి నుండి శ్రీరాం నగర్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ76 లక్షలు మొత్తంగా మూడు గ్రామాల్లో రూ4.44 కోట్లతో అభివృద్ధి పనులకు భూమి పూజ నిర్వహించినట్లు ఆయన తెలిపారు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మండల అభివృద్ధికి మరిన్ని పనులు కూడా చేపడతామని పేర్కొన్నారుఈ భూమిపూజ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు


## ఆక్రమణలపై కఠినంగా వ్యవహరించాలి

### -కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబర్ 3( ప్రభాతవార్త)** రానున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో భక్తుల భద్రతకు విఘాతం కలిగించే ఆక్రమణలు అక్రమ నిర్మాణాలను పూర్తిగా నిర్మూలించాలని నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం నగరపాలక సంస్థ అధికారులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. దోబీ ఘాట్ నుంచి సరస్వతి ఘాట్ గౌతమి ఘాట్ సహా పలు ప్రాంతాలను సందర్శించారు. వారం రోజుల్లోగా దోబీ ఘాట్ నుంచి సరస్వతి ఘాట్ సహా మహాకాళేశ్వర టెంపుల్ వరకు ఉన్న ఆక్రమణలు అక్రమ నిర్మాణాలు పై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. భక్తులకు సురక్షిత వాతావరణాన్ని కల్పించడం రవాణా సౌకర్యార్థం గాట్ల వెంబడి ఉన్న అనధికారిక కట్టడాల దుకాణాలు పూర్తిగా తొలగించాలని పుష్కరాల సమయంలో నది స్నానాలు చేసే భక్తుల భద్రత అత్యంత ముఖ్యమని ఇందులో భాగంగా నది పరివాహక ప్రాంతాలను రక్షించడం తీరం వెంబడి ఉన్న ఆటంకాలను తొలగించడం అత్యవసరమని పేర్కొన్నారు. .ఈయన వెంట స్పెషల్ ఆఫీసర్ మహేష్ సిటీ ప్లానర్ జీవీఎస్ ఎన్ మూర్తి ఈ ఈ మాధవి ఎంహెచ్ఓ వినూత్న ఇతర అధికారులు సిబ్బంది ఉన్నారు.

## సీఎం బహిరంగసభ, హెలిప్యాడ్ కోసం స్థలాలు పరిశీలన..



**అంబాజీపేట,సెప్టెంబర్ 3, ప్రభాతవార్త):** అంబాజీపేట మండలం కె.పెదపూడిలో ఈ నెల 9న ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా చేపట్టబోయే బహిరంగ సభ, హెలిప్యాడ్ స్థలాల కోసం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా,పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణలు గురువారం పలు ప్రాంతాలను పరిశీలించారు. మాచవరం పండువారిపేట,కె.పెదపూడి ఓఎన్జిసి సైట్, ఇరుసుమండ లేఅవుట్లను పరిశీలించారు. స్థలాలకు సంబంధించిన రూట్ మ్యాప్ ను ఆర్డిఓ జీవివి సత్యనారాయణ కలెక్టర్కు చూపించారు. వవారితోపాటు కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్రావు, తాసిల్దారు బి.చినబాబు, ఎంపీడీవో బి.మమత,వీబిజీ రాంజీ ఏపీవో అడపా శ్రీ వెంకటకృష్ణ, డిప్యూటీ ఎంపీడీవోలు కె.శ్రీనివాసు, మహమ్మద్ అలీ,నియోజకవర్గ టిడిపి కో– కన్వీనర్లు మోకా ఆనందసాగర్,దాసరి వీర వెంకట సత్యనారాయణ, కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు శిరిగినీడి వెంకటేశ్వరరావు, బొంతు పెదబాబు, కూటమి నాయకులు పెదపూడి శ్రీనివాసరావు, మైపాల తాతాజీ,గుంటూరి మురళి కృష్ణంరాజు,గూడాల ఫణి,రవణం రాము, నాగాబత్తుల వెంకట సుబ్బారావు,కొప్పినీడి ఈశ్వరరావు,పెచ్చెట్టి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.ముఖ్యమంత్రి పర్యటన ఖరారు: ఎమ్మెల్యే గిడ్డి..ఈ నెల 9న ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పి.గన్నవరం నియోజకవర్గ పర్యటన దాదాపు ఖరారు అయిందని, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి సభా ప్రాంగణం, హెలిప్యాడ్ తదితర ఏర్పాట్ల కోసం జిల్లా కలెక్టర్, ఎస్పీ, వివిధ శాఖల అధికారులతో పలు ప్రాంతాలలో స్థలాలను పరిచాలించామన్నారు. స్థలం నిర్ణయం అనంతరం అధికారికంగా ప్రజలకు తెలియజేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు కూటమి శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కోరారు.

## పవన్‌కళ్యాణ్ జన్మదినం సందర్భంగామెడ్వే సంజీవి హాస్పిటల్స్ ఉచిత మెగా వైద్య శిబిరం

**కాకినాడ రూరల్ , సెప్టెంబర్ 3( ప్రభాత వార్త):** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని కాకినాడ పరిసర ప్రాంతాల్లో జనసేన నాయకుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మెడ్వే సంజీవి హాస్పిటల్స్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరానికి




స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.శిబిరంలో డాక్టర్ రతన్, హాస్పిటల్ మేనేజర్ విజయ్‌బాబు, నర్సింగ్ సిబ్బంది పాల్గొని గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తపోటు, షుగర్ తదితర ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు, ఆరోగ్య సమస్యలపై ప్రజలకు తగిన సూచనలు, సలహాలు అందించారు. అవసరమైన వారికి తదుపరి వైద్య చికిత్సపై కూడా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. 'ప్రజల ఆరోగ్యమే మా లక్ష్యం' అనే నినాదంతో మెడ్వే సంజీవి హాస్పిటల్స్ అందిస్తున్న సేవలను అభినందించారు.పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ఆనందంగా ఉందని జనసేన నాయకులు తెలిపారు. శిబిరాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన వైద్యులు, సిబ్బంది, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

## గొల్లగుప్ప గ్రామానికి 5 న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు రాక



**వి.ఆర్.పురం,సెప్టెంబర్ 3,ప్రభాతవార్త** మలేరియా మాత్రలు వికటించి మృతి చెందిన గిరిజన బాలిక మడివి జమున కుటుంబాన్ని పరామర్శించేందుకు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాస్ రావు 5 వ తేది శనివారం ఎటపాక మండలంలోని గొల్లగుప్ప గ్రామానికి రానున్నారు. గడిచిన మూడు రోజుల క్రితం వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది గొల్లగుప్ప గ్రామంలో మలేరియా మాత్రలు (క్లోరోక్విన్) పంపిణీ చేయగా, మాత్రలు తీసుకున్న మడివి జమున మృతి చెందగా, చాలా మంది చిన్నారులు తీవ్ర అస్వస్థతకు గురై తెలంగాణ రాష్ట్రం, భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొంది కోలుకున్న విషయం పాఠకులకు విదితమే. ఈ ఘటన రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించింది. ఈ మేరకు గురువారం సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పిన కిరణ్ ప్రభాతవార్త ప్రతినిధితో చరవాణి లో మాట్లాడారు. శ్రీనివాస్ రావు పర్యటన వివరాలను వివరించారు. జమున కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం, శ్రీనివాస్ రావు బృందం ఆసుపత్రిలో చికిత్స పొంది ఇళ్లకు చేరుకున్న బాధితులను పరామర్శిస్తారని చెప్పారు.

## ముస్తాబవుతున్న కె.పెదపూడి..



**అంబాజీపేట,సెప్టెంబర్ 3, (ప్రభాతవార్త):** అంబాజీపేట మండలం కె.పెదపూడి గ్రామంలో ఈ నెల 9న ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటన నేపథ్యంలో గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు సన్నాహాలు చేపట్టారు.గ్రామం మీదుగా వెళ్లే అంబాజీపేట–రావులపాలెం ప్రధాన రహదారికిరువైపులా ఉన్న మట్టి దిబ్బలు,చెత్త,పిచ్చి మొక్కలను తొలగించే పనిలో నిమగ్నమయ్యారు.డిప్యూటీ ఎంపీడీవో కంచి శ్రీనివాస్ పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శి ఎ.యామిని, గ్రామ ప్రత్యేక అధికారి కె.ధర్మప్రసాద్ లు పారిశుద్ధ్య పనులను శరవేగంగా చేపడుతున్నారు.

## రూ.11.62 కోట్లతో రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి



**అడ్డతీగల, సెప్టెంబర్ 03, ప్రభాతవార్త** అడ్డతీగల మండలంలోని మట్లపాడు, డి.భీమవరం పంచాయతీల పరిధిలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి శంకుస్థాపన చేశారు. ప్రధానంగా రూ.11.62 కోట్ల అంచనా వ్యయంతో రహదారి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాల మెరుగుదలతో ప్రజల రాకపోకలు సులభతరం కావడంతో పాటు, విద్య, వైద్యం, వ్యవసాయం, రవాణా రంగాలకు ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు జర్తా వెంకటరమణారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి స్వప్నకుమారి, ఏఎంసీ డైరెక్టర్ బలువు సత్యవతి, క్లస్టర్ ఇన్‌చార్జి గుంజిగెడ్డ గంగరాజు, కో–క్లస్టర్ ఇన్‌చార్జి బెలెం సత్యనారాయణ, టీడీపీ మండల నాయకులు వడ్డి రాంబాబు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు వంకా సతీష్, ఎడ్ల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ పి.ఆదిలక్ష్మి, జారగెడ్డ మాణిక్యాలరావు, బీరా బాలయోగి, మద్దాల మధుసూదన్, మాజీ సర్పంచ్ అచ్చియమ్మ, బీజేపీ మండల అధ్యక్షుడు కురుసం రాజబాబు,జనసేన నాయకుడు తాటికొండ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## బస్టాండ్‌లో ప్రైవేటు వాహనాల పార్కింగ్ ప్రయాణికులకు ఇబ్బందులు



**అడ్డతీగల, సెప్టెంబర్ 03, ప్రభాతవార్త** ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ప్రైవేటు వాహనాల పార్కింగ్ ప్రయాణికులకు, ఆర్టీసీ బస్సులకు ఇబ్బందికరంగా మారుతోంది. బస్టాండ్‌లోకి వచ్చి వెళ్లే ఆర్టీసీ బస్సులు ప్రయాణికులను దింపే సమయంలో ప్రైవేటు వాహనాలు అడ్డుగా నిలుస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.బస్సులు నిలిపే ప్రాంతంలోనే ద్విచక్ర వాహనాలు, కార్లు తదితర ప్రైవేటు వాహనాలను నిలిపివేస్తుండటంతో బస్సులు సక్రమంగా నిలపడానికి, ప్రయాణికులను సురక్షితంగా దించడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రద్దీ సమయాల్లో సమస్య మరింత తీవ్రంగా ఉంటోందని చెబుతున్నారు.బస్టాండ్ ఆవరణలో ప్రైవేటు వాహనాల పార్కింగ్‌కు అనుమతి లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, బస్సులు నిలిపే ప్రాంతాన్ని పార్కింగ్ రహిత ప్రాంతంగా స్పష్టంగా గుర్తించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి ప్రైవేటు వాహనాలను క్రమబద్ధీకరించి, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఏపీజేఏసీ అమరావతి ఉద్యమానికి రెవెన్యూ ఉద్యోగుల మద్దతు



**రంపచోడవరం, సెప్టెంబర్ 3: ప్రభాతవార్త.** ఏపీజేఏసీ అమరావతి ఉద్యమ కార్యాచరణలో భాగంగా రంపచోడవరం తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (టీడబ్ల్యూ) కార్యాలయంలో లంచ్ అవర్‌లో రెవెన్యూ ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కరపత్రంలోని అంశాలను ఉద్యోగులకు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్. బాలాజీ, పోలవరం జిల్లా రెవెన్యూ అసోసియేషన్ జేఏసీ అధ్యక్షుడు షేక్ పాయజ్ భాష, డిప్యూటీ తహసీల్దార్లు వీ. రవీంద్రబాబు, సునీత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్. నిర్మల, వెంకటేశ్వరరావు, వీఆర్వోలు, వీఆర్ఏలు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వర్షం కావాలని దేవ, దేవతలకు పూజలు.



**రౌతలపూడి, సెప్టెంబర్ 3.ప్రభాత వార్త.** దేవత లారా,కరుణించండి,వర్షాలను పంపించి ఆదరించండి, దేవుళ్లార దీవించండి. వానలు కురిపించి ఆదరించండి. అంటూ రౌతులపూడి పురవీధుల్లో కులాలు, పార్టీల కతీతంగా జనాలు గుడి, గోపురాలు తిరిగి,ఆలయాలనుసుబ్రపరచి, నీటితో కడిగి,,విగ్రహాలను శుభ్రపరచి, ఒకరి మీద ఒకరు నీళ్లు కుమ్మరించుకుని తడిబట్టలతో గ్రామంలో వీధులన్నీ తిరుగుతూ ఆయా మందిరాలలోనున్న దేవతలకు,దేవుళ్ళకు పూజలు నిర్వహించారు. గ్రామంలో మహిళలు, పురుషులు,పార్టీలకతీతంగా అన్ని హిందూ గుడు లకు వెళ్ళి వర్షం కురిపించి రైతులను ఆదుకోవాలని కోరారు. అమ్మ వారి ఆలయాలలో మేకలను బలులర్పించారు. అన్ని పార్టీల నాయకులు, ప్రజలు మహిళలు,కోలాహలంగా గ్రామంలో ఊరేగుతూ తండోపతండాలుగా రావడంతో రౌతులపూడి లో పండుగ వాతావరణం నెలకొంది.చూపరులను అనంతోత్సవాల్తో ముంచెత్తింది. ఈ కార్య క్రమంలో వై సీ పీ నాయకులు వాసిరెడ్డి భాస్కర రావు, మాజీ ఎంపీ పీ ఇటశీశెట్టి భాస్కరబాబు, స్థానిక వైద్యుడు గంటా గోపి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పని కల్పించడం లేదని ఆవేదన

**కాత్రేనికో సెప్టెంబర్ 03 (ప్రభాతవార్త)** కాత్రేనికోన పంచాయతీ చెంచుల గరువులో విబి జి రాంజీలో భాగంగా ఉపాధి హామీ పనులు కొంతమందికే చెబుతున్నారని మిగిలిన వారికి చెప్పడంలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు . గ్రామంలో మేట్ ఈ ఏడాది వేసవి సీజన్ నుంచి తన అనుకూలంగా ఉన్న వారికే పని చెబుతున్నారని మిగిలిన చాలామందికి పని కల్పించడం లేదని ఆరోపిస్తున్నారు. వాస్తవానికి పని కావాలని అడిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పని కల్పించాలి. కానీ ఇక్కడ కొంతమందికి చాలా కాలం నుంచి పనులు చెప్పడం లేదని అంటున్నారు. వ్యవసాయ పనులు సైతం పూర్తి స్థాయిలో లేకపోవడంతో కూలి పనులు చేసుకుని జీవన ఆధారం సాగించే తమకు ఉపాధి పని అయినా కల్పించకపోతే తాము కుటుంబంతో బ్రతికేది ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికి పనులు కల్పించాలని కోరుతున్నారు.

## గాయపడిన గిరిజన విద్యార్థినికి మెరుగైన వైద్యం

### -జాయింట్ కలెక్టర్ పరామర్శ.. అవసరమైన పరీక్షలు, చికిత్స అందించాలని ఆదేశం



**రంపచోడవరం, సెప్టెంబర్ 3: ప్రభాతవార్త.** హాస్టల్ భవనంలోని మెట్ల మార్గంలో జారిపడి కాలికి గాయమైన గిరిజన సంక్షేమ శాఖ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని పాపను పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ గురువారం పరామర్శించారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ సూర్య ప్రకాశరావును ఆదేశించారు. అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, ఆపరేషన్‌కు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థిని తల్లితో మాట్లాడిన జాయింట్ కలెక్టర్.. మెరుగైన చికిత్స అందేలా జిల్లా యంత్రాంగం నుంచి అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. ఓపీకి వస్తున్న రోగుల సంఖ్య, చికిత్స పొందుతున్న వారి వివరాలను తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి తక్షణమే వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన ఉచిత మందులు అందించాలని ఆదేశించారు. అన్ని రకాల మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ సూర్య ప్రకాశరావు, వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జగ్గంపేట శ్రీ ప్రజ్ఞ విద్యా సంస్థలలో కృష్ణ జన్మాష్టమి సంబరాలు:

### - ఉట్టి కొట్టి సందడి చేసిన విద్యార్థులు:



**జగ్గంపేట, సెప్టెంబర్ 03 (ప్రభాతవార్త )** జగ్గంపేట శ్రీ ప్రజ్ఞ విద్యా సంస్థలలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. చైర్మన్ బండారు నాగబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలతో క్యాంపస్ మొత్తం బృందావనంలా మారిపోయింది.వేడుకల్లో భాగంగా చిన్నారులు శ్రీ కృష్ణుడు, గోపికల వేషధారణలో స్టేజ్ పై సందడి చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. కృష్ణుని విగ్రహానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు కృష్ణాష్టమి శ్లోకాలు ఆలపించి అందరినీ భక్తి పారవశ్యంలో ముంచెత్తారు.వేడుకల్లో హైలైట్ గా విద్యార్థులు ఉత్సాహంగా ఉట్టి కొట్టారు. చిన్నారుల కేరింతలతో, భక్తి గీతాలతో క్యాంపస్ అంతా కోలాహలంగా మారింది.ఈ సందర్భంగా చైర్మన్ బండారు నాగబాబు మాట్లాడుతూ చిన్నారులలో చిన్నతనం నుండే భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించడమే తమ లక్ష్యమని, పుస్తకాల చదువుతో పాటు సంస్కృతిని కూడా నేర్పిస్తేనే పరిపూర్ణ విద్యార్థులుగా తీర్చిదిద్దగలమని అన్నారు. ప్రతి విద్యార్థిలో కృష్ణుని చిలిపితనం, ధైర్యం ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ తుమ్మల శ్వేత, ప్రిన్సిపల్ కే అభి, ఇంచార్జ్ కొల్లా శ్రీనివాస్, పులిగ పవన్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వాడపల్లి వెంకన్న నిత్యాన్న పథకానికి రూ 100116/- విరాళం...

### -స్వామివారికి అష్టోత్తర పూజ, నిత్యకళ్యాణంలో పాల్గొని తరించిన అశేష భక్త జనం.



**ఆత్రేయపురం, సెప్టెంబర్,03,(ప్రభాత వార్త)** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి నిత్యాన్న పథకానికి కాతేరు గ్రామానికి చెందిన బొల్లి రత్నాజీ రావు, సరోజిని దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ 100116/- విరాళంగా అందించారు. స్వామివారి దర్శనం అనంతరం వారికి ఆలయ అర్చకులు , వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు లు శ్రీ స్వామివారి చిత్రపటం , ప్రసాదాలను అందజేశారు. గురువారం ఉదయం స్వామివారికి శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఐశ్వర్య హోమం, గోపూజ, అష్టోత్తర శతనామావళి, కల్యాణం, బాలభోగం, నివేదన తదితర కార్యక్రమాలు అర్చకులు ఘనంగా నిర్వహించారు.వేలాది మంది భక్తుల గోవింద నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. శ్రీవారి కల్యాణం కమనీయంగా జరిగింది. ఈ సందర్భంగా కంకణధారణ, పాదోప్రక్షాళన, కన్యాదానం, మధుపర్కప్రాశన, సూత్రధారణ, యజ్ఞోపవేతధారణ, తలంబ్రాలు క్రతువును అర్చకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు.. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం శ్రీ స్వామివారి నిత్యాన్నదానం లో పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. వచ్చిన భక్తులకు ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేశారు.

## వైద్యం ముసుగులో మూడేళ్లుగా బంగారం చోరీలు

### -ఆర్ఎంపీ అరెస్టు.. 82 గ్రాముల బంగారం, రెండు కోడి పుంజులు స్వాధీనం



**రాజవొమ్మంగి, సెప్టెంబరు 3, ప్రభాతవార్త** రాజవొమ్మంగి పోలీస్‌స్టేషన్ పరిధిలో గత మూడేళ్లుగా వైద్యం ముసుగులో వరుస చోరీలకు పాల్పడుతున్న ఆర్ఎంపీని పోలీసులు అరెస్టు చేశారు. అనకాపల్లి జిల్లా అర్జాపురానికి చెందిన మడగల శ్రీనివాస్ (28) దూసరపాము గ్రామంలో ఉంటూ ఆర్ఎంపీగా పనిచేస్తున్నాడు. రంపచోడవరం డీఎస్పీ గురువారం రాజవొమ్మంగి పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో నేరాల వివరాలను వెల్లడించారు. గత మూడేళ్లుగా 82 గ్రా. బంగారం, 20 తులాల వెండి, రూ. 54 వేలు నగదు, కోడి పుంజులు చోరీ జరిగినట్లు పిర్యాదులు ఉన్నాయని డీఎస్పీ అన్నారు. రాజవొమ్మంగి, దూసరపాము ప్రాంతాల్లో ఒంటరిగా ఉండే వృద్ధులు, మహిళలను లక్ష్యంగా చేసుకుని పగటిపూట వైద్యం చేస్తూ, రాత్రివేళ ఇళ్లలో చోరీలకు పాల్పడినట్లు డీఎస్పీ తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో చోరీలు చేసినట్లు విచారణలో వెల్లడైనట్లు డీఎస్పీ అష్రఫ్ అలీ వెల్లడించారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు ఈనెల 2న బోయపాడు జంక్షన్ వద్ద శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, ఆరు ఇళ్లలో చోరీలకు పాల్పడినట్లు అంగీకరించినట్లు తెలిపారు. అతని నుంచి 82 గ్రాముల బంగారం, రెండు కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నారన్నారు. రాజవొమ్మంగి సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ వెంకట్రావు ఆధ్వర్యంలో హెచ్‌సీ జె.వి. రమణ, కానిస్టేబుళ్లు చిన్నాలుదొర, సూర్యప్రకాష్ చోరీ కేసులను ఛేదించారు. వారిని డీఎస్పీ అభినందించారు. నిందితుడిని అడ్డతీగల కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

## నర్సు ఊకె శిరీష హంతకుడిని ఉరి తీయాలని ఆదివాసీ జెఏసి ర్యాలి



**వి.ఆర్.పురం,సెప్టెంబర్ 3,ప్రభాతవార్త** మండల కేంద్రం రేఖపల్లిలో గురువారం ఆదివాసీ జెఏసి ఆధ్వర్యంలో నర్సు ఊకె శిరీష హంతకుడిని ఉరి తీయాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, గిరిజన సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున ర్యాలి నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ప్రాంతం నుండి రేఖపల్లి జంక్షన్ రోడ్ వరకు ర్యాలి చేశారు. గత నాలుగు రోజుల క్రితం హైదరాబాద్ తుక్కుగూడ లోని ప్రేమ్ సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి లో నర్సుగా పనిచేసిన, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ములకలపల్లి మండలం, చౌటుగూడెం గ్రామానికి చెందిన ఊకె శిరీష అనే ఆదివాసీ గిరిజన యువతిని ఒ కామాంధుడు హత్యా, అత్యాచారం చేసిన విషయం విదితమే. ఈ ఘటన రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించగా, ఆదివాసీ సంఘాలు ఒక్కటై హంతకుడిని ఉరి తీయాలని నిందిస్తున్నాయి. ఇందులో భాగంగా వి.ఆర్.పురంలో ఆదివాసీ జెఏసి నాయకులు నిరసన తెలిపారు. శిరీష ఆత్మశాంతి కలగాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమార్, మండల కార్యదర్శి పూనెం.ప్రతీఫ్ కుమార్, ఆదివాసీ గిరిజన నాయకపోడు జిల్లా కార్యదర్శి చిక్కాల బాలు తదితరులు మాట్లాడారు. అత్యాచారం, హత్యకు పాల్పడిన నిందితుడికి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా ఖఠినంగా శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే, నిందితుడిని ఎన్ కౌంటర్ చేయడమే మేలన్నారు. తెలంగాణ ప్రభుత్వం మృతురాలి కుటుంబానికి రూ 50 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళా ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయిని, ఉపాద్యాయులు, వివిధ ప్రభుత్వ, ప్రవేటు రంగాలకు చెందిన ఉద్యోగులు, విద్యార్థినిలు, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు 6లో

## రేషన్ కోసం... రెండు కిలోమీటర్లు వెళ్లాల్సిందే..!

**-కొత్త కాలనీవాసుల అవస్థలు -500 కార్డులు ఉన్నా డిపో ఏర్పాటుపై అధికారుల నిర్లక్ష్యం**



**గొల్లప్రోలు, సెప్టెంబర్ 3,(ప్రభాత వార్త)** రేషన్ సరుకుల కోసం కొత్త కాలనీవాసులు ప్రతినెలా అవస్థలు పడుతున్నారు. గొల్లప్రోలు పట్టణ శివారులోని కొత్త కాలనీలో రేషన్ డిపో లేకపోవడంతో బైపాస్ రోడ్డు దాటి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలోని రేషన్ దుకాణానికి వెళ్లాల్సి వస్తోందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యంగా మహిళలు,వృద్ధులు రేషన్ కోసం దూరం నడిచి వెళ్లడం ఇబ్బందికరంగా మారిందని వాపోతున్నారు.కొత్త కాలనీలో సుమారు 450 నుండి 500 వరకు రేషన్ కార్డులు ఉన్నాయని ఇంత పెద్ద సంఖ్యలో కార్డుదారులు ఉన్నప్పటికీ తమ ప్రాంతంలో రేషన్ డిపో ఏర్పాటు చేయకపోవడం బాధాకరమని స్థానికులు పేర్కొన్నారు.ప్రతి నెలా రేషన్ సరుకుల కోసం బైపాస్ రోడ్డు దాటి వెళ్లాల్సి రావడంతో సమయం,డబ్బు వృథా అవుతున్నాయని తెలిపారు.వర్షాలు, ఎండల సమయంలో ఇబ్బందులు మరింత తీవ్రంగా ఉంటున్నాయని చెప్పారు.తమ కాలనీలో చౌకధరల దుకాణం ఏర్పాటు చేయాలని గతంలో సంబంధిత అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్త కాలనీలో రేషన్ డిపో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.-పవన్ కల్యాణ్ జోక్యం చేసుకోవాలికొత్త కాలనీవాసుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జోక్యం చేసుకుని తమ ప్రాంతంలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.450 మంది వరకు కార్డుదారులు ఉన్న ప్రాంతంలో రేషన్ డిపో ఏర్పాటు చేస్తే వృద్ధులు మహిళలు కూలీలు ఇబ్బందులు పడకుండా ఉంటారని పేర్కొంటున్నారు. రేషన్ బియ్యం కొనుగోళ్లకు తెర లేపిన డీలర్లు చాలామంది కార్డుదారులు రేషన్ కోసం రెండు కిలోమీటర్ల దూరం వెళ్లలేకపోతుండడంతో ఇదే అదునుగా భావించిన కొంతమంది రేషన్ డీలర్లు బియ్యం కొనుగోళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తుంది. బియ్యం కాటాను,ఈ ఈ పోస్ యంత్రాన్ని కార్డుదారుల వద్దకు తీసుకుని వెళ్లి బియ్యం ఖరీదు చేస్తున్నట్లు తెలుస్తుంది. కేజీ 17 నుండి 18 రూపాయల వరకు కొనుగోలు చేస్తూ పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన రేషన్ బియ్యం కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది.అలాగే గొల్లప్రోలు పట్టణ పరిధిలో పలువురు డీలర్లు రేషన్ బియ్యం కొనుగోళ్లు ద్వారా నెలకు రూ. 50 వేలకు పైగా సంపాదిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి

## లొల్ల లాకులు నూతన నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్, ఆర్. మహేష్ కుమార్ పరిశీలన...

**-రూ.74.20 కోట్ల వ్యయంతో చేపట్టనున్న లొల్ల లాకుల నూతన నిర్మాణ పనులపై అధికారులతో క్షేత్ర స్థాయిలో చర్చ.-రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి.**



**ఆత్రేయపురం, సెప్టెంబర్,03,(ప్రభాత వార్త).** గత కొన్నేళ్లుగా లొల్ల లాకులు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్థానిక శాసన సభ్యులు బండారు సత్యానందరావు చొరవతో ఆయన ప్రత్యేక దృష్టి సారించి డెల్టా ఆధునీకరణలో భాగంగా వీటి పునర్నిర్మాణానికి సుమారు రూ. 74.20కోట్ల నిధులను మంజూరు చేయించారు.దీంతో గోదావరి మధ్య డెల్టా కు అత్యంత కీలకమైన లొల్ల లాకులు తిరిగి పూర్వ వైభవాన్ని సంతరించుకోనున్నాయి. దీనిలో భాగంగానే ఆత్రేయపురం మండల పరిధిలోని లొల్ల లాకుల నూతన నిర్మాణ ప్రతిపాదనలపై జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ బాబు గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించారు. సుమారు రూ.74.20 కోట్ల వ్యయంతో చేపట్టనున్న లొల్ల లాకుల నిర్మాణ పనులకు సంబంధించిన ప్రణాళికలు, సాంకేతిక అంశాలు, నిర్మాణ విధానాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు.ఈ సందర్భంగా గోదావరి సెంట్రల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. వెంకటేశ్వరరావు, ఆర్టిఓ.జి.వి.వి. సత్యనారాయణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. రవీంద్రబాబు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి. మాధవ్‌లు కలెక్టర్‌కు ప్రాజెక్టు వివరాలను వివరించారు. నిర్మాణానికి అనుసరించనున్న విధానం (మెథడ్ ఆఫ్ కన్స్ట్రక్షన్), పనుల దశలు, కాలపట్టిక, సాంకేతిక అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు.నిర్మాణ పనుల సమయంలో డెల్టా ఆయకట్టు రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కోనసీమ డెల్టాకు నీటి సరఫరా, సాగునీటి వ్యవస్థలకు అంతరాయం కలగకుండా ప్రత్యేక ప్రణాళికతో పనులు చేపట్టాలని సూచించారు. అలాగే నిర్మాణానికి ఏవైనా సాంకేతిక లేదా పరిపాలనా అడ్డంకులు ఉన్నాయా, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు.లొల్ల లాకుల నిర్మాణానికి అవసరమైన స్థలాలను గుర్తించి, పనులకు ఆటంకంగా ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రాజెక్టు నిర్ణీత గడువులో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు.ఈ నూతన లాకుల నిర్మాణం పూర్తయితే కోనసీమ డెల్టా ప్రాంతంలో సాగునీటి నిర్వహణ మరింత మెరుగుపడి, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నీటి పంపిణీ వ్యవస్థ బలోపేతం అవుతుందని అధికారులు తెలిపారు. వారి వెంట తహసీల్దార్ రాపాక రామచంద్రమూర్తి, ఆర్.ఐ. గణేష్, మండల సర్వే, ప్రభావతి తెలుగు యువత అధ్యక్షులు వెచ్చా అనిల్ కుమార్, నీటి సంఘం అధ్యక్షులు జుజ్జువరపు హరిబాబు తదితరులు, ఉన్నారు.

## చెబ్రోలు హత్య కేసు..

**-పోలీస్ స్టేషన్ లో లొంగిపోయిన నిందితులు**



**గొల్లప్రోలు, సెప్టెంబర్ 3,(ప్రభాత వార్త)** సరిహద్దు గోడ తగాదా నేపథ్యంలో జరిగిన పులపకాయల సత్తిబాబు హత్య కేసులో నిందితులు గురువారం పోలీసులకు లొంగిపోయారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ మాట్లాడుతూ గొల్లప్రోలు మండల పరిధి చెబ్రోలు గ్రామ కొత్తపేట వీధిలో నివాసం ఉంటున్న పులపకాయల సత్తిబాబును, అదే గ్రామానికి చెందిన దూళిపూడి యేసమ్మ ఇంటి సరిహద్దు వివాదానికి సంబంధించి రెచ్చగొట్టడంతో ఆమె కుమారుడు దూళిపూడి మహేష్ తీవ్రంగా కొట్టాడు.ఆ దెబ్బలకు తాళలేక సత్తిబాబు అక్కడికక్కడే కుప్పకూలి మరణించారు. హత్య అనంతరం నిందితులు ఇరువురూ గ్రామం నుండి పారిపోయారు.ఈ ఘటనపై సత్తిబాబు బంధువులు ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు. పోలీసులు తమ కోసం గాలిస్తున్నారని తెలుసుకున్న నిందితులు దూళిపూడి మహేష్,తల్లి యేసమ్మ మధ్యాహ్నం సుమారు 2:30 గంటల సమయంలో గొల్లప్రోలు సబ్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ ఎదుట లొంగిపోయినట్టు తెలిపారు.సిఐ జి. శ్రీనివాస్ నిందితులు ఇద్దరిని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

## నర్సరీ రైతుల అభివృద్ధికి సహకరిస్తాం

**-ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హామీ**



**కడియం, సెప్టెంబర్ 3 ( ప్రభాతవార్త)**కడియం మండలం,కడియపులంక సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ నూతన పాలకవర్గం రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు . ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బోర్కు సుబ్బారాయుడు ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు ఎమ్మెల్యేలను కలిసి నర్సరీ రంగం అభివృద్ధి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.నర్సరీ రైతులకు రావ్వ ప్రభుత్వం నుంచి రాయితీలు కల్పించడంతో పాటు, కడియం నర్సరీ రంగం మరింత అభివృద్ధి చెందేందుకు సహాయ సహకారాలు అందించాలని అధ్యక్షుడు బోర్కు సుబ్బారాయుడు ఎమ్మెల్యేలను కోరారు. దీనిపై ఎమ్మెల్యేలు సానుకూలంగా స్పందిస్తూ నర్సరీ రైతుల సమస్యల పరిష్కారానికి, రంగం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాడాల సత్యనారాయణ, పాలంశెట్టి శ్రీనివాస్, పుల్ల శ్రీను, సానా రాజు, కాపశెట్టి వెంకటేష్, ఉండమట్ల అర్జున్, దేగల రాము, దూలం సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఐడీపీతో ఆదిత్య యూనివర్సిటీ అవగాహన ఒప్పందం



**గండేపల్లి, సెప్టెంబర్ 3. ప్రభాతవార్త** విద్యార్థులకు "ఐ ఈ ఎల్ టి ఎస్" విదేశీ ఉన్నత విద్య పై అవగాహనగండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ, విద్యార్థులకు విదేశాల్లో ఉన్నత విద్య అవకాశాలపై అవగాహన కల్పించడంతో పాటు "ఐ ఈ ఎల్ టి ఎస్" శిక్షణ మరియు మార్గదర్శకత్వం అందించే ఉద్దేశంతో ఆదిత్య యూనివర్సిటీ -- ఐడీపీ ఎడ్యుకేషన్ మధ్య అవగాహన ఒప్పందం (ఎం.ఓ.యూ) కుదిరింది అని డిప్యూటీ ప్రో-ఛాన్సలర్ డా. ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం ఐ ఈ ఎల్ టి ఎస్ ఉ ఉన్నత విద్య పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఐ ఈ ఎల్ టి ఎస్ పరీక్ష విధానం, సన్నద్ధత, అవసరమైన స్కోర్లు, విదేశీ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు, స్కాలర్‌షిప్‌లు మరియు విదేశాల్లో ఉన్నత విద్య, కెరీర్ అవకాశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు ప్రపంచ స్థాయి విద్యా సంస్థల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు అవసరమైన నైపుణ్యాలు, ఆంగ్ల భాషా సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.ఐడీపీ తో ఈ భాగస్వామ్యం ద్వారా విద్యార్థులకు ఐ ఈ ఎల్ టి ఎస్ తో పాటు విదేశీ ఉన్నత విద్యకు సంబంధించిన మరిన్ని అవకాశాలు, మార్గదర్శకత్వం అందించనున్నట్లు తెలిపారు.ఐడీపీ విద్య -- ఆంధ్రప్రదేశ్,ఐ ఈ ఎల్ టి ఎస్ కార్యకలాపాలు మరియు వ్యాపార అభివృద్ధి ప్రతినిధి శ్రీ యష్ శర్మ విద్యార్థులకు ఐ ఈ ఎల్ టి ఎస్ పరీక్ష, సన్నద్ధత మరియు విదేశీ విద్యా అవకాశాలు పై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కెరీర్ గైడెన్స్ ఉ స్కిల్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమానికి డిప్యూటీ ప్రో-ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి, ప్రో వైస్-ఛాన్సలర్ (అకడమిక్స్) డా. రమాశ్రీ, ప్రో వైస్-ఛాన్సలర్ (ఇంజినీరింగ్ ఉ సైన్స్) డా. ఎ. రమేష్, డీన్ -- కెరీర్ డెవలప్‌మెంట్ డా. సంజీవ్ రావు, డీన్ -- ఇంటర్నేషనల్ రిలేషన్స్ డా. రంజిత్ పాల్గొన్నారు.ముసాయిదా ఓటర్ల జాబితా పై గ్రామసభలు. తాళ్ళరేవు సెప్టెంబర్ 3 (ప్రభాతవార్త): ముసాయిదా ఓటర్ల జాబితా లో ఎస్.సి. ఎస్. టి.బి.సి. ఓటర్ల జాబితా ప్రచురణలపై మండలంలోని పటవల, సుంకర పాలెం,జార్జిపేట గ్రామపంచాయతీలలో గురువారం డిప్యూటీ ఎంపీడీవో వి. జే.వి.రమణ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. ప్రజలు, ఆయా పార్టీల నాయకుల నుంచి అభ్యంతరాలు స్వీకరించారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఏ.రామరాజు, వల్లి బాబా,దానంసీత శ్రీలక్ష్మి, గ్రేడ్-5 కార్యదర్శులు శ్యామ్, సతీష్,వంశీ నాయకులు గుత్తుల సూర్య నారాయణ, కొత్తూరి కాశి ఈశ్వరుడు,దంగేటి అన్వేష్, ,భజన సత్తిబాబు, దోనం శ్రీనివాసరావు,వాసం శెట్టి గోవిందు, రెడ్డి సుబ్ర హ్మణ్యం, కొటికలపూడి చందు పంచాయతీ, సచివాలయ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కృష్ణుడి వేషధారణలో మోడరన్ చిన్నారుల సందడి



**రామచంద్రపురం,సెప్టెంబర్ 03 (ప్రభాత వార్త):**పట్టణంలోని ముచ్చుమిల్లి ఏబీసీ మోడరన్ ప్రైమరీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు.అకాడమిక్ డైరెక్టర్ ఎ.రమాదేవి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో చిన్నారులు కృష్ణుడు,గోపికల వేషధారణలో సందడి చేసి ఆకట్టుకున్నారు.శ్రీకృష్ణుని గొప్పతనాన్ని చాటుతూ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు,సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.చిన్నారుల కృష్ణవేషధారణ,సాంస్కృతిక ప్రదర్శనలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆసక్తిగా తిలకించారు.ఈ సందర్భంగా మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జి.వి.రావు మాట్లాడుతూ.. శ్రీకృష్ణ తత్వం విశ్వవ్యాప్తమైందన్నారు. శ్రీకృష్ణుడు ప్రపంచానికి అందించిన అత్యుత్తమ ఆధ్యాత్మిక సందేశం భగవద్గీత అని పేర్కొన్నారు.అనంతరం ముఖ్య అతిథి ప్రముఖ నేత్ర వైద్యుడు డాక్టర్ శ్రీనివాసరావు చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు.అలాగే అకాడమిక్ డైరెక్టర్ ఎ. రమాదేవి మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను చిన్నారులకు విద్యార్థి దశ నుంచే పరిచయం చేయాలనే ఉద్దేశంతో పాఠశాలలో పండుగలను వినూత్నంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శ్రీకృష్ణుని బోధనలు దేశ, విదేశాల్లో ఎంతోమందికి స్ఫూర్తినిస్తున్నాయని అన్నారు.కార్యక్రమంలో డాన్స్ మాస్టర్ చెవ్వూరి తులసీరామ్,ఏబీసీ ప్రైమరీ పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శ్రీ గీతంలో ఘనంగా శ్రీకృష్ణ జన్మ దిన వేడుకలు



**గండేపల్లి. సెప్టెంబర్ 3. ప్రభాతవార్త**గండేపల్లి శ్రీ గీతం ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో శ్రీకృష్ణ జన్మదిన వేడుకలను గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీ గీతం కరస్పాండెంట్ వి ఎస్ పి చౌదరి మాట్లాడుతూ ప్రతి ఏడాది తమ పాఠశాలలో క్రమం తప్పకుండా శ్రీకృష్ణ జన్మ దిన వేడుకలను నిర్వహించడం జరుగుతుందన్నారు. కులమతాలకు అతీతంగా శ్రీకృష్ణుని జన్మదిన వేడుకలను నిర్వహించమన్నారు.ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని చిన్నారులు శ్రీకృష్ణుని,గోపికల వేషధారణలు ధరించి అందర్నీ ఆకట్టుకున్నారన్నారు. తల్లిదండ్రులు ఎంతగానో శ్రమించి పిల్లలను చక్కని వేషధారణ చేసి పంపించడం చాలా అభినందనీయమన్నారు. ప్రతి పండగను నేటి విద్యార్థులకు తెలియపరిచే విధంగా జరిపించి,మన సంస్కృతి సాంప్రదాయాలను విద్యార్థిని విద్యార్థులకు తెలియపరచడమే శ్రీ గీతం లక్ష్యం అని తెలిపారు.కృష్ణుని వేషధారణ ధరించిన విద్యార్థులు ఉత్సాహంగా ఉట్టి కొట్టి ఈ వేడుకలను మరింత కేరింతలు కొట్టించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు, పాల్గొన్నారు.

## ఘనంగా రికార్డు అసిస్టెంట్ సత్తిరెడ్డి శేషారత్నం దంపతుల సన్మానం.



**కడియం ,సెప్టెంబర్ 3 ( ప్రభాతవార్త)** కడియం మండలం మురమండ గ్రామంలోని శ్రీ పిచ్చుగ కోటయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రికార్డు అసిస్టెంట్‌గా సేవలందించిన గొలుగూరి సత్తిరెడ్డి పదవీ విరమణ సందర్భంగా ఆయన, ఆయన సతీమణి శేషారత్నం దంపతులను కళాశాల ప్రిన్సిపాల్ బీకేఆర్ చౌదరి, సిబ్బంది ఘనంగా సన్మానించారు. సత్తిరెడ్డి గతంలో విధులు నిర్వహించిన అనపర్తి జీబీఆర్ కళాశాల సిబ్బంది కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా సత్తిరెడ్డి శేషారత్నం దంపతులకు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన సభలో ప్రిన్సిపాల్ బీకేఆర్ చౌదరి మాట్లాడుతూ.. మురమండ పిచ్చుగ కోటయ్య కళాశాలలో సత్తిరెడ్డి గత ఐదేళ్లుగా విశేష సేవలందించారని, ఎటువంటి వివాదాలకు తావులేకుండా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారని కొనియాడారు. ఈ సందర్భంగా టీఎన్వీ వెంకటేశ్వర్లు, బి. సత్యహరిత, ఎం. విజయకుమార్, టీ. శ్రీనివాసరెడ్డి, సీహెచ్ శ్రీనివాసరెడ్డి, జీ. జగన్నాథరెడ్డి తదితరులు సత్తిరెడ్డి సేవలను కొనియాడి, పదవీ విరమణ అనంతరం ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రత్తిపాటి రామారావు చౌదరి, ఈదర పాపారావు, యర్రంశెట్టి వీరబాబు, షేక్ మీరాబాయి, కళాశాల సిబ్బంది, బంధువులు, స్నేహితులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ముసాయిదా ఓటర్ల జాబితా పై గ్రామసభలు.



**తాళ్ళరేవు సెప్టెంబర్ 3 (ప్రభాతవార్త):**ముసాయిదా ఓటర్ల జాబితా లో ఎస్.సి. ఎస్. టి.బి.సి. ఓటర్ల జాబితా ప్రచురణలపై మండలంలోని పటవల, సుంకర పాలెం,జార్జిపేట గ్రామపంచాయతీలలో గురువారం డిప్యూటీ ఎంపీడీవో వి. జే.వి.రమణ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. ప్రజలు, ఆయా పార్టీల నాయకుల నుంచి అభ్యంతరాలు స్వీకరించారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఏ.రామరాజు, వల్లి బాబా,దానంసీత శ్రీలక్ష్మి, గ్రేడ్-5 కార్యదర్శులు శ్యామ్, సతీష్,వంశీ నాయకులు గుత్తుల సూర్య నారాయణ, కొత్తూరి కాశి ఈశ్వరుడు,దంగేటి అన్వేష్, ,భజన సత్తిబాబు, దోనం శ్రీనివాసరావు,వాసం శెట్టి గోవిందు, రెడ్డి సుబ్ర హ్మణ్యం, కొటికలపూడి చందు పంచాయతీ, సచివాలయ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**గండేపల్లి, సెప్టెంబర్ 3. ప్రభాతవార్త**గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన భోగాది సోమరాజు (65) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మృతుడు ఇంటి నుండి ఎక్సెల్ బండి పై పొలానికి వెళ్లి, తిరిగి వస్తూ హై స్కూల్ సెంటర్ వద్ద రోడ్డు క్రాస్ చేస్తుండగా, జగ్గంపేట వైపు నుండి రాజమండ్రి వైపుకు వెళుతున్న వాహనం ఢీ కొట్టింది. డ్రైవర్ అతి వేగంగా నిర్లక్ష్యంగా తన వాహనాన్ని నడిపి సోమరాజు ఎక్సెల్ బండిని ఢీకొట్టగా తలకు, కాలు,మడమ కు బలమైన రక్తపు గాయాలయి కాకినాడ గవర్నమెంట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ గురువారశీ మృతి చెందాడు.మృతుని మనవడు ఇచ్చిన ఫిర్యాదు పై గండేపల్లి ఎస్సై యు వి శివ నాగ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

## కడియం కీర్తి పతాక ఎగురవేసిన ఉదయ రిషిత..

**-ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు**



**కడియం, సెప్టెంబర్ 3 (ప్రభాతవార్త)**మండల కేంద్రం కడియం గ్రామానికి చెందిన వంగపండు ఉదయ రిషిత ప్రతిభతో అరుదైన ఘనత సాధించింది. నీట్ కౌన్సెలింగ్ మొదటి విడతలో విశాఖపట్నంలోని ప్రతిష్ఠాత్మక ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ ఉచిత సీటు సాధించింది.వైద్య విద్యలో ఎంతో ప్రతిష్ఠ కలిగిన ఆంధ్రా మెడికల్ కాలేజీలో సీటు సాధించడం పట్ల కడియం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. పట్టుదల, కృషితో ఉదయ రిషిత సాధించిన ఈ విజయం గ్రామానికి గర్వకారణమని పలువురు పేర్కొన్నారు.చిన్ననాటి నుంచి చదువుపై ఆసక్తి, లక్ష్యసాధన పట్ల పట్టుదలతో ముందుకు సాగిన ఉదయ రిషిత భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని గ్రామస్తులు ఆకాంక్షించారు. ఉదయ రిషిత త్వరలోనే 'డాక్టర్ ఉదయ రిషిత'గా సేవలందిస్తూ మరెందరికో ఆదర్శంగా నిలవాలని వారు కోరుకున్నారు.ఆమెకు కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, కడియం గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో వైద్య రంగంలో మరింత ఉన్నత స్థాయికి చేరుకుని ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు.

## ఘనంగా గురు పూజోత్సవము...



**సఖినేటిపల్లి/మలికిపురం సెప్టెంబర్ 3, ప్రభాత వార్త:** డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవం (గురుపూజోత్సవం)ను మలికిపురంలోని శ్రీ దీప్తి కళాశాలలో ఆల్ స్టూడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు వి.వి.ఎస్. గణేష్ పొలిశెట్టి నేతృత్వంలో గురు పూజోత్సవమును అత్యంత ఘనంగా నిర్వహించారు.అధికారులు, ఉపాధ్యాయులు 400 మంది విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరైనారు. పలువురు మాట్లాడుతూ దేశ అభివృద్ధికి విద్యే ప్రధాన ఆధారం అని, విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాల పరిజ్ఞానానికే పరిమితం కాకుండా, విద్యతోపాటు సంస్కారం, క్రమశిక్షణ, నైతిక విలువలు, మానవతా దృక్పథం కలిగి ఉండాలని సూచించారు.తల్లిదండ్రుల తర్వాత విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దే గొప్ప బాధ్యత గురువుల దేనని వక్తలు పేర్కొన్నారు. విద్యార్థుల్లో జ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు, వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, తీర్చిదిద్దిన గురువులను విద్యార్థులు జీవితాంతం గౌరవంతో గుర్తుంచుకోవాలని సూచించారు. గణేష్ పొలిశెట్టి మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం మంచి మార్కులు సాధించడమే లక్ష్యంగా కాకుండా, నైతిక విలువలు, బాధ్యత, క్రమశిక్షణ, సేవాభావం మంచి సంస్కారం కలిగిన వ్యక్తులుగా ఎదగాలని ఆకాంక్షించారు."విద్యార్థి భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి గురువుకు ఉంది. గురువు చెప్పే పాఠాలు కేవలం పుస్తకాల్లోని విషయాలకే పరిమితం కాకుండా, జీవితాన్ని ఎలా నడిపించాలో కూడా నేర్పుతాయి. అందుకే ప్రతి విద్యార్థి తన జీవితంలో విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఎల్లప్పుడూ గౌరవంతో స్మరించుకోవాలి" అని గణేష్ పొలిశెట్టి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓలు విజయశ్రీ, వై. సత్యనారాయణ, ప్రసాద్, శ్రీనివాస్, దీప్తి కళాశాల ప్రిన్సిపాల్ సుధ, ప్రధానోపాధ్యాయులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## చోరీకి పాల్పడిన దొంగలు అరెస్టు

**-స్వాధీనం చేసుకున్న వెండి, బంగారం వస్తువులు-సీఐ శ్రీనివాస్**



**యు.కొత్తపల్లి, సెప్టెంబర్ 3(ప్రభాతవార్త)** :కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం గోర్సలో నందూరి సూర్యనారాయణ రావు ఇంటిలో జరిగిన దొంగతనానికి సంబంధించి దొంగలను అదుపులోకి తీసుకున్నట్లు పిఠాపురం సీఐ శ్రీనివాస్ గురువారం తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ లో ఎస్సై వెంకటేష్ తో కలిసి విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. నిందితుల వద్ద నుంచి గ్రా.18 బంగారు ఆభరణాలు, గ్రా.1110 వెండి వస్తువులు, రెండు సెల్ ఫోన్లు, నేరానికి ఉపయోగించిన సుజికి ఏక్సిస్ ద్విచక్ర వాహనం, ఒక కారును స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. సాంకేతిక ఆధారాలను ఉపయోగించి దొంగతనానికి పాల్పడింది పాత నేరస్తుడు మూలపేట చెందిన ఆవాల మణికంఠగా గుర్తించామన్నారు. గత నెల 21తేదీన సూర్యనారాయణ రావు కుటుంబం హైదరాబాదు వెళ్లి 24తేదీన ఇంటికి రావడం జరిగింది. తాళాలు వేసి ఉన్న ఇంటిలోకి ప్రవేశించి బీరువా తెరచి ఉండడంతో బంగారు, వెండి వస్తువులు కనిపించకపోవడంతో పోలీసులకు పిర్యాదు చేసారు. తమ దర్యాప్తులో పాత నేరస్తుడు మణికంఠతో పాటు ఇద్దరు మైనర్లు ఉన్నట్లు కనుగోనడం జరిగింది. తనను పిఠాపురం కోర్టులోను, ఇద్దరు మైనర్లను తల్లిదండ్రులు సమక్షంలో రాజమహేంద్రవరం బాల నేరస్థుల కోర్టులో హాజరు పరచడం జరుగుతుందన్నారు. మణికంఠపై ఇప్పటికీ 7కేసులు ఉన్నాయన్నారు. దొంగతనం కేసును చేధించిన పోలీసు సిబ్బందిని అభినందించారు.

## రహదారి పూర్తికి సహకరించాలని గిరిజనులు అర్జీ



**రాజవొమ్మంగి, సెప్టెంబరు 03, ప్రభాతవార్త** బడదనాంపల్లి పంచాయితీ కిమ్మలగడ్డ గ్రామం నుండి ముర్లవారివీధి గ్రామం వరకూ 6 కిమీ బి. టి. రహదారి వేయడానికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని, కొత్తవీధి కన్నయ్య రిజర్వాయర్ నుండి అటవీశాఖ భూములను రహదారి పనులు నిలిపివేసినట్లు రాజవొమ్మంగి డిప్యూటీ తహసీల్దారు కరీముల్లా మండల టిడిపి అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు ఆధ్వర్యంలో గిరిజనులు వినతిపత్రం ఇచ్చారు. ఈ ప్రాంతంలో సర్వే నెంబర్ 47 నుండి 83 వరకూ అటవీ భూమిగా చూపిస్తోన్నట్లు అధికారులు చెబుతున్నారన్నారు.1100 మీటర్లు రహదారి నిర్మాణానికి సహకరించాలని అర్జీలో కోరారు. ఈకార్యక్రమంలో గొల్లపూడి పెద్దిరాజు, చల్లా దేవుడు, కాకర లోవరాజు, డి. శివప్రసాద్, బారీగా గిరిజనులు పాల్గొన్నారు.

## సఖినేటిపల్లి ఎస్సైగా హరికోటి శాస్త్రి నియమాకం...



**సఖినేటిపల్లి సెప్టెంబర్ 3, ప్రభాత వార్త:** డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి పోలీస్ స్టేషన్ ఎస్సైగా హరికోటి శాస్త్రి నియ మితులయ్యారు. ఇప్పటి వరకు సఖినేటిపల్లి ఎస్సైగా విధులు నిర్వహించిన దుర్గా శ్రీనివాస్ జిల్లా ఎస్పీ కార్యాలయం లో రిపోర్ట్ చేయనున్నారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై హరికోటి శాస్త్రి మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని, వారి సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, అక్రమాలు, నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని ఎస్సై హరికోటి శాస్త్రి కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులను సమర్థవంతంగా నిర్వహిస్తామని తెలిపారు.

## 82 భూమి పట్టాలు పంపిణీ



**రాజవొమ్మంగి, సెప్టెంబర్ 03, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలం కిర్రాబు పంచాయితీ బోయపాడు, బొడ్లగొంది గ్రామాల్లో గురువారం భూమి పట్టాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. బొడ్లగొందిలో 39 పట్టాలు, బోయపాడులో 43 పట్టాలను లబ్ధిదారులకు మండల బీజేపీ అధ్యక్షులు లోసుల రాజబాబు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో వీఆర్వో కనిగిరి మురళీకృష్ణ, స్థానిక గిరిజనులు పాల్గొన్నారు.

## ఎస్సీ ఎస్టీ ,బీసీ ఓటరు జాబితా పై గ్రామ సభలు



**కాట్రేనికోన సెప్టెంబర్ 03(ప్రభాతవార్త)** త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికల తరుణంలో ఎస్సీ, ఎస్టీ, బిసి ఓటర్ల జాబితా ముసాయిదాకు సంబంధించి గురువారం మండలంలో చెయ్యేరు ,కాట్రేనికోన గ్రామ పంచాయతీల్లో ఎంపీడీవో రాజేశ్వర రావు, బ్రహ్మసమేధ్యం పంచాయతీ పరిధిలో తహసిల్దార్ రవి కిరణ్ ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. పోలింగ్ స్టేషన్లు ,ఓటరు జాబితాలపై అభ్యంతరాలు, తదుపరి కార్యాచరణ పై గ్రామ పెద్దలతో చర్చించారు. ఓటరు జాబితా వివరాలను ప్రజలకు తెలియజేశారు. ఎంపీడీఓ చెయ్యేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను పరిశీలించారు. స్వయంగా భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ సక్రమంగా అమలు చేయాలని,విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులను ఆదేశించారు.ఉపాధ్యాయులతో మాట్లాడుతూ నాణ్యమైన విద్య అందించాలని, విద్యార్థుల అభ్యాసనా సామర్థ్యలను మెరుగు పరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నడింపల్లి సుబ్బరాజు, చెల్లి సురేష్, సంఘాని వెంకటేశ్వర్లు,ఎంపీటీసీ సూర్యమహాలక్ష్మి, కార్యదర్శులు, స్థానికులు ,సిబ్బంది పాల్గొన్నారు.

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**పిఠాపురం, సెప్టెంబర్ 3 ( ప్రభాతవార్త )** పిఠాపురం భాష్యం స్కూల్ ఆవరణలో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. బాలకృష్ణుని లీలలను స్మరించుకుంటూ పాఠశాల ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ముచ్చటగా అలరిస్తూ అందరినీ ఆకట్టుకున్నారు.శ్రీకృష్ణుని మహిమను, ఆయన బోధించిన ధర్మమార్గాన్ని తెలియజేస్తూ విద్యార్థులు భక్తిగీతాలు ఆలపించడంతో పాటు నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. చిన్నారుల చక్కటి ప్రదర్శనలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం సంప్రదాయబద్ధంగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా నిర్వహించారు. విద్యార్థుల కేరింతలు, సందడితో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది.భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలు, నైతిక జీవన విధానాన్ని చిన్నారులకు పరిచయం చేయడంలో ఇటువంటి వేడుకలు ఎంతో దోహదపడతాయని ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## రమ్య ఫుడ్స్ ఎల్ఎల్ పి కంపెనీలో కార్మికుడు మృతి



**రావులపాలెం, సెప్టెంబరు 03 (ప్రభాతవార్త ) :** ఈతకోట రమ్య ఫుడ్స్ ఎల్ఎల్ పి కంపెనీలో పనిచేస్తున్న కార్మికుడు మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సిఐ జి రమేష్ బాబు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కొత్తపేట మండలం గంటి శెట్టిబలిజ పేటకు చెందిన గుత్తుల రాజు (23) రమ్య ఎల్ఎల్పీ కంపెనీలో జనరల్ ఆపరేటర్ కు హెల్పర్ గా విధులు నిర్వహిస్తున్నాడు.అయితే బుధవారం రాత్రి కంపెనీలో ఫౌడర్ ట్యాంకర్ పైన పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు ట్యాంకర్లో పడటంతో మిషన్ ఆపుచేసి యాజమాన్యం స్థానిక ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.మృతుడు తల్లి గుత్తుల భారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్సై రమణారెడ్డి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రమేష్ బాబు తెలిపారు.

## దాతలారా దయ చూపండి

**-మానవహక్కుల సంఘం ఆంధ్ర తెలంగాణ చైర్పర్సన్ ఖండవల్లి లక్ష్మీ విజ్ఞప్తి**



**రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త,** తెలుగుదేశం పార్టీలో ఎంతోకాలంగా కష్టపడి పనిచేసి న దివాన్ చెరువు గ్రామానికి చెందిన కార్యకర్త మొలపర్తి ఎస్తేరు రాణి, బోను క్యాన్సర్ బ్లడ్ క్యాన్సర్ల తో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుందని, మానవహక్కుల సంఘం ఆంధ్ర తెలంగాణ చైర్పర్సన్ ఖండవల్లి లక్ష్మీ తెలిపారు, ఎస్తేరు రాణి కి మెరుగైన వైద్యం దాతలు తెలుగుదేశం పార్టీ నాయకులు, ప్రభుత్వం దయ చూపి ఆర్థిక సహాయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు, బిజెపి నాయకులు విశ్వహిందూ పరిషత్ రామసేన అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావు 25000 ఆర్థిక సహాయం చేశారని ఆ మొత్తం తో పాటు తాను మరొక ఐదు వేలు కలిపి 30 వేల రూపాయలు ను గురువారం బాధితురాలకు అందజేశారు ఈ కార్యక్రమంలో బాధితురాలు తల్లి, మరియమ్మ రాయి ఆశ సత్యవతి జ్యోతి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## రంగారావు కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్ రెడ్డి




**యు.కొత్తపల్లి, సెప్టెంబర్ 3(ప్రభాతవార్త)** :మండలంలోని వాకతిప్పకు చెందిన రావు వెంకట రంగారావు ఇటీవల మృతి చెందారు. గురువారం కాకినాడ పట్టణ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి రంగారావు కుమారుడు వెంగళరావు(చినబాబు)ను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో వీవీఎస్ విద్యాసంస్థల అధినేత అనిశెట్టి కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మాస్టర్ వీవర్ లొల్ల వీర వెంకట సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ చేనేత విభాగం అధ్యక్షుడు గోపి హరిబాబు, కుతుకుడుమిల్లి ఎంపీటీసీ రాయుడు విష్ణు, మాజీ సర్పంచ్ లు కర్రి చిన్నారావు, పాలాని దొరబాబు తదితరులు ఉన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**కాట్రేనికోన ,సెప్టెంబర్ 03 (ప్రభాతవార్త)**శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని కాట్రేనికోన మండలం కందికుప్ప ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుని ప్రవల్లిక ఆధ్వర్యంలో గురువారం ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా బొమ్మల కొలువు, ఉట్టి కార్యక్రమం నిర్వహించడంతో పాటు, విద్యార్థులు శ్రీకృష్ణుడు మరియు గోపికల వేషధారణలో పాల్గొని వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించేందుకు ప్రవల్లిక టీచర్ ఆధ్వర్యంలో నూతన తరహా కార్యక్రమాలను నిర్వహించడం పలువురు అభినందించారు.

## సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



**సీతానగరం, సెప్టెంబర్ 3, (ప్రభాతవార్త)** :మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు తమ పరిధిలో జరిగిన అభివృద్ధి కార్యకలాపాలను వివరించారు. అనంతరం ఎంపీడీవో భారతి ఆధ్వర్యంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ చల్లమళ్ళ వెంకటలక్ష్మితో పాటు ఎంపీటీసీలను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో చల్లమళ్ళ సుజీరాజు, వైస్ ఎంపీపీలు సత్యం మదన్ మోహన్ బాబు, సురేష్ రాజు, పలువురు ఎంపీటీసీలు, వివిధ శాఖల మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పేకాట శిబిరంపై పోలీసుల దాడి



**సీతానగరం, సెప్టెంబర్ 3, (ప్రభాతవార్త)** :మండలంలోని మిర్తిపాడు గ్రామ శివారులో పేకాట శిబిరంపై ఎస్సై ఎల్.శ్రీను నాయక్, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 10,750 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. ఎవరైనా కోడి పందేలు, పేకాట వంటి అసాంఘిక చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## విద్యుత్ దీప కాంతులతో కృష్ణాలయాలు



**యు.కొత్తపల్లి, సెప్టెంబర్ 3(ప్రభాతవార్త) :** శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని మండలంలోని కృష్ణాలయాలు విద్యుత్ దీపకాంతుల, పూల మాలల అలంకారాల వెలుగులతో భక్తులను అకట్టుకుంటున్నాయి. శుక్రవారం జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించడానికి భక్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా ప్రత్యేక పూజలు, అర్చన లను, భజనలు ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా జరుతున్నాయి. జన్మాష్టమి వేడుకలలో భాగంగా సాంప్రదాయ ఉట్టి కొట్టే వేడుకకు భక్తులు భారీగా హాజరవుతారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407,